17-09Pg1exHMNWJQEV VJA_17-09Pg1exHMNWJQEV.qxd 9/17/2025 12:28 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-9-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 227 పేజీలు: 12 వెల: 6.50

డెహ్రాడూన్‌లో భారీ వర్షాలు.. 10 మంది గల్లంతు

25న డొనాల్డ్ ట్రంప్‌తో పాక్ ప్రధాని భేటీ

9లో



15 నెలల్లో 122 భారీ

## ప్రాజెక్టులకు అనుమతి

లండన్ రోడ్‌షోలో మంత్రి లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖలో నవంబర్ 14,15తేదీల్లో ఎపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పార్టనర్ షిప్ సమ్మిట్ 2025లో పాల్గొనాల్సిందిగా గ్లోబల్ లీడర్లను ఆహ్వానిస్తూ రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం రాత్రి లండన్‌లో హైప్రొఫైల్డ్ ఇన్వెస్టర్స్ రోడ్ షో నిర్వహించినట్లు సమాచారం. ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరక్టర్స్, పాల్ మాల్ కన్వెన్షన్ వేదికగా రాత్రి 7గంటలకు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11.30గంటలకు) నిర్వహించే ఈ రోడ్ షోలో యుకె డిప్యూటీ హై కమిషనర్ సుజిత్ ఘోష్, టెక్ మహీంద్రా యూరప్ విభాగం ప్రెసిడెంట్ హర్షాల్ అస్నానీ, ఐసిఐసిఐ బ్యాంకు యుకె విభాగం సిఇఒ రాఘవ్ సింఘాల్, ఎపిఐఐసి వైస్ చైర్మన్ ఎండి అభిషిక్త్ కిషోర్ తదితరులు పాల్గొన్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో గ్లోబల్ ఫండ్, మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలు, సర్వీస్ ప్రొవైడర్ కంపెనీలకు చెందిన 150మంది సిఇఓలు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నట్లు సమాచారం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు, గత 15నెలల కాలంలో రాష్ట్రానికి వచ్చిన భారీ పెట్టుబడులు, కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకుగల అవకాశాలను మంత్రి లోకేష్ ఈ సందర్భంగా వివరించినట్లు సమాచారం. గత 15నెలల కాలంలో ఆంధ్రప్రదేశ్ >>2

# 'స్వచ్ఛాంధ్ర' ఓ ఉద్యమం

కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు

రబీ సీజన్‌కూ పక్కా నీటి ప్రణాళిక

లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం

యేటా రూ. 5 వేల కోట్ల ఎగుమతులు

లక్ష్యం: ముఖ్యమంత్రి



మంగళవారం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల కోసం కార్పొరేషన్ ద్వారా నిధులు విడుదల చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. స్వచ్ఛభారత్ కోసం ఏ జిల్లాలో అయినా పైలట్ ప్రాజెక్టుగా కార్యక్రమాలు చేపడితే అది రాష్ట్రమంతా వర్తింప చేయండి, ఏటి కొప్పాక, కొండపల్లి బొమ్మలు మన సంస్కృతీ సంప్రదాయం, ఆ వృక్షాలు పెంచడానికి కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు.ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద ఘన వ్యర్థాల షెడ్ల నిర్మాణానికి కేంద్రానికి లేఖ రాయాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మంగళవారం రెండో రోజు కలెక్టర్ల సదస్సులో స్వచ్ఛాంధ్ర, అటవీ, మున్సిపల్, పంచాయితీరాజ్ తదితర శాఖలపై జరిగిన సమీక్షలో గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లో వెదురుతో చేసే ఉత్పత్తుల కోసం ఓ కార్యక్రమాన్ని రూపొందించాలన్నారు. వెదురు ఉత్పత్తులు చేసేవారికి వెదురును సరఫరా చేసేలా చూడాలని కలెక్టర్లకు సూచనలు చేసారు. చేతి వృత్తులు, కులవృత్తులు దెబ్బతినకుండా కాపాడాలన్నారు. సిసి రోడ్ల నిర్మాణం సమయంలో కాలువల కోసం మళ్లీ తవ్వకుండా పైపులైన్లు పెట్టేలా ఎస్‌ఒపి చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అర్బన్ సౌకర్యాలతో మోడల్ పంచాయితీలుగా తీర్చిదిద్దాలన్నారు. స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌ను ఓ ఉద్యమంగా రాష్ట్రంలో చేస్తున్నామన్నారు. సింగపూర్ విధానాలను పరిశీలించి ఉమ్మడి రాష్ట్రంలో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఆ తర్వాత క్లీన్ అండ్ గ్రీన్ పచ్చదనం పరి >>2

వివేకా హత్యకేసు

# నిందితులకు ఊరట

బెయిలు రద్దులో జోక్యం చేసుకోలేమన్న సుప్రీం కోర్టు

ట్రయల్ కోర్టుకు వెళ్లాలని వైఎస్ సునీతకు సూచన

**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుల బెయిల్ రద్దు అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. నిందితుల బెయిల్ రద్దు అంశంలో ఇప్పుడు జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిందితుల బెయిల్ రద్దుతో పాటు దర్యాప్తును కొనసాగించడానికి ట్రయల్ కోర్టునే ఆశ్రయించాలని పిటిషనర్ వైఎస్ సునీతకు సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. మరింత సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని వైఎస్ సునీతతరపు లాయర్ కోరారు. అయితే సిబిఐ ఇప్పటికే చార్జ్‌షీట్ దాఖలు చేసిందని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. అంతకు ముందు సిబిఐ తరపు లాయర్.. కోర్టు ఆదేశిస్తే.. దర్యాప్తు కొనసాగిస్తామని తెలిపింది. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో మొత్తం 8 మంది నిందితుల్ని అరెస్టు చేశారు. వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి, ఎర్ర గంగి రెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి, వి. రాజశేఖర్ రెడ్డిలను అరెస్టు చేశారు. వీరంతా బెయిల్ పై బయటకు వచ్చారు. అవినాష్ రెడ్డి మినహా అందరూ జైల్లో కొంత కాలం గడిపిన తర్వాత బెయిల్ వచ్చింది. అయితే అవినాష్ రెడ్డికి మాత్రం అరెస్టు చేసిన విషయం కూడా తెలియకుండానే బెయిల్ వచ్చేసింది. హైకోర్టు అరెస్టు చేసినా వెంటనే బెయిల్ >>2

## చర్చలకు సిద్ధం ఆయుధాలు వదిలేస్తాం

నెలరోజులు ఎన్‌కౌంటర్లు ఆపండి

ప్రధాని, అమిత్‌షాకు మావోయిస్టుల లేఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** మావోయిస్టులు సంచలనప్రకటనచేశారు. తాము ఆయుధాలు వదిలి పెడతాం, ఓ నెల రోజుల పాటు యాంటీ-నక్సల్స్ ఆపరేషన్ ఆపండి అంటూ ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రికి లేఖలు రాసినట్లు వెల్లడించింది. మంగళవారం రాత్రి ఈ మేరకు మావోయిస్టుల అధికార ప్రతినిధి అభయ్ పేరుతో ఓ ప్రకటన విడుదల చేసింది. తాము ఆయుధాలు వదిలేస్తున్నామని అమిత్‌షాకు లేఖలో పేర్కొ >>2

# అమెరికాతో వాణిజ్య చర్చలు సానుకూలం!

50 శాతం సుంకాలపై ఉభయ ప్రతినిధుల మధ్య సుదీర్ఘ భేటీ

మోడీతో మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నా: ట్రంప్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** భారత్ అమెరికాలమధ్య జరగాల్సిన వాణిజ్య ఒప్పందంకోసం రెండువైపులా చర్చలు సామరస్యవాతావరణంలో జరుగుతున్నాయని ఇరుదేశాలప్రతినిధులు పేర్కొన్నారు.అమెరికా ట్రేడ్ ప్రతినిధి బ్రెండన్ లించ్ ఢిల్లీలో వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌తో సమావేశం అయ్యారు. 50శాతం సుంకాలపైనా కూడా చర్చలు జరిగాయి. ఫిబ్రవరివరకూ ఐదు విడతలుగా జరిగిన చర్చలు ఆగస్టు 25న జరగాల్సి ఉండగా ఈలోపు సుంకాల వివాదంలో నిరవధిక వాయిదా పడ్డాయి. తిరిగి ట్రంప్ పాలనపగ్గాలు చేపట్టాక ముందు 25శాతం సుంకాలువిధించి రష్యా చమురు కొనుగోలుచేస్తున్నామని మరో 25 శాతం సుంకాలు వేయడంతో చర్చలు మళ్లీ >>2

## డంప్ యార్డులో పారవేస్తున్న ఉల్లి

మార్కెట్ యార్డు నుంచి ఎత్తుకెళ్తున్న స్థానికులు

రైతులందరికీ దక్కని ప్రభుత్వ మద్దతు ధర

మార్కెట్ యార్డ్ నిర్వహాకుల వైఫల్యమే కారణమా?



**కర్నూలు, సెప్టెంబరు 16, ప్రభాతవార్త :** రైతన్న చెమటోడ్చి పండించిన ఉల్లి పంటలో అధిక భాగం డంపు యార్డ్‌కు చేరుతోంది. అంతేకాక మార్కెట్ యార్డ్‌లో ప్రజలు ఉచితంగా తీసుకెళ్తున్నారు. మరి ప్రభుత్వం మద్దతు ధర ఇస్తున్నప్పటికీ ఈ సమస్యలు ఎందుకు వస్తున్నాయి.. అదే మార్కెట్ యార్డ్ నిర్వహణ వైఫల్యం... అక్షరాల మార్కెట్ యార్డ్ అధికారులు ఉల్లి పంట కొనడం, అమ్మడంలో పూర్తిగా వైఫల్యం అయ్యారని చెప్పవచ్చు. కర్నూలు మార్కెట్ యార్డ్ కు భారీ ఎత్తున ఉల్లిగడ్డలు వస్తున్నాయి. రైతులు తెస్తున్న ఆ పంటను సకాలంలో కొనడం, ఇతర ప్రాంతాలకు తరలిం చడంలో మార్కెట్ కమిటీ అధికారులు విఫలమయ్యారు. ఏదిఏమైనా ధర పడిపోవడంతో ప్రభుత్వం స్పందించి సకాలంలో క్వింటాలుకు రూ.1200 ధర నిర్ణయించింది. అయినప్పటికీ కొందరు రైతులకు ఆ మద్దతు ధర కూడా అందడంలేదు. మార్కెట్‌కి వచ్చిన పంటను కొనడంతో పాటు అమ్మడంలో కూడా మార్కెట్ అధికారులు కీలకపాత్ర వహించాలి. కానీ ఇక్కడ ఏజెంట్లు, అధికారులు విఫలం అవ్వడంతో ప్రభుత్వ ధనంతో కొంటున్న ఉల్లిగడ్డలు మార్కెట్ యార్డులో నిలిచిపోవడం..తర్వాత కుళ్లిపోవడం.. ఆపై డంపింగ్‌యార్డుకుచేరడం జరుగుతుంది. ఇక మార్కెట్ యార్డులోకి వచ్చిన ఉల్లిగడ్డలను గ్రేడింగ్‌మేరకు ఏజెంట్లు ధర నిర్ణయించి తీసుకుంటున్నారు. అయితే ఏజెంట్ 1200రూపాయల ధరకన్నాతక్కువఇస్తే.. మిగిలినమొత్తాన్ని ప్రభుత్వంరైతుకు అందిస్తుంది.

# బ్రహ్మోత్సవాల్లో ఇస్రో సేవలు

తొలిసారి శాటిలైట్ ఆధారంగా భక్తుల గణన

దళిత వాడల్లో ఆలయాల నిర్మాణం : టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు తదితరులు

**తిరుమల,సెప్టెంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది దేవదేవుని బ్రహ్మోత్సవాలకు ఇస్రో సహకారం తీసుకుని, శాటిలైట్ ఆధారంగా భక్తుల సంఖ్యను గణన చేసేందుకు చర్యలు చేపట్టామని టిటిడి ధర్మకర్తల మండలి చైర్మన్ బిఆర్‌నాయుడు వెల్లడించారు. తొలిసారిగా చేపడుతున్న ఈ ప్రక్రియతో నిర్ధిష్టంగా బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలలో ఎంత మంది భక్తులు ఉన్నారు,మాఢవీధుల్లో ఎంతమంది వాహనసేవలు వీక్షిస్తున్నారనే విషయంస్పష్టంగా తెలుస్తుందన్నారు. సనాతన హిందూ ధర్మపరిరక్షణలో భాగంగా మతమార్పిడులను పూర్తిగా అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని దళితవాడల్లో వెయ్యి ఆలయాలు నిర్మాణం చేపడతామని చైర్మన్ తెలిపారు. హిందూ ధార్మికసంస్థ టిటిడిపై పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి,చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చైర్మన్ బిఆర్‌నాయుడు హెచ్చరించారు.

ఈ అంశంపై బోర్డు కూడా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందన్నారు. వారంరోజుల్లో తిరుమలలో మొదలుకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, టిటిడి చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ధర్మకర్తలమండలి సమావేశం జరిగింది. చైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన నాలుగుగంటలపాటు సాగిన ఈ బోర్డులో చర్చించి తీసుకున్న నిర్ణయాలను టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులతో కలసి మీడియాకు వెల్లడించారు. ఈనెల 24 నుండి అక్టోబర్ 2వరకు జరగనున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులరద్దీని అంచనావేసేందుకు ఇస్రో సహకారం తీసుకుంటున్నామన్నారు. గరుడసేవజరిగే 28వతేదీ తిరుమల ఆలయ మాడ వీధులతోబాటు తిరుమలకొండపై భక్తులరద్దీని గణనచేయనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులను విశేషంగా ఆకట్టుకునేందుకు పుష్పాలంకరణలు, వివిధ దేవతామూర్తుల ఆర్చిలు, ఎల్‌ఇడి తోరణాలు, పెద్దస్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాలకు ముందు మంగళవారం జరిగిన ధర్మకర్తలమండలి సమావేశంలో దేశవ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు, ఆలయాల నిర్మాణాలకు నిధులు మంజూరుచేస్తూ బోర్డు తీర్మానించింది.. కర్నాటక రాష్ట్రం బోలగావిలోని కోలకొప్పగ్రామంలో శ్రీవాణి ట్రస్ట్ నిధులతో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించేందుకు ఆమోదించారు. గుంటూరుజిల్లా తుళ్ళూరు మండలం అనంతవరం గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 7.20కోట్ల రూపాయలతో రాజగోపురం, శ్రీసుబ్రమణ్య స్వామికి ఆభరణాలు, ఆలయంలో తాగునీటి సౌకర్యం,ఆర్చి,మరుగుదొడ్లు అభివృద్ధి కార్యక్రమాలకు దశలవారీగా చేపట్టేందుకు నిర్ణయించారు. అన్నమయ్యజిల్లా వాల్మీకిపురంలోని పట్టాభిరామ స్వామి ఆలయ పుష్కరిణి, కల్యాణవేదిక మండపం, రాజగోపురం,ఆర్చి, కల్యాణ మండపం తదితర అభివృద్ధి పనులకు 5.73కోట్లు రూపాయలు, తరిగొండలోని లక్ష్మీనరసింహస్వామి పుష్కరిణి పున:నిర్మాణానికి 1.50కోట్ల రూపాయలతో పనులు చేపట్టేందుకు నిర్ణయించారు.

# మోడీ నియంత్రణలో ఇసి

పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల



**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం జరుగుతుందని ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వెల్లడించారు. ఆ మేరకు ఆమె వీడియో ప్రకటన మంగళవారం విడుదల చేసారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) పనితీరుపై సంచలన ఆరోపణలు చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘమే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతిలో బందీగా మారిందని, బిజెపికి ఎన్నికల ఏజెంట్‌గా పనిచేస్తోందని ఆమె తీవ్రంగా విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం ప్రజలంతా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన ఇసి, పూర్తిగా బిజెపి ప్రయోజనాల కోసం పనిచేస్తోందని షర్మిల ఆరోపించారు. కేవలం ఎన్నికల సంఘమే కాకుండా సిబిఐ, ఇడి, ఆదాయపు పన్ను శాఖ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ ప్రధాని మోడీ గుప్పిట్లో ఉన్నాయని, ఆయన ఆదేశాల మేరకే పనిచేస్తున్నాయని విమర్శించారు. ఈ వాస్తవాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ ప్రజల ముందు ఉంచారని, ఇది నేటి భారత ప్రజాస్వామ్య దుస్థితికి నిదర్శనమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, దేశంలో జరుగుతున్న ఓట్ల అవకతవకలకు సంబంధించి కొన్ని ఉదాహరణలను ఆమె ప్రస్తావించారు. కర్ణాటకలోని మహాదేవపుర నియోజకవర్గంలో ఏకంగా లక్ష దొంగ ఓట్లను నమోదు చేశారని, అవన్నీ నకిలీఫోటోలు, పేర్లు, చిరునామాలతో సృష్టించినవేనని ఆమె ఆరోపించారు. అదేవిధంగా, మహారాష్ట్ర ఎన్నికల సమయంలో పోలింగ్ చివరి గంటలో, అంటే సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య, అనూహ్యంగా 60 లక్షలకు పైగా ఓట్లు పోల్ అయ్యాయని, ఆ ఓట్లు ఎవరు వేశారో చెప్పడానికి ఇసి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని ఆమె దుయ్యబట్టారు.

ఎన్నికలకు కేవలం ఐదు నెలల ముందు కోటికి పైగా కొత్త ఓట్లు నమోదు కావడం వెనుక పెద్ద కుట్ర ఉందని షర్మిల అనుమానం వ్యక్తం చేశారు. బిజెపికి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తూ, వారికి అనుకూలంగా దొంగ ఓట్లను చేర్చడం ద్వారా ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు. ఈ ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త పోరాటానికి సిద్ధమైందని తెలిపారు.

ఈ పోరాటంలో భాగంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు ప్రకటించారు. అక్టోబర్ 15 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలందరూ ఇందులో పాల్గొని తమ మద్దతు తెలియజేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## పంటల ధరల పతనంలో చంద్రబాబు రికార్డు: జగన్

**విజయవాడ,సెప్టెంబరు17,ప్రభాతవార్తప్రతినిధి:** పంటల ధర పతనంలో సిఎం చంద్రబాబు రికార్డు సాధించారని మాజీ సిఎం వైఎస్ జగన్ విమర్శించారు. మంగళవారం 'ఎక్స్'లో ఈ మేరకు పోస్ట్ చేశారు. కర్నూలులో కిలో ఉల్లి మూడు రూపాయలని, కిలో టమోటా రూపాయిన్నరని, ధరలు ఇలా ఉంటే రైతులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. క్వింటా ఉల్లిని రూ.1200కు కొనుగోలు చేస్తామని ప్రకటనల మీద ప్రకటనలు చేశారని, కర్నూలు మార్కెట్లో వేలం వేయించి ఎవరూ కొనడం లేదని చెప్పడానికిచేసిన ప్రయత్నం తప్ప మరొకటి కాదని అన్నారు. ఉల్లికి ధర లేదని చెబుతున్నారని, ఆన్‌లైన్ స్టోర్లలో కిలో ఉల్లి రూ.29 నుంచి రూ.32 వరకూ ఉందని వివరించారు. రైతు బజార్లోనూ కిలో రూ.25కు తక్కువ అమ్మడం లేదని, మరి రైతులకు ధర ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. వారిని ఆదుకునేందుకు కనీస దృష్టి పెట్టకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. టమోటా ధరలు దారుణంగా పడిపోయినా పట్టించుకోవడం లేదని, కొనేవారు లేక రోడ్డుపై పారబోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం రైతుల పంటలు కొనుగోలు చేసి వారికి అండగా నిలవాలని ఆయన సిఎంకు సూచించారు.

# డ్రగ్స్ అక్రమరవాణాలోని విదేశీయుల గెంటివేత

16 వేల మందిని స్వదేశాలకు పంపిస్తున్న హోంశాఖ

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 16:** మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడిన విదేశీయులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. దేశంలో డ్రగ్స్ కేసుల్లో పట్టుబడి, నిర్బంధ కేంద్రాల్లో ఉన్న సుమారు 16వేల మంది విదేశీయులను స్వదేశాలకు పంపించేందుకు కేంద్ర హోం వ్యవహారాల శాఖ సిద్ధమైంది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఎన్సీబీ సమర్పించిన ఒక సమగ్ర నివేదిక ఆధారంగా కేంద్ర హోం శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో పెద్ద సంఖ్యలో విదేశీయులు పాల్గొంటున్నారని వీసా నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా దేశంలో ఉంటున్నారని ఎన్సీబీ నివేదించింది. ఈ నివేదిక ప్రకారం విదేశీయులు మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌తో పాటు వాటిని వివిధ ప్రాంతాలకు రవాణా చేయడంలో కూడా చురుకుగా పాలుపంచుకున్నారని తేలింది. వీరందరినీ వివిధ రాష్ట్రాల్లోని డిటెన్షన్ కేంద్రాల్లో ఉంచారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త వలస చట్టం ప్రకారం ఈ పౌరులను వెనక్కి పంపించే ప్రక్రియను చేపడుతున్నారు. ఈ కొత్త చట్టం మాదకద్రవ్యాల స్మగ్లింగ్ వంటి దేశ భద్రతకు ముప్పు కలిగించే తీవ్రమైన నేరాలకు పాల్పడిన విదేశీయులను వెనక్కి పంపించడానికి కఠినమైన నిబంధనలను కలిగి ఉంది. అంతేకాకుండా నకిలీ పత్రాలతో లేదా వీసా గడువు ముగిసిన తర్వాత కూడా దేశంలో ఉంటున్నవారిపైనా ఈ చట్టం కింద చర్యలుతీసుకోవచ్చు. ఈ చట్టంరాకతో దేశం నుంచి అక్రమంగా నివసిస్తున్న విదేశీయులను వెనక్కి పంపే ప్రక్రియ మరింత సులభతరం అయింది. తొలి దశలో పంపించనున్న విదేశీ యుల జాబితాను హోం మంత్రిత్వ శాఖ, ఇతర సంబంధిత ఏజెన్సీలకు ఇప్పటికే అందజేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇందులో బంగ్లాదేశ్, ఫిలిప్పీన్స్, మయన్మార్, మలేషియా,ఘనా, నైజీరియా వంటి దేశాలకుచెందిన పౌరులు ఉన్నట్లు సమాచారం. దేశఅంతర్గత భద్రతకు, ప్రజల ఆరోగ్యానికి డ్రగ్స్ వల్ల ఏర్పడుతున్న ముప్పును నియంత్రించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. విదేశాల నుంచి అక్రమంగా డ్రగ్స్ తెచ్చి ఇక్కడ యువతను వాటికి బానిసలుగా మారుస్తున్న ముఠాలపై ఈ చర్య ఒక బలమైన హెచ్చరికగా నిలవనుంది.



మారిషస్ ప్రధాని డా. నవీన్‌చంద్ర రామ్‌గూలమ్ మంగళవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ దృశ్యం

# 'స్వచ్ఛాంధ్ర' ఓ ఉద్యమం

>> కుతం పేరిట కార్యక్రమాలు నిర్వహించామన్నారు. స్వచ్ఛత అంటే క్లీనినెస్ ఒక్కటే కాదు ప్రజల థింకింగ్ ప్రాసెస్ కూడా మారాలన్నారు.ఇంట్లో చెత్తను రోడ్డు బయట వేయటం కొందరికి అలవాటన్నారు. అలాగే డ్రెయిన్స్‌లో చెత్తవేయటం వల్ల అవి అడ్డుపడి నీటి ప్రవాహానికి అడ్డువస్తుందన్నారు. రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సిసి రోడ్లు ఉన్నా డ్రెయిన్లు సరిగ్గా లేవన్నారు. మేజిక్ డ్రైన్ల నిర్మాణం చేపట్టాలి. చాలా చోట్ల మురుగునీరు నిల్వలు. వాటి వాడకంకూడా జరగటం లేదు పంచాయితీల్లో పిట్స్ ను ఎప్పటికప్పుడు క్లీన్ చేసేలా చూడాలి. అత్యవసర పనులకు నిధులు తక్షణం మంజూరు చేస్తామన్నారు. కార్యాలయాలు, ప్రాంగణాలు శుభ్రంగా ఉండేలా మంత్రులు, అధికారులు, కలెక్టర్ కార్యాలయాలకు ఆదేశాలు జారీచేశారు. నెట్ జీరో, వేస్ట్ టు వెల్త్ కాన్సెప్టుతో పనిచేయాలని ముఖ్యమంత్రి అన్నారు.

**క్వాంటం వ్యాలీ, వాట్సప్ గవర్నెన్స్, డేటా లేక్, ఆర్టీజీఎస్ లెన్స్ అవేర్ 2.0 అంశాలపై సమీక్ష..**

క్వాంటం వ్యాలీ, వాట్సప్ గవర్నెన్స్, డేటా లేక్, ఆర్టీజీఎస్ లెన్స్ అవేర్ 2.0 అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పాలనలో టెక్నాలజీ వినియోగంపై జిల్లా కలెక్టర్లకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ల సదస్సులో క్వాంటం వ్యాలీ భవనాల డిజైన్లను సీఎం చంద్రబాబు ప్రదర్శించారు. కార్యాలయ స్థలం డేటా లేక్ లో అన్ని శాఖలకు చెందిన 6 పెటా బైట్ల డేటా ఉంది. వచ్చే కలెక్టర్ల కాన్ఫరెన్సును, అజెండాను రియల్ టైమ్ డేటా ఆధారంగానే నిర్వహిద్దామని చంద్రబాబు వెల్లడించారు.

**45 రోజుల్లో అపార్ అప్లోషన్ పూర్తి చేయండి**

విద్యార్థులకు 10 ఏళ్ల క్రితం ఉండే అంశాలనే ఇంకా బోధిస్తుండడం సరి కాదు. ప్రస్తుతం అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు ఉండాలి అప్పుడే విద్యార్థుల నైపుణ్యం పెరుగుతుంది. 2019 వరకూ విద్యారంగంలోని అన్ని ప్రమాణాలు అత్యున్నత స్థాయిలో ఉన్నాయి. ఆ తర్వాత అన్నీ దిగువన పడిపోయిన పరిస్థితి. దానికి కారణాలు ఏంటన్నది అధ్యయనం చేయండి. ఆర్టీజీఎస్ ద్వారా టెక్నాలజీ ఆడిటింగ్ జరగాలి. అపార్ ఐడీ ద్వారా విద్యార్థుల సమాచారాన్ని కేంద్రం ట్రాక్ చేస్తోంది. ఆ సమాచారం ఆధారంగానే మన డేటా కూడా అప్డేట్ కావాలి. 45 రోజుల్లో అపార్ ఐడీ అప్లోషన్ జరగాలి. వచ్చే ఏడాది నుంచి ఇక అంతా రియల్ టైమ్ సమాచారమే. విద్యారంగం పారిశ్రామిక రంగం కలిసి పని చేయాలి. అందుకే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నాం. నైపుణ్యాలు పెంచుకునేలా యువతను ప్రోత్సహించాలి. అంగన్‌వాడీల నుంచే విద్యార్థుల్లో లోపాలను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. ఉన్నత విద్య కోసం కేంద్ర ప్రభుత్వం గ్యారెంటీ లేకుండా రుణం ఇస్తోంది. దీనిని వినియోగించుకుని విద్యార్థులకు బాసటగా నిలిచేలా ఓ పథకాన్ని ప్రారంభిస్తాం. జిల్లాల్లో ఎప్పటికప్పుడు జాబ్ మేళాల ద్వారా ఉద్యోగాలు కల్పించే ప్రయత్నం చేయాలి. 4.5 లక్షల మంది ప్రస్తుతం ఏపీలో వర్క్ ఫ్రమ్ హోం పని చేస్తున్నారు. రాష్ట్రంలో కోవర్కింగ్ స్పేస్ లు కూడా పెడితే మరో 5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించొచ్చు. రాష్ట్రంలో అందరికీ ఉద్యోగాలు కల్పించేలా కార్యాచరణ ఉండాలి." అని చంద్రబాబు తెలిపారు.

**సంజీవని ప్రాజెక్టుపై కార్యాచరణ**

ఎక్కడా నీటి కాలుష్యం జరగడానికి వీల్లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. క్లీన్ నగరాలు, క్లీన్ పట్టణాలు మనకు ముఖ్యమని లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు అవసరమైన ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నా తీసుకోవాలన్నారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో పాటు సంజీవని ప్రాజెక్టు చేపడుతున్నట్టు తెలిపారు. మొదట చిత్తూరు జిల్లాలో ఆ తర్వాత రాష్ట్రం మొత్తం అమలు చేసేలా కార్యాచరణ రూపొందించామని ఈ సందర్భంగా తెలిపారు.

# నిందితులకు ఊరట

>> ఇవ్వాలని ఆదేశించడంతో నిందితుడిని ఓ రోజు సిబిఐ అధికారులు అరెస్టు చేసారు. సరిగ్గా అదే రోజు బెయిల్ ఇచ్చారు. బెయిల్ రద్దు చేయాలని అప్పటి నుంచి వైఎస్ సునీత రెడ్డి న్యాయపోరాటం చేస్తున్నారు. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న ఆ పిటిషన్ పై విచారణ ఇటీవలే జరిగింది. గత విచారణలో.. అధికార దుర్వినియోగం జరిగిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. తప్పుడు కేసులు పెట్టారని వివేకా కుమార్తె, అల్లుడితో పాటు సిబిఐ ఎస్పీ రాంసింగ్‌పైన పెట్టిన కేసులను క్వాష్ చేసింది. ఈ క్రమంలో నిందితులకు బెయిల్ రద్దు అవుతుందని అనుకున్నారు ఈ దశలో నిర్ణయం తీసుకోలేమని.. ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని సుప్రీంకోర్టు చెప్పడంతో నిందితులకు ఊరట లభించినట్టయింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సోదరుడు అయిన వివేకానందరెడ్డి 2019 ఎన్నికలకు ముందు పులివెందులలోని ఆయన నివాసంలో అత్యంత దారుణంగా హత్యకుగురయ్యారు. ఆయన మొదట రక్తపు వాంతులతో, గుండెపోటుతో చనిపోయారని బంధువులు ప్రచారం చేశారు. అయితే హైదరాబాద్‌లోని ఆయన కుమార్తె.. పులివెందులకు వెళ్లి.. పోస్టుమార్టం చేయించాలే సరికి.. ఆయనను అత్యంత ఘోరంగా నరికి చంపారని వెల్లడి అయింది. ఇంట్లో సాక్ష్యాలను తుడిపించే ప్రయత్నం చేయడంతో పాటు. పోస్టుమార్టం వద్దని చెప్పడం, పెద్ద గొడ్డలి పోట్లకు కట్లు కట్టేసి ఉండటం వంటివి చేయడంతో హంతకులే సాక్ష్యాలను మాయం చేసేందుకు ప్రయత్నించారన్న అనుమానాలు వ్యక్తం కావడంతో.. సిబిఐ విచారణకు వివేకా కుమార్తె డిమాండ్ చేసి కోర్టుకెళ్లారు. జగన్ సిఎంగా ఉన్న సమయంలో ఆమెతో పాటు ఆమె భర్తపై కేసులు నమోదు అయ్యాయి. దర్యాప్తు చేస్తున్న సిబిఐ ఎస్పీపైనా కేసు పెట్టారు. సుప్రీంకోర్టు ఆ కేసుల్ని క్వాష్ చేసింది.

# ప్రాజెక్టులకు అనుమతి

>> ప్రభుత్వం రూ. 10,06,799 కోట్ల విలువైన 122 భారీ ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమల కోసం ఒక లక్ష ఎకరాల భూమి కలిగిన పారిశ్రామిక క్లస్టర్లను ప్రభుత్వం సిద్ధం చేసింది. మరో యేడాదిలో ఈ పెట్టుబడులను రెట్టింపు చేయాలన్నది ఏపి ప్రభుత్వ లక్ష్యం. లండన్ రోడ్‌షోలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడి అవకాశాలపై మంత్రి నారా లోకేష్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. అలాగే ప్రఖ్యాత సంస్థలైన హిందుజా, రోల్స్ రాయిస్ వంటి గ్రూప్‌లతో ప్రత్యేక సమావేశాలు, గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పెట్టుబడిదారులతో ఫైర్‌సైడ్ చాట్ నిర్వహించనున్నారు. రోడ్‌షో సందర్భంగా మంత్రి లోకేష్ ఏపిలో పోర్టు ఆధారిత పారిశ్రామికీకరణ, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ఇన్నోవేషన్, ఆధునిక తయారీరంగం వంటి అంశాలను హైలైట్ చేస్తారు. పెట్టుబడులతోపాటు శాశ్వత ఆర్థికావకాశాలను ఇన్వెస్టర్లకు వివరిస్తారు. రోడ్ షోలో ఎలిక్సర్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, సియాంట్, ఇవాంటె గ్లోబల్, ఏఐ ఓపెన్‌సెక్, లండన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులతో పాటు ఇతర పరిశ్రమ ప్రముఖులు కూడా హాజరవుతారు. నవంబర్ లో జరిగే పార్టనర్ షిప్ సమ్మిట్‌కు రావాల్సిందిగా గ్లోబల్ కంపెనీల సిఇఒలు, పాలసీ మేకర్లు, ఇండస్ట్రీ లీడర్లను మంత్రి లోకేష్ ఆహ్వానిస్తారు. ట్రేడ్, టెక్నాలజీ, స్థిరమైన వృద్ధి అంశాలపై లండన్ రోడ్ షోలో కీలక చర్చలు జరగనున్నాయి.

# రైతుల పట్ల జగన్ మొసలి కన్నీరు

## -మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, సెప్టెంబర్ 16, ప్రభాతవార్తప్రతినిధి:** ఉల్లి, టమోటా రైతుల దీనస్థితి అంటూ జగన్ రెడ్డి మొసలి కన్నీరు కారుస్తున్నాడని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. రైతుల కష్టాలు నిజంగా పట్టించుకునే హృదయం జగన్‌కి ఉంటే తన పాలనలోనే రైతులను దోపిడీకి గురి చేయడమేంటి అని ప్రశ్నించారు. రైతుల పట్ల కనీసం చిత్తశుద్ధి లేని జగన్ ఇప్పుడొచ్చి అబద్ధపు సానుభూతి నటన చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉల్లి, టమోటా రైతుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధర చెల్లించిందని గుర్తు చేశారు. మద్ధతు ధరలు, రైతుల గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదని అన్నారు. రైతులకు అండగా నిలబడటం అంటే డ్రామాలు కాదు, క్షేత్ర స్థాయిలో ఫలితాలు చూపించడమేనని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. జగన్ పాలనలో రైతులు కన్నీరు మున్నీరయ్యారు... ఇప్పుడు ఆయన కార్చే కన్నీరు మొసలి కన్నీరు తప్ప మరేదీ కాదన్నారు.

ప్రస్తుతం ఉల్లి రైతులను ఆదుకోవడం లేదని జగన్ అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాడని, మార్కెట్‌లో ధరలు పెరగడం, తగ్గడం అనేది మార్కెట్ డైనమిక్స్ డిసైడ్ చేస్తాయని, ధరలు తగ్గినప్పుడు వ్యవసాయ ఉత్పత్తులకు మద్ధతు ధరను అందించి రైతులకు న్యాయం చేస్తామని, ధరలు పెరిగినప్పుడు సబ్సీడి రూపంలో వినియోగదారులకు సరసమైన ధరలలో ఉత్పత్తులను అందచేస్తామని తెలిపారు. 2025లో ఉల్లి ధరలు పతనమవుతున్నాయని ముందస్తు అంచనా వేసి క్వాలిటీతో సంబంధం లేకుండా 1200 మద్ధతు ధరను ప్రకటించామని తెలిపారు. తొలుత మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వమే ప్రత్యక్షంగా రైతులకు ఉల్లి క్వింటాకు 1200 చెల్లించి కొనుగోలు చేసి రైతుబజార్ల ద్వారా అమ్మకాలు చేయడం జరిగిందన్నారు. డిమాండ్‌ను మించి ఒకే సారి రైతులు పంటను మార్కెట్‌కు తీసుకురావడంతో మార్కెట్ వ్యత్యాసపు ధరను ప్రకటించామని...1200 క్వింటా ఉంటే ఆ ధరకు తక్కువగా రైతులకు లభిస్తే మిగిలిన నగదును ప్రభుత్వమే రైతులకు చెల్లిస్తుందన్నారు. 2016లో ఉల్లి ధరలు పడిపోతే 7723 మంది రైతులనుండి 2.77 లక్షల క్వింటాళ్ళు కొనుగోలు చేసి 7 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించామని, 2018లో మరొకసారి 9740 మంది రైతుల నుండి 3.48 లక్షల క్వింటాళ్ల ఉల్లి కొనుగోలు చేసి 6.45 కోట్లు చెల్లించామని తెలిపారు. 2025 సంవత్సరంలో ఈ నెల 15 వ తేదీ వరకు రైతు బజార్ల కోసం 9014 క్వింటా ఉల్లిని కొనుగోలు చేశాం. మార్క్ ఫెడ్ ద్వారా 53239 క్వింటాలను సేకరించాం. వ్యాపారుల ద్వారా 15292 క్వింటాల ఉల్లిని నేరుగా కోనుగోలు చేయడం జరిగింది. ధర వ్యత్యాస పథకం కింద మార్క్ ఫెడ్ ప్రైవేట్ వ్యాపారుల ద్వారా 51268 క్వింటాల ఉల్లిని కోనుగోలు చేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా 931 మంది రైతుల ద్వారా 5.97 కోట్ల ఉల్లిని కోనుగోలు చేసిందని, అందులో ధర వ్యత్యాసం కింద 752 మంది రైతులకు 4.25 కోట్లు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. జగన్ హయాంలో 2020 సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వంలో ఉల్లి ధరలు పడిపోతే, నామ మాత్రంగా క్వింటాకి రూ.770లు మద్దతు ధరప్రకటించి, ఏ ఒక్కరి దగ్గరా ఉల్లి కొనుగోలు చేయకుండా, రైతులను మోసం చేశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా కూడా జగన్ గుండె కరగలేదా.. కేవలం 250 మంది రైతుల దగ్గర 75 లక్షలు ఇచ్చి ఉల్లిని కొన్న నువ్వు రైతుల గురించి మాట్లాడుతున్నావు అంటూ ధ్వజమెత్తారు. ప్రస్తుతం రైతు బజార్లలో 12 నుంచి 15 రూ ఉల్లి కేజీ అమ్ముతుంటే, ప్రైవేట్ సంస్థ బిగ్ బాస్కెట్ లో 34 రూ కేజీ అంటూ ప్రజలకు నష్టాన్ని చేకూర్చే విషయాలను కార్పొరేట్ మాజీ సీఎం వెల్లడించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. 2020లో మీ ప్రభుత్వ సమయంలో ఉల్లి ధరలు పడిపోయినప్పుడు మీ సమయంలో ఎంత మంది దగ్గర కొన్నావు, ఎన్ని కోట్లు రైతులకు అందచేశారు అన్న విషయంపై వివరాలు చెప్పగలరా... బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాలు విసిరారు. మార్కెట్ ధరల వ్యత్యాసాల సమయంలో రైతుల పట్ల ఎలా వ్యవహరించాం అనేది ముఖ్యం.. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య తేడాను ఉదాహరణలతో సహా వెల్లడించామని, ఇలా బహిరంగంగా తెలిపే దమ్ము, ధైర్యం జగన్‌కు ఉందా అని ప్రశ్నించారు.

# చర్చలకు సిద్ధం

>>న్నట్లు తెలిపింది. ఆయుధాలు వదిలిపెడుతున్నందున యాంటీ-నక్సల్స్ ఆపరేషన్ ఆపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శాంతి చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. ఆపరేషన్ కగార్‌లో మావోయిస్టులకు భారీగా ఎదురు దెబ్బ తగిలింది. వరుసగా అగ్రనేతలను మావోయిస్టు పార్టీ కోల్పోయింది. ఈ నేపథ్యంలోనే మావోల ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. అయితే, మావోయిస్టులతో శాంతి చర్చలు ఉండవని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల తేల్చిచెప్పిన సంగతి తెలిసిందే.

## వారం - వర్జ్యం

17-09-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
ఏకాదశి రా.11.42
పునర్వసు ఉ.6.26
వర్జ్యం : మ.2.28-4.04
దు.ఉ.11.39-మ.12.28
శుభసమయం: ఉ.6.45-7.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** ఆరోగ్యం, వాహనాల విషయంలో జాగ్రత్తలు అవసరం. క్రీడారంగం యందు ఆసక్తి కలిగివుంటారు.

**వృషభం:** నూతన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. కాంట్రాక్టులు లభిస్తాయి.

**మిథునం:** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. సన్నిహితుల కలయిక.

**కర్కాటకం :** కుటుంబంలో ఏర్పడే స్పర్ధలు చిన్నపాటి వివాదాలు సర్దుకుంటాయి.

**సింహం:** దీర్ఘకాలిక సమస్యలను మాత్రం కాలానికి వదిలి వేస్తారు. క్రయావిక్రయాలలో లాభాలు.

**కన్య :** స్థిరాస్తుల తాలూకూ రావలసిన ధనము చేతికి వస్తుంది. స్థలాలు కొనుగోలు యత్నాలు చేస్తారు.

**తుల :** తప్పుడు లెక్కలు, అబద్ధములు మీదృష్టికి వస్తాయి. క్రమశిక్షణకు ప్రాధాన్యతనివ్వాలని యోచిస్తారు.

**వృశ్చికం:** మీ నమ్మకము కన్నా మీ ఇంటిలోని వారి ఊహే నిజమవుతుంది. శ్రమ అధికమవుతుంది.


**ధనుస్సు:** సంఘంలో కీర్తి ప్రతిష్ఠలు నామమాత్రంగా పెరుగుతాయి. ఋణాలు తీరి ఊరట చెందుతారు.

**మకరం:** కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కుంభం:** కుటుంబంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. నూతన విద్యలపై ఆసక్తి చూపుతారు.

**మీనం :** పొరపాటు నిర్ణయాలు, నోరు జారుట వంటివి సంభవించకుండా జాగ్రత్త వహించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న గవర్నర్ జస్టిస్ నజీర్ దంపతులు

# వెంకన్న దర్శనంలో గవర్నర్ జస్టిస్ నజీర్

**తిరుమల,సెప్టెంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో రాష్ట్రంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్రగవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్ తెలిపారు. తిరుపతిలో రెండురోజులు జరిగిన జాతీయ మహిళా సాధికారత సదస్సు అనంతరం మంగళవారం ఉదయం గవర్నర్ జస్టిస్ నజీర్ దంపతులు, కుటుంబసభ్యులతో తిరుమల ఆలయం వద్దకు విచ్చేశారు. వీరికి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ ,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన గవర్నర్ దంపతులు ఆనందనిలయంలోనికి చేరుకని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ సింఘాల్ శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. వీరితోబాటు తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి శ్రీవారిని దర్శించుకున్నారు.

# వాణిజ్య చర్చలు సానుకూలం!

>> వాయిదాపడ్డాయి. ఈక్రమంలో మంగళవారం సానుకూల చర్చలు జరిగాయని అటు బ్రెండెన్ ఇటు రాజేశ్ అగర్వాల్‌లు ఇరువురు కూడా స్పష్టంచేసారు. ద్వైపాక్షిక వాణిజ్య సంప్రదింపులు తదుపరి చర్చల అజెండాపైనా సమావేశంలో ప్రస్తావనకు వచ్చిందని వాణిజ్య శాఖ ప్రకటించింది. వాణిజ్య ఒప్పందం తుదిదశకు వచ్చేందుకు రెండుదేశాలు కూడా విధిగా కృషిచేస్తున్నట్లు కేంద్ర మంత్రిత్వశాఖ వెల్లడించింది. డీల్‌లోని ఉన్న అన్ని అంశాలను కూడా చర్చించామని, సానుకూల ధృక్పథంతో ముందుకువెళుతున్నట్లు పరస్పర ప్రయోజనకారి అయిన వాణిజ్య ఒప్పందంకోసమే కృషిజరుగుతున్నట్లు మంత్రిత్వశాఖప్రకటించింది. ముందురోజురాత్రే లించ్ ఆయన బృందం భారత్‌కు చేరుకున్నారు. చమురుకొనుగోళ్లపై అదనపు సుంకాలు విధించడంవల్లనే వాణిజ్యడీల్ రానురాను వాయిదాపడింది. రష్యా చమురుకొనుగోళ్లు, యూరోపియన్ యూనియన్‌కు ఎల్ఎన్‌జి సరఫరా వంటివాటిపైనే ట్రంప్ సుంకాలుప్రకటిస్తామని చెప్పినతర్వాతనుంచే రెండు దేశాలమధ్య వాణిజ్య సంబంధాలు బెడిసికొట్టాయి. దీనికితోడు శ్వేతసౌధం ప్రతినిధి పీటర్ నవార్రో తరచూ భారత్‌పై నోరుపారేసుకోవడం కూడా చర్చలకు ఆటంకం కలిగించిందనే చెప్పాలి. అయితే ట్రంప్ మాత్రం ఈ చర్చలు సానుకూల పరిణామాలని ప్రకటించారు. భారత్ అమెరికాలు వాణిజ్యప్రతిబంధకాలపై చర్చలు కొనసాగిస్తున్నాయని ఇదొక శుభపరిణామం అని అన్నారు. తనమంచి మిత్రుడు భారతప్రధాని నరేంద్రమోడీతో మాట్లాడేందుకు తాను ఎదురుచూస్తున్నట్లు తన ట్రూత్‌సోషల్‌మీడియాలో పోస్టుచేసారు. రానున్న కొద్దివారాల్లోనే మా ఇద్దరి భేటీఉంటుందని ఆయన ఆశాభవం వ్యక్తంచేసారు. రెండు గొప్పదేశాల మధ్య ఈ వాణిజ్య ఒప్పందం జరగడంలో ఎలాంటి అడ్డంకులు ఇకపై ఉండబోవనే ఆయన పేర్కొన్నారు. అదే క్రమంలోప్రధానినరేంద్రమోడీ కూడా ఇదే తరహాలో స్పందించారు. భారత్ అమెరికాలు సహజ భాగస్వాములని పేర్కొన్నారు.

# ఆలయ భూముల రక్షణపై హైకోర్టు కీలక ఆదేశాలు!

**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నగర శివారుల్లోని గొల్లపూడిలో గొడుగుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన దేవాదాయ భూముల్లో "విజయవాడ ఉత్సవ్" నిర్వహించడంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు లో పిటీషన్ దాఖలైంది. ఈ పిటీషన్‌పై న్యాయస్థానం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ క్రమంలో దేవాదాయ భూములను వాణిజ్య అవసరాలకు ఉపయోగించవద్దని ఆదేశాలు హైకోర్టు జారీ చేసింది. వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు ఎలా ఉపయోగిస్తారని హైకోర్టుప్రశ్నించింది ఆ భూములోకి తరలించిన గ్రావెల్, మట్టి, కంకరను వెంటనే తొలగించాలని ఆదేశించింది. ఆ భూములను యథాస్థితికి తీసుకురావాలని ఆదేశించింది న్యాయస్థానం. అయితే ఈ భూములను ఇప్పటికే 56రోజుల లీజుకు ఇచ్చింది దేవాదాయశాఖ. ఈ లీజు మొత్తాన్ని గొడుగుపేట దేవస్థానానికి విజయవాడ ఉత్సవ్ నిర్వాహకులు చెల్లించారు.హైకోర్టు ఆదేశాల జారీ చేసిన క్రమంలో విజయవాడ ఉత్సవ్ నిర్వహణపై సందిగ్ధత నెలకుంది.

# రాష్ట్రంలో కొత్తగా 13 వృద్ధాశ్రమాలు

## స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి

**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** పాఠశాలలకు అనుసంధానంగా అంగన్వాడీలుండేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలిన మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యర్శి సూర్య కుమారి సూచించారు. సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో ఆమె తన శాఖకు సంబంధించిన కార్యకలాపాలపైన ప్రజంటేషన్ ఇచ్చారు. అంగన్వాడీల్లో ఇప్పటికి కూడా 6 సంవత్సరాలపైబడిన పిల్లలుకూడా అలాగే అంగన్వాడీల్లో ఉండిపోతున్నారని చెప్పారు. వీరంతా బడిఈడు ప్రాయం పిల్లలని వీరిని బడిలో చేర్చే విధంగా కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు. అంగన్వాడీల నిర్వహణ మరింత పారదర్శకంగా జవాబుదారీ తనంగా నిర్వహించాలన్నదే ప్రభుత్వ ఆశయమని అన్నారు. ఇందులో భాగంగా విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నామన్నారు. ఇప్పటి వరకు అంగన్వాడీలు అంటే కేవలం తల్లులు, బిడ్డలు మాత్రమే అనుకునేవారని, ఇప్పుడు తండ్రులను కూడా ఇందులో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. తన బిడ్డ బాగోగుల బాధ్యత తల్లితోపాటు తండ్రికి కూడా ఉంటుందని, దీనిపై తండ్రులకు అవగాహన కల్పించి చైతన్యం కల్పిస్తామన్నారు. అంగన్వాడీల్లో దివ్యాంగులైన పిల్లల కోసం లిఫ్ట్ లేదా ర్యాంప్‌లు ఏర్పాటు చేయవచ్చని దీనికోసం ప్రత్యేకంగా నిధులున్నాయని, కలెక్టర్లు అందరూ దీనిపై దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్రంలో కొత్తం మరో 13 వృద్ధాశ్రమాలను అటల్ వయో అభ్యుదయ యోజన పథకం కింద ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అంగన్వాడీల్లో 9246 టాయ్‌లెట్లు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 6662 టాయ్‌లెట్లు (72 శాతం) మాత్రమే ఏర్పాటు చేశారని, 11403 అంగన్వాడీలకు మంచినీటి కొళాయి కనెక్షన్ సదుపాయం కల్పించాలన్నది లక్ష్యంగా పెట్టుకుంటే అందులో కేవలం 79 శాతం మాత్రమే సాధించామన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి రాష్ట్రీయ పోషన్ మా కార్యక్రమం మొదలవుతోందని, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రసంగంతో ఈ కార్యక్రమం మొదలవుతుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఊబకాయం, మధుమేహం తదితర సమస్యలను తగ్గించుకోవడంపై ప్రజల్లో అవగాహన చైతన్యం కలిగించడం కోసం రూపొందించిన కార్యక్రమని తెలిపారు. అంగన్వాడీల్లో పిల్లల హాజరీ 65 శాతంలోపు ఉన్న జిల్లాల్లో కృష్ణా, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాలు అట్టడుగున ఉన్నాయని ఈ జిల్లాల కలెక్టరులు దీనిపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కిశోరీ వికాసం కింద మెంటార్స్‌ని కూడా వినియోగిస్తున్నాని, అయితే మొదట్లో ప్రైవేటు స్కూళ్లలో ఈ మెంటార్స్‌ని అంగీకరించలేదన్నారు. అయితే ప్రైవేటు స్కూళ్లలోనే అత్యధికంగా డ్రగ్స్ బాధితులు, ఆత్మహత్యలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కిశోరీ వికాసం కింద పనిచేసే మెంటార్స్ సేవలను కూడా వినియోగించుకోవాలన్నారు.

# ఎక్సైజ్ కమీషనర్‌గా రాహుల్ దేవ్ శర్మకు అదనపు బాధ్యతలు

**విజయవాడ, సెప్టెంబరు16, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎక్సైజ్ శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి రాహుల్ దేవ్ శర్మకు ఎక్సైజ్ కమీషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీచేశారు. ఫలితంగా రాహుల్ దేవ్ శర్మ ఇకపై డైరెక్టర్, ఎక్సైజ్ ప్రొహిబిషన్; మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్; కమిషనర్, డిస్టిలరీస్ బ్రూవరీస్ హోదాలలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ తాత్కాలిక ఏర్పాట్లు తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కొనసాగుతాయని ప్రభుత్వం ప్రకటించింది.

# గున్నేపల్లి అగ్రహారం పంచాయతీ కార్యదర్శికి జైలు శిక్ష

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త):** గున్నేపల్లి అగ్రహారం పంచాయతీ కార్యదర్శి దుర్గాభవానిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసి ఒక వారం జైలు శిక్ష విధించింది.గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణంలో కోర్టును ఆశ్రయించడంతో పనులను తక్షణం నిలిపివేయాలని కోర్టు స్టేటస్ కో విధించింది.నిర్మాణపు పనులు నిలిపివేయకుండా యదావిధిగా కొనసాగిస్తుండటంతో పిటీషనర్ మరలా కోర్టును ఆశ్రయించారు.పిటిషనర్ తరఫున న్యాయవాది మాకిరెడ్డి మనోజ్ వాదనలు విన్న కోర్టు పరిశీలనలో ఆదేశాల ఉల్లంఘన స్పష్టమని తేల్చింది. దీంతో కోర్టు నిబంధనలు ఉల్లంఘనపై పంచాయతీ కార్యదర్శికి హైకోర్టు ఒక వారం జైలు శిక్ష విధించింది. మరల శిక్షను రెండు రోజులు సస్పెండ్ చేస్తూ సెప్టెంబర్ 17న హాజరుకావాలని ఆదేశించింది. ఇది ఇలా ఉండగా జల జీవన్ మిషన్ నిధులతో ఈ నిర్మాణాన్ని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చేస్తున్నారు. ఇప్పటికే ఈ కేసు విషయంలో పలువురు అధికారులకు షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చినట్లు సమాచారం.

# దేశ రాజకీయాల్లో 1983 ఒక సంచలనం, ఆయన చరిత్ర సజీవం

## 'సజీవ చరిత్ర' పుస్తకం ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు, వెంకయ్య నాయుడు, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి కొల్లు రవీంద్ర, ఎన్టీఆర్ ట్రస్టు డైరెక్టర్ నందమూరి రామకృష్ణ

**విజయవాడ,సెప్టెంబరు16,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ రాజకీయాల్లో 1984 ఒక సంచలనమని సిఎం నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని పాతర వేసేందుకు రాజకీయ కుట్రలు పన్నిన వారిని ప్రజలే తిరుగబడి బుద్ది చెప్పిన సజీవ సాక్ష్యాలను చరిత్రలో నిలిపిన వత్సరమన్నారు.1983లో చరిత్ర తిరగరాసిన ప్రజా నాయకుడు ఎన్టీఆర్‌ను గద్దెదించిన శక్తులకు బుద్ది చెప్పి ప్రజలు తమ అక్కున చేర్చుకున్న ఘట్టమన్నారు.సజీవ చరిత్ర పుస్తకం ద్వారా 1984లో చోటు చేసుకున్న వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయని తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు సంబంధించిన రాజకీయ ప్రస్థానంలో కీలకమై ఆగస్టు సంక్షోభంతో సహా పలు కీలక ఘటనల ప్రస్తావనతో సజీవ చరిత్ర పేరిట రూపొందింది. ఎన్టీఆర్ సాహిత్య ట్రస్టు నిర్వహకుల టిడి జనార్ధన్ సంచాలకత్వంలో సీనియర్ పాత్రికేయుడు పూల విక్రమ్ రచించిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం రాత్రి విజయవాడ శివారు పోరంకిలోని ఓ సమావేశ ప్రాంగణంలో జరిగింది ఈ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు నాయుడు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి కొల్లు రవీంద్ర,ఎన్టీఆర్ ట్రస్టు డైరెక్టర్ నందమూరి రామకృష్ణ, సహకార బ్యాంకుచైర్మన్ నెట్టెం రఘురామ్, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, ఎంఎల్‌ఏ బోడే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ రాజకీయాల్లో 1983 ఒక సంచలనమని సిఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సజీవ చరిత్ర పుస్తకంద్వారా 1984లో చోటు చేసుకున్న వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయని తెలిపారు. మూడున్నర దశాబ్దాలపాటు కాంగ్రెస్ పాలనకు 1983 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలు ఒక గుణపాఠమని చెప్పుకొచ్చారు. దేశంలో నాయకులందరినీ ఒక తాటి మీదకు తీసుకొచ్చేందుకు వెంకయ్య నాయుడు ఎంతో కృషి చేశారని ఉద్ఘాటించారు. ఆ రోజు గవర్నర్ రామ్ లాల్ ఏకపక్షంగా వ్యవహారించారని గుర్తుచేశారు. ఎప్పుడూ లేని సంఘీభావాన్ని ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి చూపించారని గుర్తుచేశారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇచ్చేవరకు పోరాటం చేస్తాం. కచ్చితంగా సాధిస్తాం. సజీవ చరిత్ర 1984 పుస్తకం ద్వారా ఇప్పటి ప్రజలకు వాస్తవాలు తెలుస్తాం. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే భారతదేశం అగ్రదేశంగా ఉంటుంది. అమరావతిలో తెలుగు వైభవం పేరుతో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తాం.ఎన్టీఆర్ మన ముందు లేరు.ఆయన ఆశయాలు మాత్రం మా ముందు ఉంటాయని సిఎం చంద్రబాబు ఉద్ఘాటించారు.



మంగళవారం 'సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణలో సిఎం చంద్రబాబు,మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి కొల్లు, ఎన్టీఆర్ ట్రస్టు డైరెక్టర్ నందమూరి రామకృష్ణ తదితరులు

**కాంగ్రెస్ 1984లో ప్రజాస్వామ్యాన్ని నిస్సిగ్గుగా ఖూనీ చేసింది: వెంకయ్యనాయుడు**

1984లో ప్రజాస్వామ్యాన్ని నిస్సిగ్గుగా ఖూనీ చేశారని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు విమర్శించారు. చరిత్ర పుస్తకాల్లోనే కాదు రాజనీతి శాస్త్ర పుస్తకాల్లో చేర్చాల్సిన అంశం 1984 ఘటన అని వెంకయ్య నాయుడు తెలిపారు. ఆనాడు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి ప్రజలు ఎన్టీఆర్ వెనక నిలబడ్డారు. తెలుగు అధ్యయన కేంద్రం మైసూర్‌లో ఉండకూడదన్న ఉద్దేశంతో తాను నెల్లూరుకు తీసుకువచ్చాను. గత పాలకులు ఆర్థికంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏమీ లేకుండా చేశారని వెంకయ్యనాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మన ముఖ్యమంత్రి కూడా ఆయన కంటే ఎక్కువ హామీలు ఇస్తానని అన్నారని వెంకయ్యనాయుడు గుర్తుచేశారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే చూడాలన్నది నా కోరిక. నేను పదవికి విరమణ చేశాగాని పెదవికి మాత్రం కాదని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు.

17-09Pg3 VIJ 3RD_17-09Pg3 VIJ.qxd 9/17/2025 12:52 AM Page 1



# తిరుమల సమాచారం

## బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తాం

### - 24నుండి వాహన సేవలు ప్రారంభం

### - ఉత్సవాల బుక్‌లెట్ ఆవిష్కరణ



**తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాత వార్తప్రతి నిధి:** బ్రహ్మాండనాయకుడి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈఏడాది బ్రహ్మాండంగా నిర్వహిస్తామని, అందుకు అన్ని ఏర్పాట్లుచేస్తున్నామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. 24వతేదీ నుండి ఉత్సవాల వాహనసేవలు ఆరంభమవుతాయన్నారు. రోజుకు రెండు వాహనాలపై మలయప్పస్వామి ఊరేగుతారన్నారు. ఆలయ మాఢ వీధుల్లో గ్యాలరీలను పటిష్టంగా నిర్మించామని, వర్షం వచ్చినా భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. గ్యాలరీల్లో నిరంతారయంగా భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గరుడసేవరోజు 3లక్షలమంది భక్తులు వాహనసేవ వీక్షించేలా ఏర్పాట్లు ఉంటాయన్నారు. తొమ్మిదిరోజులుపాటు జరిగే తిరుమలేశుని బ్రహ్మోత్సవాల వాహనసేవలు, ఆలయంలో జరిగే స్నపనతిరుమంజనం విశేషాల వివరాలతో ముద్రించిన వాహనసేవల బుక్‌లెట్‌ను మంగళవారం మధ్యాహ్నం అన్నమయ్యభవనంలో ఆవిష్కరించారు. 24వతేదీ సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేషవాహనం, ఐదవరోజు 28వతేదీ రాత్రి గరుడవాహనసేవ, 29వతేదీ సాయంత్రం స్వర్ణరథం, అక్టోబర్ 1వతేదీ ఉదయంరథోత్సవం, 2వతేదీ ఉదయం చక్రస్నానం విశేష ఘట్టాలు. ఈ విశేషాల వివరాలతో ముద్రించిన పుస్తకాన్ని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్‌ఒ మురళీకృష్ణ, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డిప్రశాంతిరెడ్డి, ఎంఎస్‌రాజు, శాంతారామ్, నర్శిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, జానకీదేవి,సిపిఆర్‌ఒ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాత వార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి తొమ్మిదిరోజులుపాటు జరగనున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల ముందు మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులు మహాయజ్ఞంలా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయం అంతటా సుగంధపరిమళ ద్రవ్యంతో శుద్ధి చేశారు. ఉదయం 6గంటల నుండి 10గంటల వరకు సాగిన ఈ మహాయజ్ఞంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు పనబాకలక్ష్మి, భానుప్రకాశ్‌రెడ్డి, నరేష్‌కుమార్, శాంతారాం,సదాశివరావు, జంగాకృష్ణమూర్తి, జానకిదేవి,మహేందర్‌రెడ్డి, వేమిరెడ్డిప్రశాంతిరెడ్డి, టిటిడి సివిఎస్‌ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అర్చకులు, ఉద్యోగులు పాల్గొని ఆలయంలోపల బంగారువాకిలి నుండి ఉప ఆలయాలు, మహద్వారం వరకు నీటితో శుభ్రంగా కడిగారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం,గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పరిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా సంప్రోక్షణ చేశారు. ఉదయం 10గంటలకు ప్రోటోకాల్ విఐపిలకు బ్రేక్ దర్శనం చేయించి నంతరం 11గంటలకు సర్వదర్శనం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈసందర్భంగా ఆలయంలో జరగాల్సిన అష్టదళపాదపద్మారాధన సేవ రద్దయ్యింది. ఏడాదిలో వార్షిక బ్రహ్మోత్సవాలు, ఉగాది ఆస్థానం, వైకుంఠ ఏకాదశి,ఆణివార ఆస్థానం ముందువచ్చే మంగళవారాల్లో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టడం ఆనవాయితీ.

## భక్తులకు మరింతగా సేవచేసేందుకు కృషి చేస్తా

### - టిటిడి ఇఒ సింఘాల్‌కు బోర్డు ఘన సన్మానం



**తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాత వార్తప్రతి నిధి:** ఎంతో ప్రసిద్ది చెందిన టిటిడిలో ఇఒగా రెండవసారి నియమితులైతనవంతుగా అనుభవం, అవగాహనతో భక్తులకు సేవలందించేందుకు ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ రావడం ఆనందదాయకమని, ఆయన అనుభవంతో భక్తులకు మరింత మెరుగైన సేవలందుతాయని టిటిడి బోర్డు అభినందించింది. టిటిడి ఇఒగా అనిల్ కుమార్‌సింఘాల్ రెండవసారి నియమితులైన తరువాత అన్నమయ్య భవనంలో మంగళవారం జరిగిన టిటిడి పాలకమండలి సమావేశంలో ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డిప్రశాంతిరెడ్డి, ఎంఎస్‌రాజు, శాంతారామ్, నర్శిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, జానకీదేవితదితరులు ఇఒను అభినందించి ఘనంగా సన్మానించారు. గతంలో ఇఒగా పనిచేసిన సిఘాల్‌కు ఉన్న అనుభవం భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించడంలో,టిటిడిని ముందుకు నడిపించడంలో ఉపయోగపడుతుందని పాలకమండలి సభ్యులు ఆకాంక్షించారు. ఇఒగా రెండవసారి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఆయన కృతజ్ఞతలు తెలిపి, ఆయన సూచనలను తీసుకుని,భక్తులకు మరింత మెరుగైన సేవలందిస్తానన్నారు.

## టిటిడి సముచిత ఆలోచన

### ఇక అంగప్రదక్షిణ టోకెన్లు లక్కీడిప్‌లో

**తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలస్వామికి ఎంతో భక్తితో భక్తులు మొక్కుబడుల్లో భాగంగా వేకువజామున చేపట్టే అంగప్రదక్షిణ కూడా ఆన్‌లైన్‌లో లక్కీడిప్‌లో జారీచేసేందుకు టిటిడి సిద్ధమైంది. ఇప్పటివరకు అమల్లో ఉన్న ముందు వచ్చిన వారికి ముందు అనే విధానంలో లక్కీడిప్ విధానం ప్రవేశపెట్టారు. టిటిడి ఇఒగా అనుభవం, అవగాహన ఉన్న అనిల్‌కుమార్‌సింఘాల్ ముందుచూపుతో అంగప్రదక్షిణ టోకెన్లు మూడునెలల ముందుగానే ఆన్‌లైన్‌లో లక్కీడిప్ విదానం ద్వారా విడుదలవ్రుతా యి. టిటిడి తాజాగా అంగప్రదక్షిణ టోకెన్లు జారీలో వినూత్న మార్పు తీసుకు వచ్చింది. డిసెంబర్‌నెలకు సంబంధించి అంగప్రదక్షిణ టోకెన్లకోసం రేపు (18వ తేదీ) నుండి 20వతేదీ వరకు లక్కీడిప్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.


**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

**E PROCUREMENT TENDER NOTICE**

| S.No. | NIT No. | Name of the work |
|---|---|---|
| 1. | 78/MAU61-EE0ED (OTH)/16/2025-DP Dated: 15.09.2025 | RFP for Engagement of Developers for Development of the 7.935 Acres Land Parcel Located in Pitchikalapalem Village, Amaravati through PPP mode. |
| 2. | 79/MAU61-EE0ED (OTH)/16/2025-DP Dated: 15.09.2025 | RFP for Engagement of Developers for Development of the 19.72 Acres Land Parcel Located in Mandadam Village, Amaravati through PPP mode. |
| 3. | 81/MAU61-EE0ED (OTH)/16/2025-DP Dated: 15.09.2025 | RFP for Engagement of Developers for Development of the 30.34 Acres Land Parcel Located in Rayapudi Village, Amaravati through PPP mode. |

The bid can be downloaded on AP e-procurement portal from 17.09.2025 to 03.10.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 03.10.2025 up to 15.00 Hrs, Technical bid opening 03.10.2025 @ 16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.

Sd/- Commissioner, APCRDA, Vijayawada


## శాసన మండలి ఛైర్మన్ తరపు న్యాయవాదికి హైకోర్టులో షాక్

**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ రాజీనామా ఆమోదించాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ నేపథ్యంలో శాసన మండలి ఛైర్మన్ తరపు న్యాయవాదికి మంగళవారం ఏపీ హైకోర్టు షాక్ ఇచ్చింది. పిటిషన్‌కు కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం ఇవ్వాలంటే అందుకు ఖర్చుల కింద రూ.10లక్షలు చెల్లించాలంటూ సదరు న్యాయవాదిని ఈ కేసు విచారిస్తున్న జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం 5 గంటల లోపు లీగల్ సర్వీస్ అథారిటీకి ఈ నగదు చెల్లింపులు జరగాలంటూ శాసన మండలి ఛైర్మన్ తరపు న్యాయవాదికి స్పష్టం చేశారు. జయమంగళవెంకట రమణ.తొలుత టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో ఆయన ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ కొద్ది నెలలకు ఆయనకు ఎమ్మెల్సీ పదవి కేటాయించి.. శాసన మండలికి పంపారు. అనంతరం తనకు విలువ ఇవ్వడం లేదంటూ 2024, నవంబర్‌లో తన ఎమ్మెల్సీ పదవితోపాటు వైసీపీకి ఆయన రాజీనామా చేశారు. ఆ లేఖను శాసన మండలి ఛైర్మన్ కె. మోషేజ్ రాజుకు స్వయంగా అందజేశారు. ఆ లేఖను ఛైర్మన్ ఆమోదించ లేదు.తన రాజీమానా లేఖను ఆమోదించేలా శాసన మండలి ఛైర్మన్‌ను ఆదేశించాలంటూ జయ మంగళ వెంకట రమణ ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో తమకు కొంత సమయం ఇవ్వాలంటూ శాసన మండలి ఛైర్మన్ తరఫు న్యాయవాది కోర్టుకు కోరారు. ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని.. మరింత సమయం అంటే ఎలా అంటూ జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. మరింత సమయం అంటే.. ఖర్చుల కింద రూ. 10 వేలు చెల్లించాలంటూ సదరు న్యాయమూర్తిని ఆదేశించారు. ఈ కేసు తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

## ముఖ్యమంత్రికి మంచి పేరు తెచ్చేలా సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల జారీపై చర్యలు తీసుకోవాలి

### విఆర్‌ఓ అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు

**విజయవాడ, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాల కనుగుణంగా శాశ్వత కులధృవీకరణ పత్రాలను జారీచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపి విఆర్‌ఓ అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడులు కోరారు. సోమ, మంగళవారాల్లో జరిగిన కలెక్టర్ల సదస్సులో శాశ్వత కులధ్రువీకరణ పత్రాలివ్వాలని సిఎం నిర్ణయం తీసుకున్నారని వారు హర్షం వ్యక్తం చేశారు. తప్పుడు సమాచారంతో సేకరించిన డేటా ఆధారంగా శాశ్వత కులధృవీకరణ సర్టిఫికెట్లు జారీ చేసేలా కొందరు చేశారన్నారు.

## అదుపులోకి వస్తున్న డయేరియా

**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో డయేరియా కేసులు గణనీయంగా తగ్గుతున్నాయని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సుహాసిని తెలిపారు.ఇప్పటి వరకూ 313 కేసులు నమోదైనప్పటికీ, డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లిన వాళ్లు 253 మంది ఉన్నారు. ప్రస్తుతానికి కేవలం 60 మంది మాత్రమే చికిత్స పొందుతున్నారు. 24 గంటల పాటు సేవలు అందిస్తున్నాం. శాంపిల్స్ లో మొదటి విడతవి అన్నీ నెగటివ్ అనే వచ్చింది. మరిన్ని పరీక్షలకు సంబంధించిన ఫలితాలు వచ్చిన తరువాత ప్రణాళిక ఏంటి అనేది నిర్ణయిస్తామన్నారు.రాజరాజేశ్వరిపేటలో డయేరియా అదుపులోకి వస్తోంది. కొత్త కేసులు తగ్గుముఖం పడుతు న్నాయి. రాజేశ్వరిపేటలో వైద్య శిబిరంతోపాటు విజయవాడ జీజీహెచ్‌లో బాధితులు కోలుకుం టున్నారు. ప్రస్తుతం 60 మంది బాధితులు రెండు చోట్ల చికిత్సలు పొందుతున్నారు. తాగు నీటి శాంపిళ్లను ప్రయోగ శాలకు పంపిన అధికారులు, వాటి ఫలితాల కోసం ఎదురు చూస్తు న్నారు. స్దానిక రాజరా జేశ్వరి పేటలో వారం రోజుల నుంచి అతిసారం ప్రబలి ఉంది. వాంతులు, విరేచనా లతో ప్రజలు ఆందోళనకు గురవు తున్నారు. స్వల్ప లక్షణాలున్న వారికి రాజరాజేశ్వరిపేటలో ఏర్పా టు చేసిన



వైద్యశిబిరంలో చికి త్సలు అందిస్తుండగా పరిస్థితి తీవ్రంగా ఉన్నవారిని జీజీహెచ్ కు తరలించి చికిత్సలు అందిస్తు న్నారు. ఇప్పటివరకు 313 కేసులు నమోదు కాగా, ప్రస్తుతం 60 మంది వరకు చికిత్సలు పొందు తున్నారు. చికిత్స తీసుకొని మరో 253 మంది ఇళ్లకు వెళ్లిపోయారు. గత 6 రోజులతో పోల్చిచూస్తే పరిస్థితి కాస్త కుదుటపడింది. కొత్త కేసుల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతుంది. బాధితులకు శిబిరాల్లోనే మందులతో పాటు ఐవీ ఫ్లూయిడ్స్ అందిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్యసదుపాయాలు బాగున్నాయని బాధితులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అన్నీ సక్రమంగా అందివ్వడం వల్ల వేగంగా కోలుకున్నామని బాధితులు చెబు తున్నారు. బాధితులు కూలీ పని చేసుకునేవారు కావడం వలన ఉపాధిపరంగా ప్రభుత్వం సాయం అందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆహార పదార్థాలతోపాటు కుటుం బానికి 10 వేల రూపాయలు చొప్పున ఆర్థిక సాయం అందించాలని ప్రజాసంఘాల నాయ కులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రాజరాజేశ్వ రిపేటలో ముందుజాగ్రత్తగా రక్షితనీటి పథకం తాగునీటి సరఫరాను ఆపేశారు. దానికి బదులుగా ఇంటింటికీ వాటర్ క్యాన్లను అందిస్తు న్నారు. సమస్య తీవ్రం కాకుండా మినరల్ వాటర్ ప్లాంట్లను మూసివేశారు. హోటళ్లను, కిరాణా షాపులను, చిన్నచిన్న దుకాణాలను మూసివేయించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని అధికారులు సూచిస్తున్నారు. కేసుల ఉధృతి తగ్గిందని,భయాందోళన చెందవద్దని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కోరారు.




తెలుగు, సంస్కృత భాషాభిమానుల సదస్సులో ప్రసంగిస్తున్న అకాడమీ ఛైర్మన్ శరత్‌చంద్ర

## తెలుగు, సంస్కృత అకాడమీ ద్వారా భాషా వికాసానికి కృషి

### - అకాడమీ ఛైర్మన్ శరత్‌చంద్ర

**విజయవాడ,సెప్టెంబరు16,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు,సంస్కృత అకాడమీ ద్వారా భాషా వికాసానికి కృషి చేస్తానని ఆ అకాడమీ ఛైర్మన్ శరత్‌చంద్ర (ఆర్డీ విల్సన్) అన్నారు. తెలుగు సంస్కృత అకాడమీ ఛైర్మన్ శరత్ చంద్ర సంపాదకలు, రచయితలుభాషాభిమానుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంను మంగళవారం విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించారు.ఈ సమావేశంలో సామజిక రంగంలోనే కాకుండా సాహిత్యంలో తనదైన ముద్రను వేసి, వెనుకబడిన బలహీన పేద బడుగు వర్గాల హక్కుల సాధనకై అనేక ఉద్యమాలు చేపట్టడమే కాకుండా, తన రచనలతో వార్తా పత్రికల ద్వారా తనదైన శైలిలో సమాజంలో అనేక అంశాలపై గళమెత్తిన సంఘ సంస్కర్త శరత్ చంద్ర) అని పలువురు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీ విల్సన్ మాట్లాడుతూ తెలుగు భాషపై, సాహిత్యం పై తనకున్న మక్కువతో వైద్య రంగాన్ని ఎంపిక చేసుకునే అవకాశం ఉన్నా తాను మాత్రం సాహిత్యం వైపే అడుగేసి సమాజాభివృద్ధికి దోహద పడే అనేక నవలలు, కథలు, నాటకాలు రచించానని తెలిపారు. అంతే కాకుండా సమాజం పై ఉన్న బాధ్యతతో సమకాలిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో పత్రికా విలేకరిగా కూడా పనిచేశానని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో తెలుగు భాష ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోనున్నదన్నారు., . తెలుగు భాష యొక్క సౌందర్యం మాట్లాడంలో, సాహిత్యం చదవడంలో ఇమిడి ఉందన్నారు. కులానికి, మతానికి భాషను ఆపాదించవద్దని కోరారు. నడుస్తున్న చరిత్రకు సాహిత్యం ఒక సాక్షి అని అలాంటి సాహిత్యాన్ని కనుమరుగవ్వకుండా పరిరక్షించుకోవాలని సూచించారు. తెలుగు మరియు సంస్కృత అకాడమీలో పనిచేసే ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరిస్తూ, విద్యార్థులకు ఈ అకాడమీ ద్వారా మరిన్ని సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పచెప్పిన కూటమి ప్రభుత్వానికి ఆర్డీ విల్సన్ ధన్యవాదాలు తెలియచేసారు.

## ప్రతి శుక్రవారం 'ఇంటింటా మనమిత్ర' పై ప్రచారం

**విజయవాడ,సెప్టెంబరు16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలెవ్వరూ కూడా సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా అన్ని సర్టిఫికెట్లు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే డౌన్ లోడు చేసుకునే విధంగా ప్రజలకు తెలియజెప్పాలని ఐటీ, మరియు ఆర్టీజీ శాఖల కార్యదర్శి భాస్కర్ కాటంనేని జిల్లా కలెక్టర్లకు సూచించారు. సచివాలయంలో జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సదస్సులో భాగంగా ఆయన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ అమలుపై ఆయన ప్రజంటేషన్ ఇచ్చారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ అద్భుతమైన సాధనమని, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చేయడంలో జిల్లా కలెక్టర్లే కీలకపాత్ర పోషించాలన్నారు. క్యాస్ట్, నేటివిటీ, జనన, మరణ ధృవీకరణ పత్రాలు ఇతరత్రా సర్టిఫికెట్ల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, దయచేసి సర్టిఫికెట్ల జారీ కోసం ప్రజలను ప్రభుత్వ కార్యాలయాలకు పిలిపించుకోకండని ఆయన కోరారు. ఇప్పటికీ కూడా చాలా మంది అధికారులు సర్టిఫికెట్ల జారీ కోసం ప్రజలను కార్యాలయాలకు పిలిపించుకుంటున్నారని ఇది సరికాదన్నారు. జిల్లా స్థాయిలో కింది స్థాయి కార్యాలయాల్లో, అధికారులు, సిబ్బందికి ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పాలన్నారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్‌లోని మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ యాప్‌లోనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్టిఫికెట్ డౌన్ లోడు చేసుకోవచ్చన్నారు. వాట్సాప్ ద్వారా డౌన్‌లోడు చేసుకునే డిజిటల్ సర్టిఫికెట్లు సురక్షితమైనవని, అన్ని సర్టిఫికెట్లను డిజిలాకర్లో ఉంటాయని, అలాగే బ్లాక్ చైన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నామని, కాబట్టి ఈ సర్టిఫికెట్లను ఎవ్వరూ కూడా ట్యాంపర్ చేయలేరని తెలిపారు. ప్రజల్లో వాట్సాప్ గవర్నెన్స్ ఉపయోగించుకుంటే ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలుంటాయో ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.


**టాటా మెమోరియల్ సెంటర్**
**అడ్వాన్స్ సెంటర్ ఫర్ ట్రీట్‌మెంట్, రిసెర్చ్ మరియు ఎడ్యుకేషన్ ఇన్ క్యాన్సర్ (ACTREC)**
సెక్టార్-22, ఖర్గర్, నవీ ముంబై 410210
భారత ప్రభుత్వ, అణుశక్తి విభాగం యొక్క గ్రాంట్-ఇన్-ఎయిడ్ సంస్థ
**అందుబాటులో ఉన్న స్థానాలు**

ప్రకటన నం: ACTREC/ADVT/A-13/2025 10/09/2025

అర్హత గల అథారిటీచే అనుమతింపబడిన ఈ క్రింది ఉద్యోగాలకు ACTREC దరఖాస్తులు ఆహ్వానిస్తోంది

| క్ర.సం. | ఉద్యోగం యొక్క పేరు |
|---|---|
| 1 | కన్సల్టెంట్ 'F' (క్లినికల్ ఫార్మాకోలజీ) (1-UR) |
| 2 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' సర్జికల్ అన్కాలజీ (గ్యాస్ట్రోఇన్‌టెస్టినల్) (2-UR) |
| 3 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' (గైనిక్ అన్‌కాలజీ) (1-UR) |
| 4 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' (హెడ్ & నెక్ సర్జరీ) (2-UR) |
| 5 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' (పెడియాట్రిక్ సర్జరీ) (2-UR) |
| 6 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' (ప్లాస్టిక్ సర్జరీ) (1-UR) |
| 7 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' (మెడికల్ ఆన్‌కాలజీ) (సోలిడ్ ట్యూమర్) (2-UR) |
| 8 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' (మెడికల్ ఆన్‌కాలజీ) (ఎడల్ట్ హెమటోలింఫాయిడ్) (1-UR) |
| 9 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' (ప్యాథోలజీ) (5-UR) |
| 10 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' (మెడికల్ గ్యాస్ట్రో ఎంటెరాలజీ) (1-UR) |
| 11 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' (ఎనస్థిసియోలజీ) (6-UR) |
| 12 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' (హెమటో ప్యాథాలజీ) (1-UR) |
| 13 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' (డీఎనస్థిసియోలజీ) (1-UR) |
| 14 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' (న్యూక్లియర్ మెడిసిన్) (2-UR) |
| 15 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' (రేడియో డయాగ్నసిస్) (2-UR) |
| 16 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' (ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్) (2-UR) |
| 17 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' (ఇంటర్వెన్షనల్ రేడియోలజీ) (2-UR) |
| 18 | అసిస్టెంట్ ప్రొఫెసర్ 'E' ఇంటెన్సివిస్ట్ (క్రిటికల్ కేర్) (2-UR) |
| 19 | కన్సల్టెంట్ 'E' (ప్రివెంటివ్ ఆన్‌కాలజీ) (1-UR) |
| 20 | కన్సల్టెంట్ 'E' (పల్మనరీ మెడిసిన్) (1-UR) |
| 21 | కన్సల్టెంట్ 'E' (ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్) (2-UR) |
| 22 | కన్సల్టెంట్ 'E' (క్యాన్సర్ జెనిటిక్స్) (1-UR) |
| 23 | క్లినికల్ సైంటిస్ట్ – సెల్యూలర్ థెరపీ 'E' (1-UR) |
| 24 | అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ – II (2-UR) |

10/09/2025 నుండి 10/10/2025 వరకు దరఖాస్తుల యొక్క ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ అందుబాటు చేయబడింది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది: 10/10/2025 సా.05.30 గం. వరకు (ఇండియన్ స్టాండర్డ్ టైమ్)
ఇంకా ఎక్కువ వివరాలకు మా వెబ్‌సైట్ https://actrec.gov.in వీక్షించండి.
ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలు చేయటం తప్పనిసరి.
ఈ ప్రకటనకు సంబంధించిన ఏవైనా చేర్పులు లేదా సవరణలు పై వెబ్‌సైట్‌పై అప్‌లోడెడ్ చేయబడతాయి.

CBC 48160/12/0003/2526 చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ACTREC



**F. No. P-L-02001/1/2025-PL**
**భారత ప్రభుత్వం**
**పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ**
**పాలసీ మరియు లా డివిజన్**
**NGT సెల్**

లెవెల్-1, జల్ వింగ్,
ఇందిరా పర్యావరణ్ భవన్
జోర్ బాగ్ రోడ్, న్యూఢిల్లీ-03

పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (NGT)లో జుడిషియల్ మరియు ఎక్స్‌పర్ట్ సభ్యుల యొక్క ఒక్కొక్కటి ఐదు (05) ఖాళీ ఉద్యోగాల యొక్క భర్తీ నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

అర్హతలు, కార్యాలయ నిబంధనలు, వయోపరిమితి, సర్వీస్ కండిషన్‌లు వగైరాలు మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ www.moef.gov.in పై అందుబాటులో ఉన్నాయి. దరఖాస్తు ఫారంతో కలిపి ప్రకటన యొక్క వివరాలు మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లోని https://parivesh.nic.in/newupgrade/#/legal-vacancies వద్ద అందుబాటులో ఉన్నాయి.

మంత్రిత్వ శాఖలో దరఖాస్తు దాఖలుకు చివరి తేది: 17.10.2025 (23.59 గం. (అర్ధరాత్రి) ప్రచురణ యొక్క తేదీ నుండి నాలుగు వారాలు, అన్ని దరఖాస్తులు జతపరచబడిన పత్రాలతో కలిపి ఆన్‌లైన్ దాఖలు చేయవలెను. (https://parivesh.nic.in/newupgrade/#/legal-vacancies) మంత్రిత్వ శాఖ, దరఖాస్తు దాఖలు యొక్క ఏ ఇతర పద్ధతిని పరిగణించదు. గడువు తేదీ మరియు సమయం దాటిన తర్వాత వచ్చిన ఏ దరఖాస్తును పరిగణించదు.

గమనిక: 29.03.2025న ముందు ప్రచురింపబడిన ప్రకటనకు స్పందించి దరఖాస్తులు ఇప్పటికే దాఖలు చేసిన అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు పంపనక్కర్లేదు. మరియు వారి దరఖాస్తులు కూడా తాజా ప్రకటనలో ప్రకటించబడిన అన్ని ఖాళీలకు పరిగణింపబడతాయి.

CBC 13101/11/0018/2526



**భారత ప్రభుత్వం**
**విద్యా మంత్రిత్వ శాఖ**
**ఉన్నత విద్యా విభాగం**

**అరుణాచల ప్రదేశ్, పాపమ్ పరే జిల్లా, రాజీవ్ గాంధీ యూనివర్శిటీ యొక్క వైస్-ఛాన్సలర్ యొక్క నియామకం**

రాజీవ్ గాంధీ యూనివర్శిటీకి సెప్టెంబరు, 2023లో వైస్-ఛాన్సలర్ యొక్క ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానించడమైనది. అయినప్పటికీ ఎంపిక మరింత విశాల ప్రాతిపదిక మరియు పదవీ విరమణ వయస్సు (70 సంవత్సరాలు) యొక్క సవరణ దృష్ట్యా ఆ ఉద్యోగం మళ్లీ – ఇప్పుడు ప్రకటించడమైనది. అందువలన అభ్యర్థులు ఇంతకుముందు దరఖాస్తు పంపినా పంపక పోయినా ఇప్పుడు ఫ్రెష్‌గా దరఖాస్తులు ఆహ్వానించడమైనది. ఈ తాజా ప్రకటనకు వచ్చిన దరఖాస్తులు మాత్రమే ఈ ఉద్యోగానికి పరిగణింపబడతాయి.

వైస్ ఛాన్సలర్ ఎకడమిక్ మరియు అడ్మినిస్ట్రేటివ్ హెడ్ కావటంతో ఈ క్రింది విధంగా ఉద్దేశించడమైనది.

- అత్యంత ఉన్నత స్థాయి సామర్థ్యం, నిజాయితీ, నైతికత మరియు సంస్థాగత అంకిత భావం కలిగి ఉన్న వ్యక్తి.
- విద్యా విద్వత్సంబంధితంగా సామర్థ్య నాయకత్వం కలిగిన రుజువుతో పేరొందిన రీసెర్చ్ మరియు / లేదా విద్యా పాలనా సంస్థలో 10 సంవత్సరాల అనుభవం లేదా ఒక యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా కనీసం 10 సంవత్సరాల అనుభవంతో విఖ్యాతి పొందిన విద్యావేత్త.
- ఈ ప్రకటన యొక్క దరఖాస్తుల స్వీకరణ తేదీ ముగింపు నాటికి 65 సంవత్సరాల వయస్సు కంటే ఎక్కువ ఉండకపోవటం.

**జీతం మరియు సర్వీస్ నిబంధనలు**

- ఈ ఉద్యోగానికి నెలకు రూ.2,10,000/- (స్థిరం) యొక్క జీతంతో రూ.11,250/- యొక్క ప్రత్యేక అలవెన్స్ మరియు ఇతర సాధారణ అలవెన్స్‌లు.
- సర్వీస్‌ల యొక్క నియమాలు మరియు నిబంధనలు చట్టంలో ఏర్పాటు చేసిన ప్రకారం, యూనివర్శిటీ యొక్క ఆర్డినెన్స్‌లు మరియు స్టాట్యూట్స్ ప్రకారం.

**నియామక పద్ధతి:**

- యూనివర్శిటీ చట్టం యొక్క ఏర్పాట్లు క్రింద నెలకొల్పబడిన ఒక కమిటీచే సిఫార్సు చేయబడిన పేర్ల యొక్క ప్యానల్ నుండి నియామకం చేయబడుతుంది.
- వెబ్‌సైట్స్ *http://www.education.gov.in* మరియు *https://www.rgu.ac.in* పై ప్రకటన అందుబాటులో ఉంది.
- అభ్యర్థులు, క్రింద ఇవ్వబడిన లింక్ ప్రకారం: విద్యా మంత్రిత్వ శాఖ SAMARTH పోర్టల్ పై "APPLY ONLINE ONLY" కు దరఖాస్తు చేయాలి.

https://vcrec.samarth.ac.in/index.php/

- పై పేర్కొనబడిన లింక్ 17.09.2025 ఉ.10.00 గం. నుండి 16.10.2025 సా.17.00 గం. వరకు యాక్టివ్‌గా ఉంటుంది.

CBC 21201/11/0015/2526

వార్త

మన మనస్సే మనకు పెట్టని కోట. అదిగాని దెబ్బతింటే జీవిత సమరంలో మనం ఓడిపోతాం.

-రాజాజి

# పంచాయతీలను నిర్వీర్యం చేయొద్దు

జాతిపిత మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించే దిశలో అడుగులు వేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని పాలక పెద్దలు ఏనాటి నుంచో చెప్తున్నా ఆచరణకు వచ్చే సరికి అవి మాటలకే పరిమితమవుతున్నాయి. స్వాతంత్ర్యంవచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా నేటికీ గ్రామీణ వ్యవస్థ అస్తవ్యస్తంగానే ఉంది. కనీసం రాజ్యాంగం కల్పించిన అధికారాలు కూడా స్థానిక సంస్థల ప్రతి నిధులకు అప్పగించేందుకు పాలక పెద్దల మనస్సు ఒప్పడం లేదు. వాస్తవంగా గ్రామస్వరాజ్యం గురించి స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి ఎందరో నాయకులు ఇవేమాటలు చెప్తున్నారు. వాటి పటిష్టతే తమ ధ్యేయమని పదేపదే ప్రకటనలు గుప్పిస్తున్నారు. వాటికి కేటాయించిన నిధులు, విధులు అప్పగిస్తామని ఎప్పటికప్పుడు వెల్లడిస్తున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో వాస్తవంగా చూస్తే గ్రామ సర్పంచులకు ఒక వ్యూహం ప్రకారం ప్రాధాన్యత తగ్గిస్తూ వస్తున్నారనేది స్పష్టమవుతున్నది. అందుకే గతంలో గ్రామ సర్పంచులకు, మండల అధ్యక్షులకు తదితర స్థానికసంస్థల ప్రతినిధులకు నాడు ఉండే గౌరవం నేడు కన్పించడం లేదు. దాదాపు అధికారం లేని ఉత్సవవిగ్రహాలుగా మార్చారనే చెప్పొచ్చు. ఇందుకు కారణం వారూ, వీరు అనేదాని కంటే ఎవరు అధికారంలో ఉన్నా పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకే ప్రయత్నం చేశారని చెప్పొచ్చు. గ్రామస్థాయిలో రకరకాల కమిటీలు పెట్టి సర్పంచులను దాదాపు పక్కన పెట్టారు. వారిప్రమేయం లేకుండానే వారికి తెలియకుండా ఎన్నో కార్యక్రమాలు గ్రామాల్లో జరిగే పరిస్థితులు తీసుకు వచ్చారు. ఒకరకంగా చెప్పాలంటే సర్పంచులకు సమాంతరంగా పదవులు సృష్టించారు. ఆంధ్రప్రదేశ్‌లో అయితేగత ప్రభుత్వ వాలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టడంతో సర్పంచు పదవులు నామమాత్రంగా మిగిలిపోయాయి. ఇలాంటి చర్యలతో సర్పంచులకు గతంలో ఉన్న ప్రాధాన్యత కూడా లేకుండా పోయింది. నేతల వాగ్దానాలతో ఏదో సాధించాలని, సమాజానికి ఏదో చేయాలని నూతన ఉత్సాహంతో ఎందరో యువతీయువకులు ఎన్నికల్లోపోటీ చేసి ఎన్నో వ్యయ ప్రయాసలకులోనై సర్పంచులయ్యారు. ఇందులో విద్యాధికులు కూడా ఉన్నారు. గ్రామాభివృద్ధికి తాము చేసిన వాగ్దానాలు తీర్చేందుకు నడుంకట్టారు. ఈ చట్టాల వలలో తాము చేయలేమనే విషయం అర్థం కావడానికి వారికి చాలాకాలమే పట్టింది. అయితే కొందరు స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రజలకు తాముచేసిన వాగ్దానాలను పూర్తి చేసేందుకు తలతాకట్టుపెట్టి తలకుమించిన భారంతో వడ్డీకి అప్పోసొప్పో చేసి కొన్ని గ్రామాల్లో పనులు పూర్తి చేశారు. అయితే ఎంతకూ ఆ బిల్లులు రాకపోవడం, ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి, ఇంకొకపక్క అప్పులు, వడ్డీలు పెరిగి, మరొకపక్క గ్రామప్రజల నుంచి తలవంచుకోలేక, ఆత్మాభిమానం చంపుకోలేక, డజన్ మందికిపైగా తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ బిల్లులకోసం తిరిగి తిరిగి సర్పంచులు పడిన వేదనఅంతా ఇంతా కాదు. గతయేడాది జనవరి 31తేదీతో వారి పదవీ కాలం పూర్తయిపోయింది. ఆనాటి నుంచి వారు మాజీలైపోయారు. ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు పంతొమ్మిది నెలలుగా మాజీ సర్పంచులుగా ఆఫీసులచుట్టూ ఈబిల్లుల కొరకు ప్రదక్షిణలు చేస్తున్నారు. బిల్లులు వస్తాయో, రావో తెలియదు. వస్తే ఎప్పుడు వస్తాయో చెప్పేవారు లేరు. సర్పంచులుగా ఉన్నప్పుడే కనీసమర్యాద ఇవ్వని కొందరు అధికారులు మాజీలైపోయిన తర్వాత వారి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. అంతా అగమ్యగోచరంగా ఉంది. ఒకనాడు పంచాయతీరాజ్ వ్యవస్థలో సర్పంచులంటే ఎంతో గౌరవ మర్యాదలుండేవి. ఆగ్రామానికి సంబంధించిన ఏ కార్యక్రమాలు జరిగినా ఉన్నతాధికారులు గ్రామానికి వచ్చినా సర్పంచులకు ప్రాధాన్యత ఇచ్చేవారు. వాస్తవంగా భారతదేశంలో స్థానిక సంస్థలకు రెండువేల సంవత్సరాలకుపైగా చరిత్ర ఉంది. అప్పుడు కూడాగ్రామ సభలుండేవి. గ్రామసభల నిర్ణయమే కీలకం. వాటి నిర్ణయాలకు ఆనాటి రాజరికవ్యవస్థ ఎంతోప్రాధాన్యతఇచ్చేది. ప్రాచీన కాలం నుండి గ్రామవ్యవస్థ ఏదో ఒకరూపంలో భారత్‌లో కొనసాగుతూనే వస్తున్నది. 1882 లో బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్‌రిప్పన్ స్థానిక సంస్థలకు ప్రతిపత్తి కల్పించారు. గాంధీ మహాత్ముడు ప్రవచించిన గ్రామ స్వరాజ్యలక్ష్యంలో స్థానికసంస్థల పటిష్టత అన్నది ఒక ముఖ్యాంశం. భారత రాజ్యాంగంలో కూడా స్థానిక సంస్థలకు అవసరమైన అధికారాలు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్పష్టంగా సూచించారు. 1952నుంచిఎన్నో కమిటీలు, మరెన్నో అధ్యయనాలు, మార్పులు, చేర్పులు చేసి పంచాయతీరాజ్ వ్యవస్థపటిష్టానికి కృషి చేస్తున్నట్లు చెప్పుకున్నారు. కానీ సర్పంచులకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు ఇవ్వడానికి పాలకపెద్దలకు నేటికీ మనసు ఒప్పడంలేదు. సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి వీధి లైట్ల నిర్వహణ, పర్యవేక్షణ ఇకనుండి గ్రామసర్పంచులకు అప్పగించాలని ఆదేశాలు జారీచేశారు. గ్రామాల్లోఅవసరమైనన్ని కొత్త ఎల్ఇడి లైట్లను అమర్చడంతోపాటు, వాటిని సమర్థవంతంగా నిర్వహించేనిర్వహణ అధికారం గ్రామపంచాయతీ పరిధిలోనే ఉండాలని స్పష్టం చేశారు. ఇదేకాదు రాజ్యాంగం కల్పించిన అధికారాలతో పాటునిధులు కూడా సకాలంలో అందేలాఏర్పాటు చేయాల్సిన అవసరంఉంది. ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాది వంటిది. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలకు కావాలని కేంద్రం ముందు గావుకేకలు పెడుతున్న నాయకులు స్థానిక సంస్థలకు మాత్రం అధికారాలు ఇవ్వకపోవడం దురదృష్టకరం.

మనుషులందరూ వృద్ధులుగా మారతారు. కానీ మంచివారుగా మారటం అరుదు.



లియో టాల్‌స్టాయ్

విధుల నిర్వహణ మార్గమే పేరు ప్రతిష్టల సంపాదనకు దారితీస్తుంది.



మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు



### పెన్షన్లు పెంచండి

ప్రభుత్వ ఉద్యోగాలు ఎన్ని సంస్థలలో పనిచేసినా వచ్చేది ఒకే పెన్షన్. ఆశ్చర్యమేమంటే రాజకీయ ఉద్యోగాలు చేసిన వారికి పెన్షన్లు ఎన్నో ఉన్నాయట. ఈమధ్య ఈ విషయం తెగ వైరల్ అవుతోంది. ఒక వ్యక్తి ఎమ్మెల్యేగా, మరోసారి ఎమ్.పి.గా ఆతదుపరి ఏ గవర్నరుగానో, ఒకసారి ఎన్నుకోబడగానే ఆ తరువాత పూర్తి కాలం పని చేయక పోయినా ఎన్ని పదవులు అలంకరిస్తే అన్ని పెన్షన్లు వస్తాయట. జీవితాంతం వరకు వైద్య, ప్రయాణ సదుపాయాలు ఉచితంగా లభిస్తాయట. మరల మరణాంతరం వారి నామినీలకు ఇస్తారట ఇదేమి చిత్రమోకదా! ఈ అసంబద్ధ, అమానుష, వికృత దూబరా ఖర్చులను తగ్గించమని ఏనాడూ ప్రభుత్వ, ప్రతిపక్ష సభ్యులు గౌరవ సభలలో ప్రశ్నించరు. ఇప్పుడైనా పెన్షన్లు పెంచండి.

- ఎన్ రామలక్ష్మి, సికింద్రాబాద్

### డంపింగ్ యార్డ్‌లు

రోడ్డుప్రక్కన, ప్రజలు నిత్యం ప్రయాణించే చోట, గ్రామాలకు పట్టణాలకు అతి సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్‌లను వేరొక చోటుకు మార్చాలి. ప్రజలు సంచరించే చోట నిత్యంరద్దీగా ఉండే చోట రోడ్డుపై డంపింగ్ యార్డ్‌లు ఉండడం వలన అటుగా వెళ్లే ప్రజలు ఒక కిలోమీటర్ వరకు ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. చిన్న పిల్లలు మురుగు వాసనలకు వాంటింగ్ చేసుకుంటున్నారు. నిత్యం డంపింగ్ యార్డ్ నుండి ప్రయాణం చేసే ప్రజలు అనారోగ్య సమస్యలు ఊపిరితిత్తు సమస్యలు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు వెంబడి ఉన్న డంపింగ్ యార్డులను అచటి నుండి తొలగించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### చెరువుల పట్ల నిర్లక్ష్యం చూపవద్దు

నీరే మనుగడకు ప్రాణాధారం. అటువంటి చెరువులను పూడ్చి వేస్తూ ప్రమాదకరమైన స్థలంలో ఇల్లు నిర్మించడం ప్రమాదకరమని తెలిసినా ప్రభుత్వం వాటిపై చర్యలు తీసుకోకపోవడం, పేద ప్రజలకు అటువంటి స్థలాలపై అవగాహన లేక అక్కడేనివాసం ఉండటం, వర్షాకాలంలో ఆ ఊర్లు నీటమునిగి ఎన్నో విపత్తులకు గురవ్వడం, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరుగుతుంది. ఇప్పటికైనా వరదల్లో ఊర్లు కొట్టుకుపోకుండా ప్రభుత్వం దృష్టి సారించాలి.

- కాల్వ నిఖిత, సిద్ధిపేట

### డిఎస్సీ జాబితాల్లో లోపాలు సరిచేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ 2025 సెలెక్షన్ లిస్ట్ ప్రకటించింది. అయితే ఈ ఎంపిక జాబితాలలో ఎక్కువ మార్కులు ఉండి ఓపెన్ కేటగిరిలో సెలెక్ట్ కావలసిన అభ్యర్థులు రిజర్వేషన్ కేటగిరిలో ఎంపిక చేసినట్లు డిఎస్సి అభ్యర్థులు తెలుపుతున్నారు. దీంతో రిజర్వేషన్ కేటగిరి అభ్యర్థులకు అన్యాయం జరిగినట్లుగా తెలుస్తోంది. డిఎస్సీ ఎంపిక జాబితాల్లో లోపాలున్నాయని డిఎస్సి అభ్యర్థులు చెబుతున్నారు. కాబట్టి వీటిని సరి చేసేందుకు అభ్యర్థుల నుంచి గ్రీవెన్స్ తీసుకొని వాటిని సరిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. వాటిని సరి చేసిన తర్వాతే డీఎస్సీ ప్రక్రియ ముందుకు పోవాల్సి ఉంది. అభ్యర్థులకు అభ్యంతరాలు తెలిపేందుకు అవకాశం ఇవ్వాలి. డీఎస్సీ అభ్యర్థి నుంచి అభ్యంతరాలు స్వీకరించి వాటిని పరిష్కరించిన తర్వాత తుది ఎంపిక జాబితాలు ప్రకటించాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### రిజర్వేషన్ సమానత్వానికి ఆవశ్యకత

మన దేశంలో సామాజిక న్యాయం, సమాన హక్కుల సాధన కోసం రిజర్వేషన్లు ఒక శక్తివంతమైన సాధనంగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ఇవి అత్యవసరం. బీసీవర్గాలు జనాభాలో పెద్ద శాతం ఉన్నప్పటికీ, వారికి ఉన్న రిజర్వేషన్ వాటా తక్కువగా ఉండడం వలన అనేకరంగాలలో వారు వెనుకబడిఉన్నారు. బీసీల ఆర్థిక, సామాజిక, విద్యా పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేయడం న్యాయసమ్మతమే. ఇది వారికి విద్య, ఉపాధి అవకాశాలలో సమాన స్థానం కల్పిస్తుంది. సమాజంలో సమతుల అభివృద్ధి సాధించాలంటే బలహీన వర్గాల ఆవశ్యకతలను గుర్తించి చర్యలు తీసుకోవాలి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### రైతులను ఆదుకోండి

భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన రైతు, వాతావరణ మార్పులకారణంగా తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నాడు. సకాలంలో రుతుపవనాలు రాక పంటలు ఎండిపోతుంటే, అకాల వర్షాలు చేతికొచ్చిన పంటను నాశనం చేస్తున్నాయి. పెట్టుబడికి తగిన గిట్టుబాటు ధర లేకపోవడం, పంట నష్టాలు, అప్పుల భారం రైతులను ఆత్మహత్యల వైపు నెడుతున్నాయి. గణాంకాల ప్రకారం, ప్రతిరోజూ సగటున 28 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నిజాం బూజు దులిపిన 'విమోచనం'

**ఆత్మగౌరవం కోసం ప్రాణాలు అర్పించిన చాకలి ఐలమ్మ, దొడ్డి కొము రయ్య, కొమరం భీమ్ వారసత్వాన్ని ముందు తరాలకు ఇవ్వాల్సిన బాధ్యత గుర్తెరగాలి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చరిత్రను గుర్తెరిగి విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి. లేదంటే అమరుల త్యాగాలకు అర్థంలేకుండా పోతుంది. వారి ఆకాంక్షలు ఆవిరి అవుతాయి. కేంద్ర ప్రభుత్వం కూడా ఎలాగయితే జమ్మూ కాశ్మీర్‌కి ఆర్టికల్ 370 తీసి నిజమైన స్వతంత్ర్యాన్ని అందించిందో అలాగే తెలంగాణ రాష్ట్రంలో విమోచన దినోత్సవం జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఇంకా తెలంగాణ విమోచన ఉద్యమ చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చి భవిష్యత్తు తరాలకు అందించాలి. తెలంగాణ అమరుల, స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను, వారి త్యాగాలకు గుర్తుగా మ్యూజియం ఏర్పాటు చేయాలి. శౌర్య భావన విడిచిన నాడు అమరుల కథలను మరిచిన నాడు మనుగడ లేదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విమోచన దినోత్సవాన్ని పల్లె పల్లెన జరపాలి.**

ఆర్. భాస్కర్ రెడ్డి

తెలంగాణ ప్రజలు ఎన్నో బాధలను దిగమింగినా, అనేక కష్టాలను చవిచూసినా, ఎన్నో అన్యాయాలను సహించి, ధర్మాన్ని విడనాడకుండా అవమానాలను ఎదుర్కొన్నా కూడా ఆత్మగౌరవాన్ని విడనాడలేదు. సరికదా ఏ పాలకుల ముందు మోకారిల్లలేదు. కానీ భారతదేశం విదేశీ కబంధ హస్తాల నుంచి విముక్తి లభించి స్వేచ్ఛా వాయువులు పీల్చుకునే సమయానికి ఈ దేశంలోని మూడు ప్రాంతాలు స్థానిక సంస్థానాల రాజుల చేతిలో బంధీగా చిక్కి చీకట్లో గడుపుతుండేవి. అందులో హైదరాబాద్ సంస్థానం ఒకటి. దేశాన్ని బ్రిటిష్ వలస పాలకుల చేతిలోంచి విముక్తి చేసి స్వాతంత్ర్యాన్ని సాధించిన ఆగస్టు 15న ప్రాణత్యాగం చేసిన సమర యోధులను వారి త్యాగాలను గుర్తు చేసుకుంటున్నాం. హైదరాబాద్, జునాగఢ్, కశ్మీర్ సంస్థానాల ప్రజలు మాత్రం బంధీగా ఉన్నారు. కాశ్మీర్, జునాగఢ్ సంస్థానాలు దేశంలో విలీనం కాగా హైదరాబాద్ సంస్థానం మాత్రం 1948 సెప్టెంబర్ 17న ఆపరేషన్ పోలో సైనిక చర్యతో నిజాం నిరంకుశ పాలన నుంచి విమోచనం పొంది దేశంలో విలీనం అయ్యింది. ఈ నిజమైన స్వాతంత్ర్య దినోత్సవాన్ని గూర్చి చాలా మంది తెలంగాణ ప్రజలకు ఇంకా తెలవకపోవడం దౌర్భాగ్యం. అప్పటి హైదరాబాద్‌లో భాగంగా వున్న కర్ణాటక, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలలో అక్కడి ప్రభుత్వాలు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తుంటే, తెలంగాణలో మాత్రం ఇప్పటికి జరపట్లేదు. పక్క రాష్ట్ర పాలకులు గుర్తించలేదు అందుకే ఆత్మగౌరవంతో బతకాలని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. కానీ ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని పేరు మార్చి జరపడంలో ఆంతర్యం అర్థం కావడం లేదు. చరిత్రను నిశితంగా పరిశీలిస్తే 1724లో మొదటి నిజాం హైదరాబాద్‌రాజ్య స్థాపన చేసే సమయానికి రాజ్యం భౌగోళికంగా అత్యంత పెద్దది. ఆర్థికంగా బలమైన రాజ్యం. ఇది గమనించిన బ్రిటిష్ పాలకులు నిజాం రాజులతో సయోధ్య చేసుకుని ఒక్కొక్క ప్రాంతాన్ని తమ పాలన కిందికి తెచ్చుకుని, నిజాం రాజులకు బిరుదులు ప్రసాదించారు. తర్వాతి కాలంలో నిజాం వారసులు వారి అసమర్థ, అసంబద్ధ నిర్ణయాలతో ఉత్తర సర్కారులను, దత్తమండలాలను కోల్పోయారు. అంతేకాకుండా 1857 మొదటి స్వాతంత్ర్య సమరం జరుగుతున్న సమయంలో దేశంలోని చాలా సంస్థానాలలో రాజులూ వలసవాద పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంటే, ఇక్కడున్నటువంటి నిజాం రాజులు మాత్రం బ్రిటిష్ వారికీ కొమ్ముకాసి విదేశీ పాలనను ప్రోత్సహించారు. బ్రిటిష్ వారికీ వ్యతిరేకంగా పోరాడిన తుర్రేబాజ్ ఖాన్‌ని చంపించి వేశారు. ఇక్కడి ప్రజల స్వాతంత్ర్యపు ఆకాంక్షలను ఆవిరి చేశారు. అప్పుడే ఇక్కడి ప్రజలలో స్వాతంత్ర్యం సాధించుకోవాలన్న ఆకాంక్షకు బీజం పడింది. బ్రిటిష్ నిర్ణయాలను అమలుపరిచిన నిజాంలు హైద్రాబాద్ రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసే పరిస్థితికి తెచ్చారు. మొదటి సాలార్‌జంగ్ తన అద్భుతమైన పాలనాపరమైన నిర్ణయాలతో ఆర్థికంగా బలోపేతం చేసి గట్టి పునాది వేశాడు. కానీ ఇతడు నాన్ ముల్కిలను ప్రోత్సహించి ఈ ప్రాంతంలోని ప్రజలకు అన్యాయం జరిగేలా చేశాడు. హైద్రాబాద్ సంస్థానాన్ని పాలించిన నిజాం రాజులూ ఈ ప్రాంతంలోని ప్రజల మనో భావాలకు అనుగుణంగా ఎప్పుడూ పరిపాలన కొనసాగించలేదు. ముఖ్యంగా 90శాతం ప్రజల మాతృభాషా తెలుగు అయినప్పటికీ ఉర్దూను అధికార భాష చేసి పరిపాలన కొనసాగించడం చూస్తేనే ఈ ప్రాంత ప్రజలకు ఎంత విలువ ఇచ్చాడో అర్థం అవుతోంది. ఏ నిజాం రాజు ఈ ప్రాంత అభివృద్ధికి కృషిచేయకున్నా వనరులు పుష్కలంగా ఉన్న ప్రాంతం




కనుక ఆర్థికంగా బలోపేతం అయ్యింది. ఇక్కడి ప్రజలు వారి రక్తాన్ని చెమట రూపంలో చిందిస్తే వచ్చిన ఆదాయాన్ని పన్ను రూపంలో వారి తాబేదార్లతో కట్టించి వెట్టి చాకిరీ చేయించి వారి కోసం రాజ సౌధాలను, భవంతులను వారి సుఖ సౌఖ్యాల కోసం కట్టించుకొని తులతూగారు. పైగా ఏ రోజు ప్రజాస్వామ్యయుతంగా పరిపాలన సాగించలేదు. భావ ప్రకటన స్వేచ్ఛను హరించారు. కానీ అప్పట్లో చదువుకున్న కొందరు మేధావులు మన సమస్యలను గుర్తించి 1901లో గ్రంథాలయ ఉద్యమం పేరుతో అక్షర జ్ఞానాన్ని ఇచ్చి ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించారు. ఆ తర్వాత 1930లో ఆంధ్రమహా సభ పేరుతో ప్రతి సంవత్సరం సమావేశాలు నిర్వహించి ఇక్కడ వున్న సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా కూడా ఇక్కడి ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. కొద్దికాలం తర్వాత ఆంధ్రమహాసభలో చీలిక వచ్చి అతివాద, మితవాద వర్గాలుగా ఏర్పడి నిజాం పరిపాలనపై సాయుధ పోరాటం చేయడం ఆరంభించారు. ఈ పోరాటం 1947ఆగస్టు 15 తర్వాత ఇంకా ఉధృతం చేసారు. కానీ కాశీంరిజ్వీ సహకారంతో అప్పటి 7వ నిజాం ప్రజల మాన ప్రాణాలను హరించాడు. నిరంకుశ, నియంతృత్వంగా పాలించాడు. 1947 ఆగస్టు 15 నుంచి 1948 సెప్టెంబర్ 17మధ్యకాలంలో ఇక్కడి ప్రజల స్వేచ్ఛను హరించాడు. షోయబుల్లాఖాన్ లాంటి, ఆర్యసమాజ్ నాయకుడు నరేందర్ లాంటి వాళ్లను దారుణంగా చంపించి వేశాడు. బైరంపల్లి, పరకాల, రేణికుంట, గుర్రంపల్లిలలో మరో జలియన్ వాలా బాగ్‌లను తపించేలా ప్రజలను పిట్టలను కాల్చినట్టు కాల్చివేశారు. ఊళ్లకు ఊళ్లను తగుల పెట్టి మహిళలను వివస్త్రలను చేసి బతుకమ్మ ఆడించి, అత్యాచారాలు చేశారు. ప్రాణాలను హరించివేశారు. ఇంకో వైపు పాకిస్థాన్‌తో సంప్రదింపులు జరుపుతూ యూఎన్ఓలో కూడా అప్పీల్ చేశాడు. చివరకు ఆనాటి హోంమంత్రిసర్దార్ వల్లాభాయ్ పటేల్ చొరవ కారణంగా 1948 సెప్టెంబర్ 17 విమోచనం పొంది. దేశంలో విలీనమైంది. ఇక్కడున్న కమ్యూనిస్టు నాయకులు రైతాంగ సాయుధ పోరాటం పేరుతో స్వాతంత్ర్యం సాధించుకోవాలని ప్రజలకు చెబుతూనే తెలంగాణ ఒక ప్రత్యేక దేశంగా కావాలని 1952 మొదటి సార్వత్రిక ఎన్నికల వరకు భారత ప్రభుత్వంపై పోరాడారు. కమ్యూనిస్టు నాయకులు వారి స్వార్థంకోసం 1956లో విశాలాంధ్ర పేరుతో ఆంధ్ర రాష్ట్రంలో తెలంగాణ కలపాలని చెప్పి ఇక్కడి ప్రజలకు తీరని అన్యాయం చేశారు. వీరి రాజకీయ చదరంగంలో అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పక్కరాష్ట్రం నుంచి అనేకమంది ఉపాధి గూర్చి ఇక్కడికి వలసలు వచ్చారు. ఇక్కడి విద్యార్థులు భూర్గుల రామకృష్ణరావు సర్కారుపై ముల్కి ఉద్యమం పేరుతో ఇక్కడి ప్రభుత్వాన్ని ముప్పు తిప్పలు పెట్టి తమడిమాండ్స్‌ను చాటి చెప్పారు. 1956లో పెద్దమనుషుల ఒప్పందం పేరుతో హైద్రాబాద్ రాష్ట్రంలో ఆంధ్ర రాష్ట్రం విలీనం అయింది. ఈ ఒప్పందం నీరుగారిపోయి 1969లో తొలిదశ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను ఢిల్లీ పాలకులకు వినిపించేలా చేసి, అనేకమంది విద్యార్థులు పోలీస్ తూటాలకు అమరులు అయ్యారు. ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటారు కానీ ఎన్నడూ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేదు. ఈ ప్రాంత రాజకీయ నాయకులు కొందరు వారి ఆత్మగౌరవాన్ని పక్క రాష్ట్ర పాలకులకు, ఢిల్లీ పాలకులకు తాకట్టుపెట్టారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి, నిరుద్యోగ యువకులు ఆత్మగౌరవ తెలంగాణ రాష్ట్ర కోసం పోరాటం చేసి 1200 మందికి పైగా ప్రాణత్యాగం చేసారు. రక్తం చిందించకుండా అహింసాయుత పద్ధతిలో విరామం లేకుండా ఉద్యమించి రాష్ట్ర సాధనలో సఫలీకృతులైనారు. కానీ మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఇక్కడి నాయకులు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. ఆత్మగౌరవం కోసం ప్రాణాలు అర్పించిన చాకలి ఐలమ్మ, దొడ్డి కొము రయ్య, కొమరం భీమ్ వారసత్వాన్ని ముందు తరాలకు ఇవ్వాల్సిన బాధ్యత గుర్తెరగాలి. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం చరిత్రను గుర్తెరిగి విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి. లేదంటే అమరుల త్యాగాలకు అర్థంలేకుండా పోతుంది. వారి ఆకాంక్షలు ఆవిరి అవుతాయి. కేంద్ర ప్రభుత్వం కూడా ఎలాగయితే జమ్మూ కాశ్మీర్‌కి ఆర్టికల్ 370 తీసి నిజమైన స్వతంత్ర్యాన్ని అందించిందో అలాగే తెలంగాణ రాష్ట్రంలో విమోచన దినోత్సవం జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఇంకా తెలంగాణ విమోచన ఉద్యమ చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చిభవిష్యత్తు తరాలకు అందించాలి. తెలంగాణ అమరుల, స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను, వారి త్యాగాలకు గుర్తుగా మ్యూజియం ఏర్పాటు చేయాలి. శౌర్య భావన విడిచిన నాడు అమరుల కథలను మరిచిన నాడు మనుగడ లేదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విమోచన దినోత్సవాన్ని పల్లె పల్లెన జరపాలి. •

# ఉపాధి లేక వలసబాట పడుతున్న యువత

తరిగోపుల నారాయణస్వామి

భారతదేశం ప్రపంచంలో అత్యంత జనసంఖ్యగల దేశాలలో ఒకటిగా ఉంటుంది. ఈ దేశంలోని యువత శక్తి దేశాభివృద్ధికి ముఖ్యమైనదే. కానీ, ప్రస్తుతానికి నిరుద్యోగం దేశానికి ఒక పెద్ద సవాలు అయిపోయింది. ప్రతి సంవత్సరం లక్షల మంది యువత విద్యాభ్యాసం పూర్తిచేసి కూడా ఉపాధి అవకాశాలు లేకుండా నిరుద్యోగంగా ఉంటున్నారు. ఇది వ్యక్తిగత స్థాయిలో ఆర్థిక సమస్యలు కలిగించడమే కాకుండా, సామాజిక అసమతుల్యతను పెంచే కారణంగా మారుతోంది. ప్రపంచ బ్యాంక్ ప్రకారం, భారతదేశంలో ఉద్యోగాల వృద్ధిరేటు, జనాభా వృద్ధిరేటు మధ్య వ్యత్యాసం కారణంగా నిరుద్యోగ సమస్య అనేక ప్రాంతాల్లో తీవ్రంగా పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో మానవ శక్తి అవసరం తగ్గిపోవడం, ఆధునిక యంత్రాలతో వ్యవసాయ పనులు జరుగడం వల్ల నిరుద్యోగిత చాలా ఎక్కువగా కనిపిస్తోంది. ఇది యువతను వలసగా పట్టణ ప్రాంతాలకు తరలించడంలో ముఖ్యపాత్ర పోషిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. 2021లో విడుదలైన రాష్ట్ర ఆర్థిక నివేదిక ప్రకారం, విద్యార్థులైన యువతలో నిరుద్యోగ దరఖాస్తుల సంఖ్య లక్షలుగా నమోదైంది. పట్టణ ప్రాంతాల్లో యువత ప్రత్యేకంగా ఉద్యోగ అవకాశాలకోసం తీవ్ర పోటీ ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన ఉపాధిలేకపోవడం వలన యువత నగరాలకు వలసగా వెళ్లడం, అది పట్టణ దారిద్ర్యాన్ని మరింత పెంచుతోంది. ప్రభుత్వం అనేక పథకాలను రూపొందించి నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది. జాబ్‌కార్డులు, నౌకరీ మేళాలు, యువత



నైపుణ్య అభివృద్ధి శిక్షణలు వంటి పథకాలు ప్రారంభించారు. కొన్నిచోట్ల ఈపథకాలు కొంతవరకు ఫలితాలు ఇచ్చాయి. అయితే అవి మార్కెట్ అవసరాలకు పూర్తి అనుగుణంగా పనిచేయడం లేదు. అందువలన నిరుద్యోగిత పరిస్థితి మాత్రం సమగ్రంగా పరిష్కారం పొందలేదు. ప్రైవేట్ రంగంలో అధిక ఆధారపడే పరిస్థితి కూడా సమస్యను మరింత తీవ్రతరం చేసింది. ముఖ్యంగా మైక్రో, చిన్న, మధ్యతరగతి వ్యాపారాలు, సరైన మద్దతు లేకపోవడం వల్ల ఆర్థికంగా తీవ్ర నష్టాలలో ఉన్నాయి. దీనివల్ల ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. కొవిడ్19 మహమ్మారి కాలంలో ఎంఎస్ఎమ్ఇ రంగానికి జరిగిన ప్రభావం అంతటా ఉపాధికొరతను మరింత పెంచింది. ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగావకాశాలు పరిమితంగా ఉండటం మాత్రమేకాదు, నైపుణ్యలోపం కూడా ప్రధాన కారణంగా నిలిచింది. విద్యా వ్యవస్థ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా లేకపోవడం వల్ల, యువతకు అవసరమైన ప్రాక్టికల్ నైపుణ్యాలు, ఆధ్యాత్మిక శిక్షణలు అందడం లేదు. దీంతో ఉద్యోగ అవకాశాల కోసం యువత మరింత పోటీ పడవలసి వస్తున్నది. ఇటీవల ప్రభుత్వాలు ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడం, స్టార్టప్ మద్దతు పథకాలు అమలు చేయడం మొదలైనమార్గాల్లో ముందడుగు వేస్తున్నాయి. కానీ దీనిఅమలువ్యవస్థలో సమగ్రత లేకపోవడం, భౌతిక మౌలికవసతుల లోపం వంటివి ప్రధాన అవరోధాలుగా ఉన్నవి. అందుకే ప్రతి జిల్లాలో యువతకు అనుకూలంగా ఉండే శిక్షణాకేంద్రాలను ఏర్పాటు చేయడం అత్యవసరం. ఈసమస్యను సమర్థవంతంగా పరిష్కరించేందుకు సమగ్ర ప్రణాళికలు అవసరం. విద్యార్థులైన యువతకు మార్కెట్ ఆధారిత నైపుణ్యశిక్షణలు, ఉపాధి హామీపథకాలు, ఎంఎస్ఎమ్ఇ రంగానికి ప్రత్యేక మద్దతు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య సమన్వయమైన చర్యలుచేపట్టాలి. ఇవి నిరుద్యోగ సమస్యపై పరిష్కారం చూపగలుగుతాయి. •

# ఆదివాసీలు, లంబాడాల మధ్య వివాదానికి కారణం?

యం.అర్జున్

తెలంగాణలో ఆదివాసీ, గిరిజన తెగల మధ్య ముదురుతున్న వివాదం రాజకీయ, సామాజిక, చట్టపరమైన అంశాలను తెర మీదికి తీసుకువస్తున్నది. ఎస్టీ రిజర్వేషన్ కోటా హక్కులపై పలు ప్రశ్నలు లేవనెత్తుతోంది. గత దశాబ్దాలుగా గోండు, కోయ వంటి ప్రాథమిక ఆదివాసీ తెగలు, లంబాడీల (బంజారాలు)ను షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ) జాబితా నుండి తొలగించాలనే డిమాండ్ చేస్తున్నాయి. ఎస్టీ కోటా ద్వారా లభించే విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఎక్కువ శాతం లంబాడీలే లబ్ధి పొందుతున్నారని, దీనివల్ల నిజమైన ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఇటీవలి పరిణామాలు వీరి పోరాటాన్ని మరింత తీవ్రతరం చేశాయి. ఆదివాసీ తెగకు చెందిన ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు దాఖలు చేసిన పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ (పిల్)పై 2025 ఆగస్టు 29న సుప్రీంకోర్టు లంబాడీ, సుగాలీ, బంజారా సముదాయాల ఎస్టీ స్థితిని ప్రశ్నిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పులో లంబాడీల ఎస్టీ స్థితిని నిర్ధారించినప్పటికీ, ఆదివాసీలు అది రాజ్యాంగం342 అధికరణాన్ని ఉల్లంఘిస్తుందని వాదిస్తున్నారు. లంబాడీలు మొదటి నుండి తెలంగాణ ప్రాంతంలో ఆదివాసీలుగా గుర్తించబడలేదని, వారి చేర్పు వల్ల తమ రాజ్యాంగపరమైన హక్కుల్ని కోల్పోతున్నామని, ఆదివాసీలు వాపోతున్నారు. ఈ అంశం రాజ్యాంగ, చట్టపరమైన చర్చలకు దారితీసింది. ఎందుకంటే ఎస్టీలు 'ప్రైమిటివ్, 'వెనుకబడిన', 'ఒంటరి' తెగలుగా గుర్తించబడాలి. ఇటీవలే ఈ అంశంపై ఆదివాసీల తరుపున సుప్రీంకోర్ట్‌లో తెల్లం వెంకటరావు వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుగా నమోదైంది, ఈ విచారణలో ప్రధానంగా 1976 ఆంధ్రప్రదేశ్ ఎస్టీ ఆర్డర్ (ఏపీఎస్టీ ఆర్డర్) లో లంబాడీల చేర్పును ప్రశ్నించే అంశాలు చర్చకువస్తాయి. ఈ చట్టం 1950 జనవరి 26కు ముందు తెలంగాణలో స్థిరపడిన లంబాడీలకు మాత్రమే వర్తిస్తుందని, 1950 తర్వాత వలసల్ని చేర్చకూడదని నిబంధన ఉంది. కానీ లక్షలాది మంది ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చినవారు కూడా ఎస్టీ ప్రయోజనాలు పొందారని అభిప్రాయపడుతున్నారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. 'మహారాష్ట్రలో బీసీలు, రాజస్థాన్‌లో ఓసీలుగా ఉన్న లంబాడీ (బంజారా)లు ఇక్కడ ఎలా ఎస్టీలయ్యారు?' అని ఆదివాసీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ విచారణ ఫలితంగా వెలువడే తీర్పు ఎస్టీ జాబితాను



మార్చే అవకాశం ఉంటుందో లేదో కాలమే నిర్ణయిస్తుంది. చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే, 1976లో లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చడం జరిగింది. ఇది ఎమర్జెన్సీ కాలంలో ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం చేసిన చర్యగా ఆరోపణలు ఉన్నాయి. ఎమర్జెన్సీ అనంతరం జరిగిన ఎన్నికల్లో ఇందిరా గాంధీ మెదక్ ఎంపీ స్థానం నుండి పోటీ చేసి గెలిచారు. 1971 సెన్సస్ ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్టీజనాభా 16.58 లక్షలు (మొత్తం 4.35కోట్లలో 3.81శాతం) ఉండగా, 1976 చేర్పు తర్వాత 1981 సెన్సస్‌లో 31.76 లక్షలకు (5.35 కోట్లలో 5.93 శాతం) పెరిగింది. ఈ పెరుగుదలలో లంబాడీలు(బంజారాలు) 11-12లక్షల మంది ఉన్నారని అంచనా. 1971లో వారు బీసీ 'ఏ' గ్రూప్‌లో సంచార జాతులుగా ఉండగా, 1976 చేర్పు రాజకీయ ఒత్తిడి వల్ల జరిగిందన్న ఆరోపణలు లేకపోలేదు. లంబాడీలు( బంజారాలు) మొఘల్‌బ్రిటిష్ కాలంలో సంచార వ్యాపారులుగా, రాజస్థాన్ మహారాష్ట్ర నుండి వలసలువచ్చారు. వారి సంస్కృతి, భాష (లంబాడీ రాజస్థానీ మిశ్రమం) పట్టణీకరణకు అనుగుణంగా మారింది, కానీ నిజమైన ఆదివాసీలు (గోండీ, కోయి భాషలు)దట్టమైన అడవులు, కొండల్లో ఒంటరిగా జీవిస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో స్థిరపడిన లంబాడీల్ని అడవుల్లో నివసించే నిజమైన ఆదివాసీలతో కలపడం భావ్యం కాదని, ఇది ఎస్టీ గుర్తింపు స్ఫూర్తిని దెబ్బతీస్తుందని ఆదివాసీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈచేర్పువల్ల ఎస్టీకోటాలో లంబాడీలు(బంజారాలు) విద్యా సంస్థల్లో ఎక్కువ శాతంలో సీట్లు, ప్రభుత్వ ఉద్యోగాలు పొందుతున్నారు. మరోవైపు, ప్రాథమిక సదుపాయాలు లేకుండా ఆదివాసీలు జీవనం సాగిస్తున్నారని, గిరిజన సంక్షేమ నిధులతో పాటు రాజకీయ అవకాశాలు కూడా ఎక్కువగా లంబాడీలకే వెళ్తున్నాయని వీరి ప్రధాన ఆరోపణ. 2024 ఆగస్టు 1న సుప్రీంకోర్టు 6:1 మెజారిటీ తీర్పుతో ఎస్టీలో సబ్‌క్లాసిఫికేషన్‌ను చట్టబద్ధం చేసింది. రాష్ట్రాలు అతి వెనుకబడిన తెగలకు ప్రాధాన్యత ఇవ్వవచ్చని చెప్పింది. ఈ తీర్పును తెలంగాణ ఆదివాసీలు స్వాగతించారు. కానీ అమలు జరగలేదు. తెంగాణ షెడ్యూల్డ్ కులాల (రేషనలైజేషన్ ఆఫ్ రిజర్వేషన్స్) యాక్ట్, 2025 ప్రకారం, 59ఎస్సీ సబ్‌కులాలను మూడు గ్రూపులుగా విభజించారు. మొత్తం 15ఎస్సీ కోటాను ఈ విధంగా విభజించడంవల్ల అతి వెనుకబడిన ఆయావర్గాలకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వం చెబుతోంది. కానీ ఎస్టీలకు ఇలాంటి వర్గీకరణ ఇంకా జరగలేదు. ఆదివాసీ సంఘాలు లంబాడీల్ని ఎస్టీ జాబితా నుండి తొలగించాలి లేదా 'ఎస్సీలకు చేసినట్టు ఎస్టీల్లో కూడా సబ్‌క్లాసిఫికేషన్ చేయాలి. అందులో నిజమైన ఆదివాసీలకు ఎక్కువ శాతం రిజర్వేషన్ కల్పించాలి' అని డిమాండ్ చేస్తున్నాయి. రాజకీయంగా, ఈ వివాదంఆదివాసీ, గిరిజన తెగలతోపాటు పార్టీల మధ్య ఘర్షణకు కారణమవుతోంది. ఈ పోరాటం కేవలం రిజర్వేషన్ కోసం మాత్రమే కాదు, సామాజిక న్యాయం, సాంస్కృతిక రక్షణకోసం. ప్రభుత్వాలు ఆలస్యం చేయకుండా తగు చర్యలు తీసుకోవాలి. •

# విజయవాడ వార్త



## ఏపి ఎడ్‌సెట్ షెడ్యూల్‌లో స్వల్పమార్పులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,సెప్టెంబరు16, ప్రభాతవార్త: బియిడి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపి ఎడ్‌సెట్-2025 ప్రవేశాల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసినట్లు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఏవిఎస్ స్వామి మంగళవారం తెలిపారు. ఈనెల 17వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ద్వారా కళాశాలల ఎంపిక చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అలాగే వాటిల్లో మార్పులు చేసుకునేందుకు 18వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఈనెల 20వ తేదీన అభ్యర్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుందని వెల్లడించారు. 22వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని స్పష్టం

## ఏఎన్‌యులో ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ పరేడ్ ఎంపికలు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,సెప్టెంబరు16, ప్రభాతవార్త: వర్సిటీలో వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ పరేడ్ ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికల్లో పరుగు, మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక కళలు, అభివక్తి నైపుణ్యాలు వంటి అంశాలు పరిశీలించారు. వీటి ద్వారా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ప్రీ ఆర్‌డి క్యాంపుకు ఎంపిక చేస్తామని వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ వి.దివ్యతేజోమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వాలంటీర్లను ఉద్దేశించి వీసి గంగాధరరావు మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యతో పాటు సామాజిక సేవ చేయాలనే లక్ష్యాలను అవగాహన చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి ప్రొఫెసర్ యం.సుధాకర్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్‌లో ప్రవేశించిన వాలంటీర్లకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఓఎస్‌డి ఆచార్య రవికుమార్, యూత్ అసిస్టెంట్ సంజయ్, ప్రోగ్రాం అధికారులు ప్రొఫెసర్ కె.వి.నిరుపమ, డా.శ్రీనివాసరావు, డా.యం.దాసు, ఆర్.శ్రీనివాసులు, అశోక్, డా.జె.వి.సుధీర్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ కె.కోటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ అధికారులు, 165మంది వాలంటీర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వేతనాలు పెంచాలని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల విన్నపం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,సెప్టెంబరు16, ప్రభాతవార్త: వర్సిటీలోని ఇంజనీరింగ్, ఫార్మశీ కళాశాలల్లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులు వేతనాలు పెంచాలని కోరుతూ మంగళవారం ఇన్‌చార్జ్ వీసి ఆచార్య కె.గంగాధరరావును కలిసి విన్నవించారు. సుమారు 50మంది వరకు అధ్యాపకులు వీసితో మాట్లాడారు. తమకు వేతనాలు పెంచాలని రెండు నెలలుగా కోరుతున్నామన్నారు. వేతనాల పెంపుపై వేసిన కమిటీ నివేదిక ఇవ్వకపోవడంతో వేతనాల పెంపు ఆలస్యమౌతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల పెంపు అంశం కమిటీ పరిశీలనలో ఉందని కమిటీ సభ్యులతో మాట్లాడి నివేదిక కోరతామని వీసి గంగాధరరావు అధ్యాపకులకు సూచించారు.

## ఉన్నత విద్యామండలి వైస్-చైర్మన్‌గా రెక్టార్ నియామకం - ముందే చెప్పిన వార్త

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,సెప్టెంబరు16, ప్రభాతవార్త: రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్-చైర్మన్-2గా ఏఎన్‌యు తాత్కాలిక రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. రత్నషీలామణి 3ఏళ్ళపాటు ఆ పదవిలో కొనసాగుతారు. కాగా వైస్-చైర్మన్‌గా రెక్టార్ నియమితులుకానున్నారని ముందే అంచనా వేసిన ప్రభాతవార్త ఈనెల 8వ తేదీన ప్రత్యేక కథనం రాసింది. రత్నషీలామణి 2024 జూలై నుంచి తాత్కాలిక రెక్టార్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

## ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా: నసీర్

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 16,ప్రభాతవార్త : నగరంలో అందరూ సమన్వయంతో పనిచేస్తే సమస్యలు దూరమవుతామని తూర్పు ఎమ్మెల్యే,అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు.భారీ వర్షాలకు తూర్పు నియోజకవర్గంలో నీటి నిల్వాలున్న ప్రాంతాల్లో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు.ఆయా



ప్రాంతవాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకు న్నారు.భారీ వర్షాలకు నీట మునిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామ న్నారు. ప్రధానంగా అమరావతి రోడ్డు వైపు నుంచి శారదాకాలనీ, బుచ్చయ్యతోట మీదుగా బొంగరాలబీడు ప్రాంతానికి వర్షపు నీరు వస్తుందని,దీంతో ఈ ప్రాంతం మునిగిపోతుందని చెప్పారు.సమస్య పరిష్కారానికి రైల్వే,మున్సిపల్ అధికారులతో చర్చలు నిర్వహించామన్నారు.రెండురోజుల్లో రైల్వే అధికారుల బృందం పర్యటిస్తుందన్నారు.వెంట్‌ను అభివృద్ధి చేయడం ద్వారా ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపబోతున్నామని వెల్లడించారు.మున్సిపల్ అధికారులు ప్రతి ప్రాంతాన్ని పరిశీలించి మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు.నీటి నిల్వలున్న చోట వెంటనే తీయించే ఏర్పాట్లు చేయాలని సూచించారు.నగరంలో ప్రతి ప్రాంతం అభివృద్ధి చర్యలు తీసుకుంటున్నామని,ప్రతి నిమిషం ప్రజలతోనే ఉంటున్నామన్నారు.

## సంగీత వినీలాకాశంలో ధృవతార ఎం.ఎస్.సుబ్బలక్ష్మి

గుంటూరు కల్చరల్,సెప్టెంబర్ 16,ప్రభాతవార్త : భారతీయ సంగీత వినీలాకాశంలో ఒక ధృవతారగా వెలిగిన సంగీతసామ్రాజ్ఞి ఎం.ఎస్.సుబ్బలక్ష్మి ని భారత జాతి మరిచిపోదని అవగాహన మనమూ



పాడుదాం రండి బృందం సభ్యులు ఘనంగా నివాళులర్పించారు.అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంగీత విద్వాంసుడు, గాయకుడు వి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు మాట్లాడుతూ సుబ్బలక్ష్మీ సంగీత ప్రపంచంలో అధిరోహించిన శిఖరాలు అనన్య సామాన్య మన్నారు.గాయని యార్లగడ్డ లక్ష్మి మాట్లాడుతూ సుబ్బలక్ష్మి మధురంగా గానం చేసిన సుప్రభాతాలు మన ఇలవేల్పులైన శివకేశవులకు మేలుకొలుపు లయ్యాయన్నారు విశ్రాంత ఇంజనీర్ ఘనశ్యామాచార్యులు,గాయని రాజేశ్వరి,సుబ్బలక్ష్మికి ఘనంగా నివాళులర్పించారు.

## చీమలు, ఈగలు నిరోధంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గుంటూరు విద్య, ప్రభాతవార్త: చీమలు ఈగలు వంటి క్రిమి కీటకాలను నిరోధించటం వలన గృహ వాతావరణంలో సంపూర్ణమైన ఆరోగ్యం సిద్ధిస్తుందని విప్రో అధికారులు పేర్కొన్నారు. విప్రో నుంచి మాక్స్‌క్లీన్ 2ఇన్1 ఫ్లోర్ క్లీనర్ విడుదల సందర్భంగా వారు మాట్లాడుతూ దీని ద్వారా రోజువారీ గృహ సంరక్షణకు తెలివైన, మరింత సమగ్రమైన విధానాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. చీమలు, ఈగలు వంటి కీటకాలను కూడా సమర్థవంతంగా తిప్పికొడుతుందని బిజినెస్ డెవలప్‌మెంట్ జీఎం ఉపాసిస్ సాహ తెలిపారు.

## కొల్లా వెంకయ్య వర్ధంతి సందర్భంగా ముగిసిన ఆటల పోటీలు

పెదనందిపాడు సెప్టెంబర్ 16,(ప్రభాతవార్త) కామ్రేడ్ కొల్లా వెంకయ్య 27వ వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు గత మూడు రోజుల నుండి జరుగుతున్న పోటీలు మంగళవారం తో ముగిశాయి. ఈరోజు విద్యార్థినీ, విద్యార్థులకు శ్రీ శ్రీ గేయాలు, డిబేట్ పోటీలు నిర్వహించడం జరిగిందని డాక్టర్ కొల్లా రాజమోహన్ రావు తెలియజేశారు. పోటీలలో గెలుపొందిన కాకుమాను ఎన్ జెడ్ పి హెచ్ ఎస్ స్కూలుకు చెందిన జి ప్రసన్న, అశోక్ హైస్కూల్ కి చెందిన ఏ హర్షిత, ఎన్ జడ్పీహెచ్ఎస్ కాకుమానుకు చెందిన బి శ్వేత లకు అభినందనలు తెలియజేశారు. రేపు బుధవారం కామ్రేడ్ కొల్లా



వెంకయ్య వర్ధంతి సందర్భంగా పాత బస్టాండ్ సెంటర్ లోని వెంకయ్య విగ్రహం వద్ద నివాళులు అర్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతు లను అందజేయటం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో వామపక్షవాదులు, కొల్లా వెంకయ్య అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆటల పోటీల నిర్వాహకులు రిటైర్డ్ ప్రొఫెసర్ ఆర్ సుబ్బారావు, రిటైర్డ్ హెచ్ఎం ఎం జవహర్ రాణి, కొల్లా వెంకయ్య చౌదరి, కొల్లా రామన్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూ బిబిబీ ఫిజియోథెరపీ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవం

విజయవాడ, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త: సోమవారం "అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవం" సందర్భంగా సిద్దార్థ మెడికల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో న్యూ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్(బిబిబీ) ఫిజియోథెరపీ విభాగ ఇన్‌ఛార్జ్ డా. కిరణ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపిస్టులకు క్రీడా పోటీలు జరిగాయి. అలాగే ఫిజియోథెరపి ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు క్విజ్ పోటీలు, సీనియర్ ఫిజియోథెరఫిస్టుల చేత అధునాతన ఫిజియోథెరపి వైద్యవిధానాలపై అవగాహన కల్పించడం జరిగింది. క్రీడలలో విజేతలకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. అనంతరం ఫిజియోథెరపీ దినోత్సవం కార్యక్రమం న్యూ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో వివిధ వైద్య విభాగ అధిపతులు, డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జుల సమక్షంలో జరిగింది. ఇందులో రోగులకు ఫిజియోథెరపి అవగాహన కార్యక్రమాన్ని డా. కిరణ్




నిర్వహించారు. ఫిజియోథెరపి విభాగాధిపతి డా.అనుపమ..గత ఏడాదిగా తమ విభాగంలో అమలైన సంస్కరణలను వివరించారు. పేరుకు ముందు డాక్టర్ పెట్టుకునే అర్హతను త్వరలోనే ఫిజియోథెరపిస్టులకు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఫిజియోథెరపిలో తాజాగా వచ్చిన సాంకేతికత అంశాలు, నూతన పరిశోధనలపై ఎప్పటికప్పుడు విస్తృత చర్చ జరగలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం..ప్రభుత్వ ఉద్యోగాలకు బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపి(తీశిగి)ని మాత్రమే విద్యార్హతగా ప్రకటించిందని, పారామెడికల్ విభాగం కింద ఉన్న ఫిజియోథెరపిని అలైడ్ హెల్త్ సైన్స్ క్రిందకు మార్చారన్నారు. అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని సమర్థవంతంగా నిర్వహించిన కిరణ్‌ను అభినందిస్తున్నామని అన్నారు. ఫిజియోథెరపి విభాగ ఇన్‌ఛార్జ్ కిరణ్ మాట్లాడుతూ..ప్రస్తుత జీవన విధానం కారణంగా యువత నుంచి వృద్ధుల వరకు ఎదుర్కొంటున్న సమస్యలను, ఆయా ఆరోగ్య సమస్యల నివారణలో ఫిజియోథెరపి కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఫిజియోథెరపి రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తమ నైపుణ్యాలను పెంచుకుంటున్నామన్నారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాల సహకారంతో రోగులకు అత్యుత్తమ సేవలను ఫిజియోథెరపి విభాగం అందిస్తోందన్నారు. ఆసుపత్రి సూపరెండెంట్ డా.తి.జు. రావు మాట్లాడుతూ..ఫిజియోథెరపి రంగ ప్రాముఖ్యత గణనీయంగా పెరుగుతోందన్నారు. న్యూరో సర్జరీ విభాగాధిపతి డా. శ్యాం బాబ్జీ..శస్త్రచికిత్స అనంతరం రోగి కోలుకోవడంలో ఫిజియోథెరపి కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈ రంగంలోని వైద్యులు ఎప్పటికప్పుడు నిపుణత పెంచుకోవాలన్నారు. ఆర్థో విభాగాధిపతి డా. ఏ.శ్రీనివాస్..సర్జన్‌కు, ఫిజియోథెరపిస్ట్‌కు సమానప్రాధాన్యత ఉందన్నారు. ప్రజలలో సైతం ఫిజియోథెరపిపై అవగాహన పెరిగిందన్నారు. దిళీ. శిలీవీ. డా. పద్మావతి..ఫిజియోథెరపి రంగంలో వైద్యులు, వైద్య విద్యార్థులు ఎప్పటికప్పుడు నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. జీరియాట్రిక్ ఫిజియోథెరపిస్ట్ డా.అవని..వృద్ధుల జీవితం లో క్వాలిటీ ఆఫ్ లైఫ్‌ను పెంపొందించడంలో ఫిజియోథెరపి కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఫిజియోథెరపిపై సమాజంలో విస్తృత అవగాహన పెరగాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రిలోని ఇతర వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## కుటుంబ రాజకీయాలతో బలంగా పాతుకుపోయిన భారత ప్రజాస్వామ్యం

గుంటూరు కల్చరల్,సెప్టెంబర్ 16,ప్రభాతవార్త : భారతదేశ ప్రజాస్వామ్యంలో కుటుంబ రాజకీయాలు బలంగా పాతుకుపోయాయని,జనం నెత్తిన వారసత్వాన్ని రుద్దే పరిస్థితి నేడుందని దేశవ్యాప్తంగా కొన్ని కుటుంబాల గుప్పిట్లో ప్రజాస్వామ్యం బందీగా మారిందని అవగాహన సంస్థ ఆద్వర్యంలో జరిగిన చర్చా కార్యక్రమంలోపాల్గొన్న మేధావులు,విశ్లేషకులు అభిప్రాయ పడ్డారు.సోమవారం సంస్థ కార్యాలయంలో కొన్ని కుటుంబాల ఆటగా మారిన భారత ప్రజాస్వామ్యం అంశంపై చర్చ జరిగింది.చర్చలో రాడికల్ హ్యూమనిస్ట్ నాయకుడు కె.చంద్రశేఖర్,విశ్లేషకులు వి.వి.రావ్ లు మాట్లాడుతూ వారసత్వ రాజకీయాలు ప్రజాస్వామ్యాన్ని రాచరిక వ్యవస్థగా మార్చుతున్నాయని ప్రధానపార్టీలు ప్రజాభిప్రాయాన్ని బేఖాతరు చేసి కుటుంబ వారసత్వానికే ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.చర్చలో విద్యావేత్త చంద్రయ్య,వాణిజ్యవేత్త బి.గుప్తా తదితరులు ప్రసంగించారు.

## ఎమ్మెల్యే గళ్ళా మాధవి కుటుంబంపై అసత్య ఆరోపణలు మానుకోవాలి : టిడిపి నేతలు

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 16,ప్రభాతవార్త : నగరాభివృద్ధి,ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అహర్నిశలు కృషి చేస్తున్నారని టిడిపి కార్పొరేటర్లు పేర్కొన్నారు.అయితే ఇటీవల కొంతమంది వ్యక్తులు ఎమ్మెల్యే భర్త గళ్ళా రామచంద్రరావు పై చేస్తున్న అసత్యప్రచారాన్ని వారు తీవ్రంగా ఖండించారు.మంగళవారం పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్,కొమ్మినేని కోటేశ్వరరావు,ఈరంటి వరప్రసాద్,మానుకొండ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రజల మన్ననలు పొందిన భ్రమరాటౌన్‌షిప్ సంస్థపై కబ్జా ఆరోపణలు చేయడం పూర్తిగా నిరాధారం,డాక్టర్ రాఘవశర్మకు చెందిన రూ.6కోట్ల భూమిని గళ్ళా రామచంద్రరావు కబ్జా చేశారన్న



కథనాలు అవాస్తవం వాస్తవానికి ఆ భూమి 1991నుంచి 2021మధ్య పలు దఫాలుగా కొనుగోలు,విక్రయాలు జరిగి,రియల్ ఎస్టేట్ వ్యాపార నిమిత్తం గళ్ళా రామచంద్రరావు,గళ్ళా మాధవి ఎమ్మెల్యే కావడానికి ముందే ముగ్గురితో కలసి పున్నారావు అనే వ్యక్తి వద్ద నుండి చట్టబద్దంగా కొనుగోలు చేశారు.ఆ భూమికి సంబందించి డాక్టర్ రాఘవశర్మ పేరుతో ఎలాంటి డాక్యుమెంట్లు లేవు అని స్పష్టం చేశారు.అదే సమయంలో వారు హెచ్చరిస్తూ ఎవరికైనా ఆధారాలు ఉంటే సంబంధిత అధికారుల ముందు రుజువు చేయాలి,కానీ ఆధారాలు లేకుండా పుకార్లు పుట్టించడం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు మాత్రమే ఇప్పటివరకు డాక్టర్ రాఘవశర్మ ఎలాంటి ఫిర్యాదు చేయలేదు.అయినప్పటికీ ఒక మీడియా సంస్థ నిజ నిర్ధారణ చేయకుండానే తప్పుడు వార్తలుప్రసారం చేయడం బాధాకరం అన్నారు.కార్పొరేటర్ వేముల పల్లి శ్రీరామ్ ప్రసాద్ మాట్లాడతూ గతంలో కూడా నాపై ఇలాంటి నిరాధార ఆరోపణలు చేశారు.వాటిని ఆధారాలతో తిప్పికొట్టాను, ఇప్పుడు అదే తరహాలో ఎమ్మెల్యే మాధవి పై అసత్య ప్రచారం చేస్తున్నారు.ఇది పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమే జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.అదే విధంగా కార్పొరేటర్లు మానం పద్మ శ్రీ,దామచర్ల శ్రీనివాసరావు,గుర్రం ప్రసాద్,ముప్పా వేణుబాబులు మాట్లాడుతూ బిసి బిడ్డ గళ్ళా మాధవి ప్రజల ఆశీర్వాదంతో గెలవడం కొందరికి జీర్ణించుకోవడం లేదు.అందుకే విషప్రచారం చేస్తున్నారు.గుంటూరు నగరాభివృద్ధి దిశగా వేగంగా పయనిస్తున్న తరుణంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే మాధవి ని ఇలాంటి తప్పుడు ప్రచారం ఆపలేవు,వారు చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మరని,పేద బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచే పార్టీ టిడిపి ఎమ్మెల్యేపై ఇలాంటి ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు.

## అబ్ కుచ్ సినిమాటిక్ కర్తేహై శీర్షికతో సోని ఇండియా సరికొత్త ప్రచారం

విజయవాడ, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :అబ్ కుచ్ సినిమాటిక్ కర్తేహై శీర్షికతో సోని ఇండియా సరికొత్త ప్రచారం ప్రారంభించిందని సంస్థ బిజినెస్ హెడ్ ముఖేష్ శ్రీవాస్తవ తెలిపారు. భారతీయ వివాహాలకు సంబంధించి నిశ్శబ్ద హీరోలకు నివాళి ఇదన్నారు. భారతదేశంలో తరతరాలుగా ప్రేమకథలను అందంగా ఒడిసి పట్టిన స్థానిక ఫోటో, వీడియో స్టూడియోలు దశాబ్దాలుగా భారతదేశంలోని చిన్న పట్టణాల్లో వివాహ వీడియోగ్రఫీని అదే చేతులతో రూపొందించారు.

## మార్కెట్లోకి రాయల్‌స్టాగ్ బారెల్ సెలక్ట్ ప్రీమియర్

విజయవాడ, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త : ఫెర్నాడో రికార్డ్ ఇండియా తమ కొత్త ఉత్పత్తి రాయల్‌స్టాగ్ బారెల్ సెలక్ట్ ప్రీమియర్ విస్కి ప్రారంభోత్సవాన్ని సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. ఇది శ్రేణిలోనే మొదటిసారి ప్రీమియం క్లియర్ ఆన్‌క్లియర్ లేబుల్‌తో సొగసుతో పాటు ప్రామాణికతను సూచిస్తుంది.

## పాడైపోయిన ఫెన్సింగ్‌కు త్వరగా మరమ్మతులు చేపట్టండి : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,సెప్టెంబరు 16,ప్రభాతవార్త: కెనాల్ రోడ్ వద్ద పాడైపోయిన ఫెన్సింగ్‌ను గమనించి త్వరగా మరమ్మత్తులు చేపట్టాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కెనాల్ రోడ్,వినాయకుని గుడి,ఒన్‌టౌన్ ప్రాంతాలలో పర్యటించి దసరా శరన్నవరాత్రుల వేడుకల ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వచ్చే



అమ్మవారి భక్తులకు ఎటువంటి లోపం ఉండరాదని, నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన వసతులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులకు త్రాగునీటి సౌకర్యం ఏ పాయింట్ల వద్ద కల్పిస్తున్నారు,క్యూలైన్ల వద్ద సౌకర్యాలు,పారిశుధ్య నిర్వహణ,ఉచిత చెప్పుల స్టాండ్,మరుగుదొడ్ల పాయింట్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కెనాల్ రోడ్ల వద్ద పాడైపోయిన ఫెన్సింగ్‌ను గమనించి త్వరగా మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి,చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అర్జునరావు,ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.శ్రీనివాస్,అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ,సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్-30 విస్తరణ కలెక్టర్లలో సిఎం సదస్సులో వినగడప కట్టలేరు బ్రిడ్జి ప్రస్తావన





ఎ కొండూరు, సెప్టెంబరు 16, ప్రభాతవార్త :అమరావతి సచివాలయంలో మంగలవారం సిఎం చంద్రబాబు నాయుడు ఫోర్త్ జిల్లా కలెక్టర్‌ల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం మండలం విడగడప కట్టలేరు వాగుపై ఉన్న బ్రిడ్జి ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీవర్షాలు వరదలకు సుమారు 5ఏళ్ల క్రితం కొట్టుకుపోవడం వల్ల ఆంధ్రా తెలంగాణ ప్రజల ప్రజాజీవనం స్థంభించి ఇబ్బందులు పడుతున్నారని, సిఎం దృష్టికి కలెక్టర్ తీసుకెళ్ళారు. అలాగే విజయవాడ తిరువూరు జాతీయ రహదారి-30పై మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో సుమారు 10 సంవత్సరాల నుండి నిలిచిపోయిన రహదారి విస్తరణ పనుల్లో జాప్యం వల్ల రహదారి అధ్వాన్నంగా తయారైందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సదస్సులో కలెక్టర్ లక్ష్మీశ సిఎం దృష్టికి తీసుకెళ్లడం పట్ల ఎ కొండూరు, గంపలగూడెం మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## హైవేపై వరదనీరు... ప్రజల పాట్లు

ఎ కొండూరు, సెప్టెంబరు 16, ప్రభాతవార్త :ఇబ్రహీంపట్నం మైలవరం తిరువూరు జాతీయ రహదారిపై ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు మెయిన్ సెంటర్‌లో తుఫాన్ వరదల వల్ల జాతీయ రహిదారిపై వరద నీరు ప్రవహిస్తుండటం వల్ల ప్రజలు ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ ఎన్‌హెచ్-30 జాతీయ రహదారి అధికారులు చీమలపాడులో



డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రతి ఏడాది వర్షాలకు హైవేపై నీరు నిలిచి అధ్వాన్నంగా తయారైంది. ఇదే రహదారిపై గంపలగూడెం వెళ్ళే రోడ్డుపై నీరు ప్రవహిస్తుండటం వల్ల ఈ క్రాసింగ్‌లో రహదారి ప్రమాదాలకు నెలవుగా మారింది. ఇకనైనా ఈ జాతీయ రహదారిపై డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటు చేసి వరద నీటి నివారణకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## పెద్దవరంలో పొలం పిలుస్తోంది

తిరువూరు, సెప్టెంబరు 16, ప్రభాతవార్త : మండలంలోని ఎర్రమాడు పెద్దవరం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి పి.పద్మ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఎర్రమాడు గ్రామంలో ప్రతి పంటను పరిశీలించి రసం పీల్చు పురుగుల నివారణ పద్దతులు తెలియచేయడమైనది.




పెద్దవరం గ్రామంలో రైతులకు నానో యూరియా ఉపయోగాలు తెలిపరచి, వరిలో నానో యూరియా డ్రోన్‌తో పిచికారి డెమో చూపించడం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ గద్దె అప్పారావు, గ్రామ పార్టీ అధ్యక్షులు గంధ్ర సత్యనారాయణ ఆర్ఎస్‌కె సిబ్బంది పి.విజయ్, రైతులు పాల్గొన్నారు.

## ఆశీర్వాద్ మసాలా నూతన టివిసిలో ప్రముఖ హీరో నాని

విజయవాడ, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :
నేచురల్ స్టార్ నాని నటించిన దమ్ము మీదే, స్టార్‌మీరే పేరుతో నూతన ప్రచార కార్యక్రమాన్ని ఐటిసి ఆశీర్వాద్ మసాలా ప్రారంభించిందని సంస్థ ప్రతినిథులు తెలిపారు. ఏపి, తెలంగాణ వాసుల జంట అభిరుచులు దమ్దార్ ఆహారం, సినిమాను వేడుక జరుపుతోన్న ఈ ప్రచారం గృహిణులకు లక్ష్యంగా ఐటిసి లిమిటెడ్ వద్ద స్పైసెస్, ఫుడ్స్ డివిజన్ బిజినెస్ హెడ్ పీయూష్ మిశ్రా అన్నారు. సూపర్‌స్టార్ గుర్తింపుతో వారి పాకశాస్త్ర ప్రావిణ్యాన్ని ప్రశంసిస్తుందని, పోటీలో విజేతలకు అసలైన సినిమా థియేటర్ ప్రకటనల్లో నానితో కలిసి కనిపిస్తారన్నారు.

## అమేజాన్ గ్రేటిండియన్ ఫెస్టివల్

విజయవాడ, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :
హోం, కిచెన్, అవుట్‌డోర్ శ్రేణులపై 80శాతం వరకు తగ్గింపుతో హీరో మోటోకార్ప్, ఫిలిప్స్, గోద్రేజ్ అండ్ ఇతర ప్రముఖుల బ్రాండ్స్‌పై ఉత్తేజభరితమైన డీల అమేజాన్ తెచ్చిందని సంస్థ ప్రతినిథులు తెలిపారు. సెప్టెంబర్ 23 నుండి ప్రారంభం అన్నారు. ప్రైం సభ్యులు 24గంటలు ముందుగా యాక్సెస్ చేసుకోవచ్చున్నారు. అవుట్‌డోర్ అండ్ లైఫ్ స్టయిల్, పవర్‌టూల్స్, క్లోనింగ్ సరఫరాలు, తోటపనికి అవసరమయ్యే ఉత్పత్తులు, కార్ సంరక్షణలపై 80శాతం వరకు తగ్గింపు, స్పోర్ట్స్, ఫిట్నెస్‌గేర్‌పై 70శాతం తగ్గింపు, పెట్రోల్, టూవీలర్‌పై, తదితరాలపై తగ్గింపులుంటాయన్నారు.

## తితిదేలో బ్రాహ్మలను క్రమబద్దీకరించాలి

విజయవాడ, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త : తితిదే లో లడ్డూ ప్రసాదాల తయారీలో పనిచేస్తున్న బ్రాహ్మలను క్రమబద్దీకరించాలని ధార్మిక పరివార్ జాతీయ అధ్యక్షుడు వివి రామారావు కోరారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 25ఏళ్ళుగా తితిదే లో పనిచేస్తున్న బ్రాహ్మలకు రెగ్యులర్ ఉద్యోగుల మాదిరి అందాల్సిన ప్రయోజనాలు కోల్పోతున్నారని వారిని వెంటనే క్రమబద్దీకరించాలని దేవదాయ శాఖ మంత్రికి వినతిపత్రం ఇస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపకుడు కుడు బాల శ్రీనివాస్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

## జగన్ ఫేక్ ప్రచారానికి కూటమి ప్రభుత్వం ఫ్యాక్ట్స్‌తో చెక్ పెడుతుంది : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబర్16, ప్రభాతవార్త: ప్రజలచే ఎన్నుకోబడినవారు, ప్రజా సమస్యలపై చట్టసభలలో గళం విప్పాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి తెలిపారు. జగన్ సహ ఆయన పార్టీ



ఎమ్మెల్యేలు సభలకు రాకుండా బయట ఉపన్యాసాలు ఇస్తూ పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. ఈనెల 18వ తేది నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలకు 11మంది వైసిపి సభ్యులు హజరై, రాష్ట్రంలోని సమస్యలపై తమకున్న చిత్తశుద్దిని నిరూపించుకోవాలని ప్రత్తిపాటి తెలిపారు. శాసనసభలో జగన్ లేవనెత్తే ఏ అంశంపైన అయినా చర్చించటానికి, వాస్తవాలు తెలియచేయటానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. వివేకా హత్య, మద్యం కుంభకోణం, మెడికల్ కాలేజీలు, సూపర్‌సిక్స్ సహ అన్నీ అంశాలపై స్పష్టత నివ్వడం కాక, 15నెలల సుపరిపాలనపై జగన్, వైసిపి చేస్తున్న ఫేక్ ప్రచారానికి, కూటమి ప్రభుత్వం ఫ్యాక్ట్స్‌తో చెక్ పెడుతుందని అన్నారు. జగన్‌ని గెలిపించిన పులివెందుల ప్రజలకు న్యాయం చేయటానికైనా ఆయన సభకు రావాలని అన్నారు. లేదా వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, తనకు 40శాతం ఓటర్ల మద్దతు ఉందనే జగన్, అసెంబ్లీకి దుమ్మా కొడుతూ కావాలనే వారిని అవమానిస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. సభలో అడుగుపెట్టి తాను పేపర్‌పులిని కాదని, సోషల్‌మీడియాకు పరిమితం కాబోనని జగన్ ప్రజలకు తెలియచేయాలని ప్రత్తిపాటి తెలిపారు. ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల వలన పటిష్టమైన ప్రజాస్వామ్యవ్యవస్దలో చట్ట సభలలో గొంతెత్తకుండా, మీడియా సమావేశాలకు మాత్రమే పరిమితమై ఉపన్యాసాలు ఇవ్వడాన్ని ప్రజలు ఎప్పటికి హర్షించరనే నిజాన్ని జగన్, వైసిపి ఎమ్మెల్యేలు గ్రహించాలని అన్నారు. ప్రజల పక్షాన అసెంబ్లీలో మాట్లాడని వారు ఆ ప్రజల సొమ్మును జీతంగా తీసుకోవడానికి ముమ్మాటికి అనర్హులని అన్నారు. ప్రజల ఇచ్చిన గెలుపుకావాలి, ఆ గెలుపుతో వచ్చే సకల సౌకర్యాలు అనుభవించాలి, కానీ గెలుపుకు కారకులైనవారికోసం మాత్రం తాము పనిచేయం, ప్రశ్నించం అనడం ఎంతవరకు న్యాయం వారే ఆలోచించుకోవాలని అన్నారు. ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా ప్రభుత్వం ఎలా ఇస్తుందనే ఆలోచన లేకుండా, దానికోసమే పట్టుపట్టడం జగన్ అజ్ఞానం అనుకోవాలి అని అన్నారు. గతంలో తాను తలుచుకుంటే చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా లేకుండా చేస్తానని జగన్ తాను అన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని అన్నారు. అలాంటి వారు నేడు అదే హోదా కోసం ఆ నాయకుడినే వేడుకోవడం ఏ దేవుడి రాసిన రాతో వారే చెప్పాలని ప్రత్తిపాటి అన్నారు.

## రాష్ట్ర రాజకీయాల్లో డాక్టర్ కోడెల చెరగని ముద్ర : ప్రత్తిపాటి



చిలకలూరిపేట, సెప్టెంబర్16, ప్రభాతవార్త: ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూపాయి డాక్టర్‌గా లక్షలాది పేద ప్రజలకు సేవలు అందించి, పల్నాడు కేంద్రంగా రాష్ట్ర రాజకీయాలలో చెరగని ముద్ర వేసుకున్న డాక్టర్ కోడెల శివప్రసాదరావు 6వ వర్ధంతి సందర్భంగా మాజీమంత్రి, స్దానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఘననివాళులు అర్పించారు. ఆరుసార్లు నరసరావుపేట, సత్తెనపల్లి శాసనసభ్యులుగా గెలిచి రాష్ట్ర హోంమంత్రిగా, రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రిగా, రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖా మంత్రిగా, ఆంధ్రప్రదేశ్ తొలి శాసనసభ స్పీకర్‌గా, పల్నాడు అభివృద్ధిలో ముందుండి నడిపిన నాయకుడిగా కోడెల శివప్రసాద్ నడిచారని ప్రత్తిపాటి తెలిపారు. రాష్ట్ర రాజకీయాలలో సంచలన నాయకుడిగా ఆయన పేరు గాంచారని అన్నారు. నరసరావుపేట నియోజకవర్గంతోపాటు జిల్లాలోని పలు నియోజకవర్గాలలో ఆయనకు బలమైన అనుచరగణం ఉన్నదని అన్నారు. ఆయా నియోజకవర్గాలలో శాసనసభకు సీట్లు కేటాయించేదానిలో ఆయన పాత్ర కూడా ఉండేదని ప్రత్తిపాటి ఈ సందర్భంగా వివరించారు.

## ఒయాసిస్ 19 సంవత్సరాల్లో రూ 7కోట్ల సేవాకార్యక్రమాలు అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ



చిలకలూరిపేట, సెప్టెంబర్16, ప్రభాతవార్త: పట్టణానికి చెందిన ప్రముఖ స్వచ్చంద సేవాసంస్ద ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ గడచిన 19 సంవత్సరాల కాలంలో రూ 7కోట్లతో అనేక సేవాకార్యక్రమాలు నిర్వహించిందని సంస్ద అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ తెలిపారు. ఒయాసిస్ సంస్ద 19 సంవత్సరాలు పూర్తిచేసుకొని 20వ సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంగా స్దానిక కెజె ఆసుపత్రి ఆవరణలో మహిళల ఉపాధి పథకాలు అనే అంశంపై జరిగిన కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒయాసిస్ చేస్తున్న సేవలను కొనియాడారు. సంస్దకు తమ వంతుగా సహాయ, సహకారాలు అందిస్తామని హామీఇచ్చారు. అనంతరం డాక్టర్ కందిమళ్ల జయమ్మ మాట్లాడుతూ ఒయాసిస్ శాశ్వత రూపకల్పనకు మురికిపూడి గ్రామంలో మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సహకారంతో ప్రభుత్వం ఇచ్చిన 3ఎకరాల స్దలంలో ఆశ్రమ నిర్మాణం చేపట్టామని అన్నారు. ఆశ్రమం పేరు తదితర అంశాలపై హాజరైన సభ్యులను అడిగి వారివారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లాను, వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావును, సీనియర్ పాత్రికేయులు మరియు ఏపి జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన దండా గోపిని ఒయాసిస్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ, సంస్ద సభ్యులు సత్కరించి అభినందించారు. అనంతరం గట్టా హేమకుమార్, జయమణిదీపక్, మున్సులూరి శివశంకర్, లక్ష్మీ సామాజ్యం ఆర్ధిక సహాయంతో శ్రీనివాసరావు అనే వ్యక్తికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ 10,000 మరియు పేద మహిళలకు రెండు కుట్టుమిషన్లు అందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కరణం విజయలక్ష్మి, డైరక్టర్లు కోలా విజయలక్ష్మి, డాక్టర్ ప్రఫుల్లాదేవి, లక్ష్మీరాజ్యం, మారెళ్ల ఇందిర, దండా విజయశ్రీ, తూబాటి నాగమల్లేశ్వరి, పి సంధ్య, నాగబైరు సుబ్బాయమ్మ, కందిమళ్ల నారాయణమూర్తి, సంస్ద సభ్యులు పాల్గొన్నారు.

## 10వ వార్డులో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ

చిలకలూరిపేట, సెప్టెంబర్16, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా క్యూఆర్ కోడ్‌తో ఉన్న స్మార్ట్ రేషన్ కార్డులను తయారు చేయించింది. వీటిని కార్డుదారులకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని పట్టణంలోని 10వ వార్డులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్‌యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లాలు పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ రేషన్‌కార్డులు క్యూఆర్ కోడ్‌తో అధునాతన సాంకేతికతను కలిగిఉన్నాయని, ఇవి పారదర్శకత మరియు సమర్థవంతమైన సేవలను అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని వారు వివరించారు. ఈ కార్డుల ద్వారా లబ్దిదారులకు సులభంగా రేషన్ సరుకులు అందుతాయని, అలాగే వ్యవస్థలో లోటుపాట్లను తగ్గించి, సేవలు మరింత వేగవంతం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ షేక్ కరిముల్లా, టిడిపి నాయకులు ఎస్‌యం కమాల్‌భాష, షేక్ అబ్దుల్ రవూఫ్, షేక్ అజారుద్దీన్, షేక్ దరియావలి, షేక్ అబ్దుల్ మజీద్, తుపాకుల శ్రీనివాసరావు, షేక్ అమీర్‌బాషా, షేక్ కరిముల్లా, మజారుద్దీన్, అమరా రమాదేవి, అమరా మణికుమార్, షేక్ జానీ‌సైదా, సయ్యద్‌సిలాం, నాగూర్, షరీఫ్, షేక్ మస్తాన్‌వలి, బడేమియా, సాధిక్, కాలేషా, మున్నా, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



## సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి : రాష్ట్ర ఆర్థిక సంఘం కార్యదర్శి కోటేశ్వరరావు



చిలకలూరిపేట, సెప్టెంబర్16, ప్రభాతవార్త: డిఎస్సీ 2025 ద్వారా నియామకం అవుతున్న ఉపాధ్యాయులు విధులలో చేరకముందే సీనియర్ ఉపాధ్యాయులకు పాఠశాలలలో ఉన్న ఖాళీస్థానాలు చూపించి వారిని ఆ స్థానాలలో సర్దుబాటు చేసి, క్లస్టర్ వేకెన్సీలలో 2025 డిఎస్సీ ఉపాధ్యాయులను నియమించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం తరుపున ప్రభుత్వాన్ని రాష్ట్ర ఆర్థిక సంఘ కార్యదర్శి కె కోటేశ్వరరావు కోరుతున్నట్లు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీనియర్ ఉపాధ్యాయులు క్లస్టర్లలో ఉండి, జూనియర్ ఉపాధ్యాయులు పాఠశాలలలో ఉండటం జరుగుతుందని, దీనివలన సీనియర్ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లు 2025 మెగా డిఎస్సీలో ఎన్నికైన ఖాళీలను కూడా ఈ నియామకాలలో చేర్చి భర్తీ చేయాలని ఉపాధ్యాయ పాఠశాలలు ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ వివరాలను తీసుకొని పరిశీలించాలని కోరారు. చిలకలూరిపేట మున్సిపల్ పరిధిలో రెండు మున్సిపల్ హైస్కూల్స్ ఉన్నప్పటికీని క్లస్టర్ పాఠశాల లేకపోవడం వల్ల మున్సిపల్ పాఠశాలలలో ఏకోపాధ్యాయ పాఠశాలలు, మెటర్నిటీ వినియోగించుకున్న ఉపాధ్యాయుల స్థానాలలో ఉపాధ్యాయులు సర్దుబాటు చేయడం కష్టంగా ఉన్నందున పట్టణానికి ప్రత్యేకంగా క్లస్టర్ ఏర్పాటు చేయాలని యస్టియు తరుపున ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్టీయు డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేకల కోటేశ్వరరావు, వి జయప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై అధికారులు, సిబ్బందితో మున్సిపల్ కమీషనర్ సమావేశం

చిలకలూరిపేట, సెప్టెంబర్16, ప్రభాతవార్త: మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మంగళవారం సాయంత్రం ఆత్యవసరంగా పట్టణంలో పారిశుద్ధ్యం పై పారిశుధ్య అధికారులు, పారిశుధ్య సిబ్బంది, పారిశుధ్య కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకాల వర్షాల గురించి చర్చించారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పారిశుధ్య విభాగం వారు పనులు సకాలంలో చేయాలని తెలియచేశారు. గత కొద్ది కాలానుంచి వర్షాలు పడటంతో మురుగుకాలువలలో నీరు ఆగిపోయి, పారిశుధ్య విభాగం వారు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రజలు తమ ప్రాంతాలలో డ్రైనేజీల కారణంగా ఇబ్బంది పడుతున్నట్లయితే ఆ వివరాలను వెంటనే కమీషనర్‌కు తెలియపరిస్తే దానిని పరిష్కరిస్తామని తెలియచేశారు.

## నాగార్జునకొండను సందర్శించిన ఆర్టీఐ కమిషనర్



విజయపురిసౌత్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండను రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ చావలి సునీల్ మంగళవారం సందర్శించారు. నాగార్జునకొండలోని మ్యూజియంలో ఉన్న బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, బుద్ధుని తొమ్మిది అడుగుల పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధశాల, స్నానాలగట్టు, బోధివృక్షాన్ని సందర్శించారు. అనంతరం సాగర్‌డ్యాంను తిలకించారు. ఆయన వెంట సివిల్ సప్లయి డీటీ బాషా, డిప్యూటీ తహశీల్దారు వాణి, ఆర్ఐ అనిల్‌కుమార్, వీఆర్వో రవికుమార్ తదితరులు ఉన్నారు.

## ఏపీఆర్‌డీసీ విద్యార్థుల విజయాలు అభినందనీయం: ఎమ్మెల్యే జూలకంటి

విజయపురిసౌత్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: ఏపీఆర్‌డీసీ విద్యార్థుల విజయాలు అభినందనీయమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. క్రీడల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం కలిసి ఆయన అభినందించారు. జులై నెలలో



నేపాల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్‌లో ఎన్.హరికృష్ణ లాంగ్‌జంప్‌లో గోల్డ్‌మెడల్, జె.నాగరవీంద్ర 200 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకం, ఎన్.అంజినాయక్ 100 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకం సాధించారు. అలాగే నంద్యాలలో జరిగిన ఇంటర్ జోనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భరత్‌రెడ్డి బంగారు పతకాన్ని, ఎస్‌కే నజీర్ వెండి పతకాన్ని సాధించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణిస్తున్న ఏపీఆర్‌డీసీ విద్యార్థుల ప్రతిభను ఎమ్మెల్యే అభినందించారు. క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వ ప్రోత్సాహం తప్పకుండా ఉంటుందన్నారు. ప్రతీరోజూ ఆటలకు సమయం కేటాయించడం వల్ల ఇలాంటి విజయాలు సాధ్యమన్నారు. క్రీడాకారులకు, క్రీడలకు తనవంతు సహకారం పూర్తిగా ఉంటుందన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి వద్దకు ఈ విద్యార్థులను తీసుకెళతానని, కళాశాల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నయీంభాను, అసిస్టెంట్ ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, సీనియర్ ఫ్యాకల్టీ వెంకట్రామిరెడ్డి, నాగరాజు, ఎస్‌కే మహమ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## యేళ్లు గడుస్తున్నా బోర్డుకు నోచుకోని సచివాలయం



గురజాల, సెప్టెంబరు 16 ప్రభాతవార్తః ఈ ఫోటో చూశారుగా.. నివాస గృహంగా ఉంది కదూ.. అవును మీరు చూసింది నిజమే.. అయితే ఈ గృహంలో గ్రామ సచివాలయం కొనసాగుతోంది. గురజాల నగర పంచాయతీ పరిధిలోని చిన్న మసీదు వద్ద నివాస గృహం క్రింది భాగంలో 4వ సచివాలయం ఏర్పాటు చేశారు. యేళ్లు గడిచినా కార్యాలయం బోర్డుకు నోచుకోలేదు. అయితే ప్రజలు అలాగే కాలం వెళ్లబుచ్చుతున్నారు. మరి అధికారులకు కార్యాలయం బోర్డు చేయలేదని తెలుసునో లేదో మరి.. ఇకనైనా అధికారులు సచివాలయాన్ని పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## నేడు గురజాలకు ఎమ్మెల్యే యరపతినేని రాక



గురజాల, సెప్టెంబరు 16 ప్రభాతవార్తః పట్టణంలోని చల్లగుండ్ల గార్డెన్స్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విచ్చేయనున్నట్లు గురజాల నగర పంచాయతీ కమిషనర్ వైవీఎల్ శివన్నారాయణ మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరగనుందన్నారు. మండల పరిధిలోని ప్రజలు పాల్గొని తమ సమస్యలను అర్జీల రూపంలో అందించాలని కోరారు.

## క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డుతో బహుళ ప్రయోజనం



నిజాంపట్నం, సెప్టెంబరు 16, ప్రభాతవార్తః క్యూఆర్‌కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డువల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని రేపల్లె ఆర్‌డిఓ రామలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్లోని చౌకధరల దుకాణంలో ఆమె మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్‌తో కలిసి కార్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డుతో రాష్ట్రంలోఎక్కడైనా ప్రభుత్వం అందించే రేషన్ సరుకులు తీసుకోవచ్చని తెలిపారు. మీరు ఎక్కడ రేషన్ తీసుకున్నా రేషన్ తీసుకున్నట్లు తమకు వెంటనే సమాచారం వస్తుందన్నారు. క్యూఆర్ కోడ్ ఉండటం వల్ల దానిని ఓపెన్ చేయటం వల్ల మీ కుటుంబ వివరాలు వస్తాయన్నారు. స్మార్ట్ రైస్ కార్డులో మీ కుటుంబ వివరాలలో ఏదైనా తప్పులు ఉంటే అక్టోబరు 31 లోగా సరిచేయించుకోవచ్చని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, జడ్‌పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య, అగ్నికుల క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ, జనసేన నాయకులు, తెదెపా కార్యకర్తలు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన తమిళనాడు బృందం

కొల్లిపర, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: తమిళనాడు రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్ కు చెందిన బృందం ఆంధ్రప్రదేశ్‌లో మూడు రోజులు పర్యటనలో భాగంగా రైతు సాధికారిత సంస్థ అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించింది. తమిళనాడులో కూడా ఈ అనుభవాన్ని



ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో మంగళవారం గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అన్నవరం, బొమ్మువానిపాలెం, తూములూరు గ్రామాల్లో తమిళనాడు రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్‌కు చెందిన బృందం పర్యటించి ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న న్యూట్రీ గార్డెన్లు, కిచెన్ గార్డెన్లు కూరగాయల పంటలను పరిశీలించారు. బృందం ఆరోగ్య పోషణ ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్, రైతులు స్వయం సహాయక బృందాల మహిళలను కలసి పంటల ఎంపిక, తోటల పరిణామం, నేల సిద్దం, కీటకాలు వ్యాధులు నియంత్రణ వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. రసాయన రహిత కూరగాయల ప్రాధాన్యం, గ్రామ స్థాయిలో న్యూట్రీ గార్డెన్లు ఏర్పాటు చేయటం వల్ల వచ్చే ఆహార పోషక భద్రత గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నేషనల్ రిసోర్స్ ఆర్గనైజేషన్ థిమాటిక్ లీడ్స్ అయినాల కృష్ణారావు, అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## స్వస్థ్‌నారీ సశక్తి పరివార్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి


కొల్లిపర, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: స్వస్థ్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేహ



మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆషా కార్యకర్తలు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. ఈ నెల 17 వ తేదీన మున్నంగి, వల్లభాపురం ఆయుస్మాన్ ఆరోగ్యమందిర్‌లో, 18 న తూములూరు, 19 న చివలూరు, శిరిపురం, 20 వ తేదీన దంతలూరు ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్‌లో, 22 న బొమ్మువానిపాలెం, 23 న అన్నవరం ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్‌లో, 24 న దావులూరు ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్‌లో, 25 న కొల్లిపర-3 ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్‌లో26 న వల్లభాపురం ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్‌లో, 27 న కొల్లిపర-1, 28 వ తేదీన, 29 వ తేదీన కొల్లిపర-2 ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్‌లలో, 30 న పిడపర్రు ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్‌లో స్వస్థ్ నారీ..సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో తహశీల్ధార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త రేషన్‌కార్డుల కొరకు వచ్చిన ప్రతి ధరఖాస్తును పరిశీలించాలి

కొల్లినపర, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: కొత్త రేషన్‌కార్డుల కొరకు పెట్టుకున్న ప్రతి ధరఖాస్తును పరిశీలించాలని తహశీల్ధార్ సిద్ధార్థ అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్ధార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేహ మాట్లాడుతూ గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రతి ధరఖాస్తును పరిశీలించాలన్నారు. మండల గ్రామాల ప్రజల నుండి ఎటువంటి సమస్యలు రాకుండా చూచుకోవాలన్నారు. వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లు ప్రజలకు అందుబాటులో ఉండి వారి ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. సమావేశంలో డిప్యూటి తహశీల్ధార్ రాజేష్, మండల సర్వేయర్ హరికృష్ణ, ఆర్ఐ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## నాదెండ్ల మండలంలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



నాదెండ్ల, సెప్టెంబర్16, ప్రభాతవార్త: మండలంలో పలుచోట్ల ప్రభుత్వం నూతనంగా తయారుచేసిన స్మార్ట్ రేషన్ కార్డులను మండల అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. తహసిల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసిల్దార్ షేక్ సల్మాన్, యంపిడిఓ స్వరూపరాణి, ఆర్ఐ సంతోషకుమారి, నాదెండ్ల సొసైటీ అధ్యక్షులు నల్లమోతు హరిబాబు, గ్రామ సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి తదితరులు పంపిణీ చేశారు. అదేవిధంగా సాతులూరు గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ కార్డులను ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఆదేశాల మేరకు పంపిణీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామంలో రాష్ట్ర తెలుగురైతు కార్యదర్శి గుర్రం నాగపూర్ణచంద్రరావు, గ్రామ సర్పంచ్ కామినేని లలితా నాగేశ్వరరావు, రేషన్ డీలర్ పూనాటి శ్రీదేవి, గుర్రం రామారావు, పూనాటి రంగారావులు పంపిణీ చేశారు.

## ఆర్టీసి డిపో వద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్ జెండాను ఆవిష్కరించిన యూనియన్ నాయకులు



చిలకలూరిపేట, సెప్టెంబర్16, ప్రభాతవార్త: పట్టణంలోని ఆర్టీసి డిపో ఎదుట ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యూనియన్ జెండాను ఆవిష్కరించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు విజి నాయక్, కరణం వెంకటశివ, సిఐటియు మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎంపి లావు'కు రైతుల ఫిర్యాదు



చిలకలూరిపేట, సెప్టెంబర్16, ప్రభాతవార్త: ఒడరేవు-పిడుగురాళ్ల రహదారికోసం బొప్పూడి, పసుమర్రు గ్రామానికి చెందిన రైతుల వద్దనుంచి ప్రభుత్వం భూములు తీసుకుంది. కానీ ఆ భూములకు నష్టపరిహారం చెల్లించకుండానే రహదారి నిర్మాణాన్ని కొనసాగిస్తుంది. రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో సంబందిత అధికారులు సరైన సమాధానం చెప్పకపోవడంతో గత 15 రోజులుగా జాతీయ రహదారిపై రెండు గ్రామాలకు చెందిన రైతులు, ప్రజాప్రతినిధులు రాస్తారోకో నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కాగా ఈ విషయాన్ని నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలకు రైతు సంఘ నాయకులు గుంటు హరిబాబు, నవతరం పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం, రైతులు వెళ్లి విషయాన్ని వివరించారు. యంపి లావు వెంటనే జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫోన్‌చేసి వెంటనే సమస్యలను పరిష్కరించమని రైతులకు నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రైతులందరిని తన కార్యాలయానికి పిలిపించుకొని వారితో సంప్రదింపులు చేసి త్వరలో నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

## ఆదం షఫీకి పాన్‌ఇండియా ఐకాన్ 2025 ఉత్తమ అధ్యాపక పురస్కారం



చిలకలూరిపేటటౌన్, సెప్టెంబర్16, ప్రభాతవార్త: పట్టణానికి చెందిన మైస్ కంప్యూటర్ అధినేత ఎస్‌కె ఆదంషఫీ పాన్‌ఇండియా ఐకాన్ ఉత్తమ అధ్యాపక పురస్కారాన్ని అందుకున్నారు. సోమవారం గుంటూరు ఐసియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ అవార్డును నాసా శాస్త్రవేత్త సాయి చందు, బిజెపి రాష్ట్ర నాయకులు మాగంటి సుధాకర్, చలనచిత్ర కమేడియన్ డాక్టర్ భద్రం, ప్రవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అమర్‌నాద్, అనిల్ కుమార్ చేతులమీదుగా ఆయన అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికై ఆ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా గత 15 సంవత్సరాలుగా పట్టణంలో కంప్యూటర్ విద్యను భోదిస్తూ ఎంతో మందికి శిక్షణనిచ్చి విద్యార్దుల అభివృద్ధికి బాటలు వేసారు. ఈ సందర్భంగా ఆదంషఫీని ప్రవేట్ స్కూల్స్ ప్రెసిడెంట్ అమర్‌నాద్, అనిల్‌కుమార్ తదితరులు అభినందించారు.

## సౌత్‌జోన్ క్రీడల్లో సత్తాచాటిన ఆంధ్రప్రదేశ్ జట్లు




చిలకలూరిపేట, సెప్టెంబర్16, ప్రభాతవార్త: స్కూల్ స్పోర్ట్స్ అసోసియేషన్ తెలంగాణా వారి ఆధ్వర్యంలో ఈ నెల 13నుండి జరిగిన క్రీడా పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్లు పాల్గొని అండర్ 14 బాలికల విభాగంలో త్రోబాల్‌లో ప్రధమ బహుమతిని, అండర్17 బాలికల విభాగంలో త్రోబాల్‌లో ద్వితియ బహుమతిని, అండర్ 17,14 బాలుర జట్లు ద్వితియస్దానాన్ని గెలుచుకున్నట్లు స్కూల్ స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ గురునాధం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటుచేసిన అభినందన సభలో క్రీడాకారులను కల్పతరువు చిట్స్ డైరక్టర్ లంకా ఆదినారాయణ రెడ్డి, లంకా మహేష్‌రెడ్డి యల్లమందయ్యలు పాల్గొని క్రీడా కారులకు బహుమతులు అందించి అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సౌత్‌జోన్ చైర్మన్ పి ప్రవీణ్, సహాయ కార్యదర్శి బొంతా కృపారావు, వ్యాయామ ఉపాధ్యాయులు అన్నలదాసు సుధారాణి, అజిత, శ్యాం, ఫణీంద్ర, నవీన్ తదితరులు పాల్గొని అభినందనలు తెలియచేశారు.

## గణపవరం అయ్యప్పస్వామి దేవాలయంలో అన్నదానం

నాదెండ్ల, సెప్టెంబర్16, ప్రభాతవార్త: మండలంలోని గణపవరం గ్రామంలో మండలనేని వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సుబ్బారావుల ఆధ్వర్యంలో అయ్యప్పమాల ధరించిన స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్నారు. కాగా మంగళవారం ఈ అన్నదాన కార్యక్రమంలో స్దానిక బిజెపి నాయకులు పాల్గొని పూజా కార్యక్రమాల అనంతరం నిర్వహించిన అన్నదానాన్ని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల శివనాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి సింగరేసు పోలయ్య, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు నెల్లూరి ఈశ్వర రంజిత్, బిజెపి నాయకులు పులుగుజ్జు మహేష్, రావికింది రామకృష్ణ, కోమటి శ్రీనివాసులు ప్రారంభించారు.

## అంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ నాటక మహోత్సవం


యడ్లపాడు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త : 25వ భారత్ రంగ్ మహోత్సవ్ 2026 భారతదేశంలోని అతిపెద్ద అంతర్జాతీయ థియేటర్ ఫెస్టివల్ గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఫిబ్రవరి 6 నుండి 10వ తేది వరకు నిర్వహించుటకు భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నేషనల్



స్కూల్ అఫ్ డ్రామా, తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం వేదిక అధ్వర్యంలో జరుగుతున్నట్లు వేదిక అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. వేదిక సర్వ సభ్య సమావేశంలో అయన మాట్లాడుతూ ఇందులో జాతీయ మరియు అంతర్జాతీయ నాటకాలు 5రోజులపాటు 5నాటకాలు ప్రదర్శనలు ఉంటాయన్నారు. అంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ నాటక మహోత్సవంలో ఉభయ రాష్ట్రాల్లోని నాటక రంగ ప్రముఖులు, కళాకారులు, నాటక రంగ అభిమానులు ఈ ఉత్సవంలో పాల్గొనబోతున్నట్లు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 3గంటల నుంచి 6గంటల వరకు తెలుగు రాష్ట్రాల కళాకారుల వివిధ కళారూపాల ప్రదర్శనలు ఉంటాయని, రాష్ట్రంలోని అన్ని కళాపరిషత్‌ల నిర్వాహకులకు మరియు నాటక దర్శకులకు, నటులు, రచయితలతోపాటు తెలుగు రాష్ట్రాల నాటిక సమాజాల వారికి ప్రత్యేక అహ్వానాలు అందజేస్తామని తెలిపారు. అంతేకాక అనేక రంగాల్లో ప్రముఖులకు ప్రత్యేక అహ్వానం అందజేస్తామని, నాటక రంగంలో ప్రముఖులకు సత్కారం అందజేయాలని తలంపుతో ఉన్నట్లు వేదిక అధ్యక్షులు ముత్తవరపు సురేష్‌బాబు పేర్కొన్నారు. యడ్లపాడు వేదిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వేదిక కార్యవర్గ సభ్యులు పివి మల్లికార్జునరావు, జెవి మోహనరావు, యార్లగడ్డ బుచ్చయ్య చౌదరి, పోపూరి నాగేశ్వరరావు, కట్టా శ్రీహరి, నడిమిపల్లి సుందరయ్య, కళానిలయం యడ్లపాడు, కొండవీటి కళా పరిషత్ లింగారావుపాలెం, లావు వెంకటేశ్వర్లు, కల్లూరు నాగేశ్వరరావు, కళాపరషత్ వరగాని, శ్రీకారం రోటరీ కళాపరిషత్ మార్టూరు, ఎన్‌టిఆర్ కళాపరిషత్ అనంతపురం, గుంటూరు కళా పరషత్, కాసరనేని సదాశివరావు కళా పరిషత్ తక్కెళ్ళపాడు, నటరత్నా ఎన్‌టీఆర్ కళా పరిషత్ సాతులూరు, కళానికేతన్ వీరన్నపాలెం, ఎన్‌టిఆర్ కళా పరిషత్ వినుకొండ, పెద్ద కంచర్ల గ్రామీణ కళా పరిషత్ కార్యవర్గ సభ్యులు, ముఖ్య అతిధిగా నాగార్జున యూనివర్సిటీ అర్ట్స్ హెడ్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## భూమి ఆరోగ్యం, మనిషి ఆరోగ్యంతో సమానం

యడ్లపాడు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త : భూమి అరోగ్యాన్ని కాపాడితేనే పంటల అరోగ్యం, దాని ద్వారా మానవ అరోగ్యం కూడా మెరుగు పడుతుందని ప్రకృతి వ్యవసాయం పల్నాడు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె అమల కుమారి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో అమె పాల్గొని ప్రసంగించారు. రైతులు



తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, వాటి అధారంగా సాయిల్ హెల్త్ కార్డులు అందజేస్తామని, రసాయన ఎరువులు అధిక వాడకం వల్ల భూసారం దెబ్బతింటుందని, సమగ్ర పోషక యాజమాన్యం పాటించాలన్నారు. పిఎమ్‌డిఎస్ విత్తనాలు, జీవన ఎరువులు, జీవశిలీంద్రనాశిని, విఎఎమ్ అజోస్పిరిల్లం వాడడం ద్వారా భూమి సారం పెరుగుతుందని తెలిపారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీ విధానం మరియు వాటి ప్రయోజనాలను రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఏవో హరిప్రసదాద్ రైతులు పాల్గొన్నారు.

# కుక్క కాటుకు చిన్నారి బలి





పొన్నూరు, సెప్టెంబరు 16,ప్రభాతవార్త: ఇటీవల కాలంలో ఎక్కడ పడితే అక్కడ కుక్కల స్వైరవిహారం కనిపిస్తుంది....కుక్కలు కూడా ఎవరినీ వదిలిపెట్టకుండా...ఎవరి వెంట అంటే వారి వెంటపడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పాదచారులు, ద్విచక్రవాహన చోదకులతోపాటు కారుల్లో ప్రయాణించేవారి వెంట కూడా పడుతూ ఇబ్బందులు పాల్జేస్తున్నాయి. ఇటీవల కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. దానికి తోడు రోడ్ల వెంబడి ఎక్కడ పడితే అక్కడ మాంసం విక్రయాలు చేస్తుండడం....వారు అక్కడే పనికిరాని మాంసం ముద్దలు, ముక్కలు, చిన్నా చితక వదిలి వెళ్తుండడంతో వాటిని తింటున్న శునకాలు రాక్షసత్వంగా ప్రవర్తిస్తున్నాయి. కుక్కలను అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో మరీ వాటి సంఖ్య బాగా పెరిగిపోయింది. మండల పరిధిలోని వెల్లలూరు గ్రామానికి చెందిన తాడిశెట్టి కార్తీక్(5) వీధి కుక్కల దాడిలో బలైపోయాడు. గత నెల 22వ తేదీన కార్తీక్‌పై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. చుట్టు ప్రక్కలవారు కేకలు వేస్తూ కర్రలతో కుక్కలపై దాడి చేసి కార్తీక్‌ను కాపాడారు. కుక్కకాటుకు గురైన కార్తీక్‌ను తొలుత నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యం చేయించి మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తీసుకెళ్ళారు. అక్కడ చికిత్స పొందుతూ ఉన్న కార్తీక్‌ను ఇంకా మెరుగైన చికిత్స కోసం విజయవాడలోని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. చిన్నారి కార్తీక్ మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. తల్లిదండ్రులు, బంధువుల రోదనలతో గ్రామం శోకతప్త సంద్రంలో మునిగిపోయింది. అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, గతంలో కూడా అనేక మంది కుక్క కాటుకు గురైనట్లు గ్రామస్తులు చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని కుక్కల బెడద నుండి విముక్తి కలిగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**గ్రామాన్ని సందర్శించిన అధికారులు:**

చిన్నారి మృతి చెందిన వార్త విన్న అధికారులు మంగళవారం వెల్లలూరు గ్రామానికి వెళ్ళి చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించారు. సంఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకన్నారు. గ్రామంలో కుక్కలను పట్టుకొనేందుకు బుధవారం నుంచి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఇన్‌చార్జి ఎంపిడిఓ మల్లికార్జునరావు తెలిపారు. తొలుత వెల్లలూరు గ్రామంలోని కుక్కలన్నింటిని పట్టుకొని బాపట్లలో వాటికి కుటుంబ నియంత్రణకు సంబందించిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఆ తర్వాత మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా కుక్కలన్నింటిని పట్టుకోవడం జరుగుతుందన్నారు. చిన్నారి మృతికి సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు మల్లికార్జునరావు తెలిపారు. మల్లికార్జునరావు వెంట విఆర్వో, పంచాయితీ కార్యదర్శి తదితరులున్నారు.

## 22నుండి 107వ పుణ్య తిథి ఉత్సవాలు

పొన్నూరు, సెప్టెంబరు 16,ప్రభాతవార్త: పట్టణంలోని సాయినగర్‌లో వేంచేసియున్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు శ్రీ షిరిడి సాయిబాబా 107వ పుణ్య తిథి ఉత్సవాలు జరుగుతాయని శ్రీ షిరిడి సాయి సేవా మండలి ఛైర్మన్ సర్రాజు మధుసూధనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10గంటలకు సాయి సహస్రనామ కుంకుమపూజ జరుగుతుందన్నారు. 22వ తేదీన ఉదయం విఘ్నేశ్వరపూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మందిర స్థల దాతలు ఆలపాటి శ్రీనివాసరావు-వేద కళ్యాణి దంపతులు కలశస్థాపన చేస్తారన్నారు. 23వ తేదీ రాత్రి శ్రీ గీతామృతము కార్యక్రమం జరుగుతుందన్నారు. 24వ తేదీన రాత్రి శ్రీ విష్ణు సహస్రనామపారాయణ, 25వ తేదీన శ్రీ సాయి భజన కార్యక్రమము జరుగుతాయన్నారు. 26వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు బీదలకు వస్త్రదానము జరుగుతుందన్నారు. రాత్రికి లలితా సహస్రనామ పారాయణ జరుగుతుందన్నారు. 27న రాత్రికి గీతామృత కార్యక్రమం, 28న శ్రీ సాయి చాలీసా పారాయణము, 29న శ్రీ గోవిందనామాలు పారాయణ కార్యక్రమం,30న శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం, వచ్చే నెల ఒకటో తేదీన స్తవన మంజరి కార్యక్రమం, 2వ తేదీన శ్రీ సాయి చరిత్రలోని 42,43,44,అధ్యాయముల సామూహిక పారాయణం జరుగుతందన్నారు. సాయంత్రం శమీపూజ, శేజ్ హారతి జరుగుతాయన్నారు. 3వ తేదీన శ్రీ షిరిడి సాయినాధుని నగరోత్సవము జరుగుతాయన్నారు. ఐదవ తేదీ ఆదివారం నాడు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కమిటి సభ్యులు కోరారు.

## డ్రెయినేజిలపై అక్రమ నిర్మాణాలు కట్టొద్దు



పొన్నూరు, సెప్టెంబరు 16,ప్రభాతవార్త: పట్టణంలో నూతనంగా నిర్మించిన డ్రెయినేజీలపై అక్రమ నిర్మాణాలను కట్టొద్దని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు ప్రజలను కోరారు. పట్టణంలోని 21వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. ముబారక్ నగర్‌లో నూతనంగా నిర్మించిన డ్రెయినేజీలపై అక్రమంగా నిర్మించిన పార్కింగ్ స్లాబ్‌లను వెంటనే తొలగించాలని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు పునరావృతమైతే ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. డ్రెయినేజీలపై ఇలాంటి కట్టడాలు కట్టడం వల్ల కాలువల్లోని సిల్ట్‌ను తొలగించేందుకు ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. తద్వారా మురుగు ఎక్కడిక్కడ నిలిచి నీరు సక్రమంగా పారుదల కాకుండా రోడ్లపైకి వచ్చే అవకాశం ఉందన్నారు. మురుగునీరు సక్రమంగా పారుదల అయితే ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ప్రజలు కూడా మునిసిపల్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నూరుశాతం కార్డుల పంపిణీ పూర్తి చేయాలి



పొన్నూరు, సెప్టెంబరు 16,ప్రభాతవార్త: ప్రభుత్వం ఇటీవల రేషన్‌కార్డు దారులకు అందజేసేందుకు సిద్ధం చేసిన స్మార్ట్ కార్డులను నూరుశాతం పంపిణీ పూర్తి చేసే విధంగా విఆర్వోలు శ్రద్ధ పెట్టాలని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ ఆదేశించారు. మండల పరిధిలోని ములుకుదురు గ్రామంలో కార్డుల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పాత కార్డుల స్థానంలో ఇచ్చే ఈ కార్డులను వీఆర్వోలు ఇంటింటికి తిరిగి అందజేస్తారని చెప్పారు. గుంటూరు జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి భోగ రామారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం రేషన్ కార్డుదారులను అనేక ఇబ్బందులకు గురి చేసిందన్నారు. రేషన్‌కార్డులపై కూడా జగన్మోహనరెడ్డి ఫోటోను ముద్రించి ప్రజల సొమ్ముతో పబ్లిసిటీ చేసుకున్నారన్నారు. సొమ్మొకరిది...సోకొకరిది అన్నట్లుగా జగన్మోహనరెడ్డి వ్యవహరించారన్నారు. వైకాపా పాలనలో రేషన్ మాఫియా రెచ్చిపోయిందన్నారు. పేదలకు చెందాల్సిన బియ్యాన్ని ఎండియు ఆపరేటర్ల ద్వారా విదేశాలకు తరలించారన్నారు. పేద బియ్యాన్ని కూడా వారికి కాకుండా చేసిన ఘనత జగన్మోహనరెడ్డిదేనన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపడం జరిగిందన్నారు. ప్రస్తుతం రేషన్ కొనాలంటేనే హడలిపోతున్న పరిస్థితి ఉందన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని ఇప్పటికే పోలీస్, రెవెన్యూ అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. పేదల బియ్యం పేదలకే చెందాలన్నదే కూటమి ప్రభుత్వం యొక్క విధానమన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, పార్టీ నాయకులు, కార్డుదారులు పాల్గొన్నారు.

## నత్రజని వినియోగం వల్ల చీడపీడలు పెరుగుతాయి

పొన్నూరు, సెప్టెంబరు 16,ప్రభాతవార్త: వరిపైరులో ఎక్కువ నత్రజని ఉపయోగించడం వల్ల చీడపీడలు ఎక్కువయ్యే అవకాశం ఉందని వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్ సూచించారు. మండల పరిధిలోని దొప్పలపూడి, మన్నవ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కె.రమేష్, వ్యవసాయ సహాయకులు పూజశ్రీ, కె.పవన్, ఎంపీఈఓ ఎస్.సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

## లలితమ్మ ఆశయాలను కొనసాగిస్తాం



పొన్నూరు, సెప్టెంబరు 16,ప్రభాతవార్త: పేద ప్రజలకు సేవలందించాలనే ఉద్దేశంతోనే ఆనాడు కత్తెర లలితమ్మ హార్వెస్ట్ ఇండియాను స్థాపించి ఎంతో మందికి విశేషమైన సేవలందించారని జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కత్తెర హెని క్రిస్టినా అన్నారు.చేబ్రోలు మండల పరిధిలోని గరువుపాలెం హార్వెస్ట్ ఇండియా జూనియర్ కళాశాలలో లలితమ్మ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ అధ్యక్షురాలు హెని క్రిస్టినా మాట్లాడుతూ లలితమ్మ ఆశయ సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి లలితమ్మ ఎనలేని సేవలు చేశారన్నారు. లలితమ్మ బాటలోనే తాము నడుస్తున్నట్లు ఆమె చెప్పారు. హార్వెస్ట్ ఇండియా అధినేత, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ లలితమ్మ జయంతి సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, ఉత్తమ ప్రతిభ అవార్డులను అందజేస్తున్నట్లు చెప్పారు. లలితమ్మ పేద ప్రజలకు విద్య దూరం కాకూడదని చెప్పేవారని, వారి కోసమే లలితమ్మ పరితపించేవారన్నారు ప్రస్తుతం హార్వెస్ట్ ఇండియా తరుపున లలితమ్మ ఆశయ సాధనకు కృషి చేస్తున్నామన్నారు. లలితమ్మ సేవలు మరువలేనివన్నారు. తొలుత లలితమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కెఎన్‌కె విద్యాసంస్థల సిఈవో డాక్టర్ డేవిడ్ యశ్వంత్, కత్తెర యాస్లీ హార్వెస్ట్ ఇండియా మేనేజర్ సుధపల్లి నాగరాజు, కళాశాల సిబ్బంది, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## డీజీపి హరీష్ గుప్తాను మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్పీ ఉమామహేశ్వర్



బాపట్ల, సెప్టెంబర్16,ప్రభాతవార్త: రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. బాపట్ల జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ బి. ఉమామహేశ్వర్ డిజీపి కార్యాలయంలో డిజీపిని కలిసారు.

## జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు ఎన్‌డిపిఎస్ చట్టాలు .. అమలు విధానాలపై పోలీస్ సిబ్బందికి ప్రత్యేక అవగాహన

బాపట్ల, సెప్టెంబర్16,ప్రభాతవార్త: గంజాయి, ఇతర మత్తు పదార్థాల క్రయవిక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొని, వాటిని జిల్లాలో పూర్తిస్థాయిలో కట్టడి చెయ్యాలని బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ సంకల్పించారు. ఆ దిశగా కార్యాచరణ ప్రణాళికను జిల్లా పోలీసులు సిద్ధం చేస్తున్నారు. దానిలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈగల్ సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ లో భాగంగా మంగళవారం స్థానిక ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో



ఎన్‌డిపిఎస్ చట్టాలు మరియు వాటి అమలు విధానాలపై జిల్లాలోని పోలీస్ సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్బి ఇన్స్పెక్టర్ లు జి.నారాయణ, ఎం.రాంబాబుచ డిసిఆర్బి ఇన్స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఈగల్ సెల్ ఇన్స్పెక్టర్ జీ. రవి కుమార్ లు ఎన్‌డిపిఎస్ చట్టాలు మరియు వాటి అమలు విధానాలపై జిల్లాలోని ఎస్సై లకు, పోలీస్ స్టేషన్ లలో రైటర్, కంప్యూటర్ ఆపరేటర్ లుగా విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. అధికారులకు చట్టపరమైన విధానాలు, ప్రొసీజర్లు పై క్లాసులు నిర్వహించడమే కాకుండా, డెమో ద్వారా కూడా పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని 100 మంది పోలీసు సిబ్బందికి ఎన్‌డిపిఎస్ చట్టాల అమలులో సమగ్ర పరిజ్ఞానం పెంపొందించారు.

## సమాజంలో అడపిల్లలు,మహిళలు,యువతులు ఎదుర్కొంటున్న సవాళ్ళపై అవగాహన కల్గి ఉండాలి




బాపట్ల, సెప్టెంబర్16,ప్రభాతవార్త: సమాజంలో అడపిల్లలు,మహిళలు,యువతులు ఎదుర్కొంటున్న సవాళ్ళపై అవగాహన కల్గి ఉండాలని ఎస్.ఐ. అనిత తెలిపారు.కర్లపాలెం మండలం పేర్లి గ్రామంలోని జడ్పీహెచ్ హైస్కూల్‌లో విద్యార్థులకు పోక్సో చట్టం,అత్యవసర సమయాల్లో వినియోగించవలసిన టోల్‌ఫ్రీ నెంబర్లు గురిరంచి అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ అనిత మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసరావు పర్యవేక్షణలో బాపట్ల హెడ్‌క్వార్టర్స్ శక్తి బృందం సభ్యులు విద్యార్థినులకు శక్తి యాప్, సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, ఈవ్ టీజింగ్ తదితర అంశాలపై విస్తృత అవగాహన కల్పించడం జరిగిందన్నారు.అత్యవసర సమయాల్లో టోల్‌ఫ్రీ నంబర్లు 112, 1091, 1098, 181, 1930లు వినియోగించుకోవాలన్నారు. అదే విధంగా విద్యార్థినులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ మధ్య తేడాలు, స్వీయ రక్షణ పద్ధతులు, ఈవ్ టీజింగ్ నిరోధక చర్యలు, మహిళలపై జరుగుతున్న నేరాలు మరియు వాటికి సంబంధించిన చట్టాల పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించామన్నారు.

## రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు


కర్లపాలెం,సెప్టెంబర్16,ప్రభాతవార్త:గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగిన సీరియస్ స్కాష్ఆటల పోటీలలో అండర్14,అండర్17 విభాగంలో హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైనట్లు హైవెండ్ హైస్కూల్ అధినేత పెదమల్లు ఉదయచంద్రరావు తెలిపారు.స్థానిక పాఠశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ అండర్14 లో చందన,వర్శిత,స్వర్ణలత ,అమృత వర్శిని,అండర్ 17 విభాగంలో గీతిక, శ్రావణి,అక్షయ,శ్రీలక్ష్మీలు, అండర్ 14 బాలుర విభాగంలో వివేక్, అభినవ్ అరుణ్,కిశోర్, అండర్ 17 విభాగంలో శ్రీహర్షవర్ధన్ లు త్వరలో కాకినాడ జిల్లా లో జరగబోయే రాష్ట్రసాయి పోటీలలో గుంటూరు జిల్లా తరపున పాల్గొంటారన్నారు..ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్లు బొడ్డు సాయి మహేంద్రబాబు,చాందిని,పిడి బత్తుల వీరశేఖర్ ,ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు



## రైతు సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం

బాపట్ల, సెప్టెంబర్16,ప్రభాతవార్త:

రైతు సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏపిసిసి జనరల్ సెక్రటరీ గంటా అంజిబాబు అన్నారు.రైతు సమస్యలపై మంగళవారం ఏపీ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు కామన ప్రభాకర్ గారి పిలుపు మేరకు బాపట్ల జిల్లా మార్క్‌ఫెడ్ బాపట్ల డి ఎం కరుణ శ్రీ ను కలిసి యూరియా కొరత గురించి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గంటా అంజిబాబు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందన్నారు.యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందుతు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా సమస్యను పరిష్కరించాలన్నారు.దీనిపై కరుణ శ్రీ రైతుల పట్ల సమస్యను పరిస్కారం చూపుతానని స్పందించారు. ఈ కార్యక్రమం లో బాపట్ల జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ పోతిన సంపత్ కుమార్ , తాడికొండ వెంకటేశ్వరావు , బాపట్ల టౌన్ అధ్యక్షులు దేవరాజు, బాపట్ల జిల్లా జనరల్ సెక్రటరీ జంద్రాజుపల్లి అంబేద్కర్, చింతా బాబురావు, కుడేటి నగేష్, కొల్లూరు మండల్ అధ్యక్షులు, రవి గారు, పార్టీ నాయకులు సాదు అశోక్ గారు,శీలం సాగర్, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.



## స్మార్ట్ రేషన్ కార్డులతో రాష్ట్రంలో ఎక్కడినుంచైనారేషన్ పోందవచ్చు



బాపట్ల, సెప్టెంబర్16,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చెపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల వలన లబ్ధిదారులకు ఎంతో మేలుకల్గుతుందని తహశీల్దార్ సలీమా తెలిపారు.స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం అమె విలేకరులతో మాట్లాడుతూ బాపట్ల పట్టణ,మండల పరిదిలోని మొత్తం 93రేషన్ దుకాణాలలో 40వేల464 కార్డు దారులు ఉన్నారన్నారు.దీనికి గాను ఇప్పటి వరకు40వేల 270 స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయని మిగిలిన కార్డులు త్వరలో వస్తాయన్నారు.రూరల్‌లో 33,అర్బన్‌లో 60 రేషన్ షాపులు ఉన్నాయన్నారు. ఈ స్మార్ట్ రేషన్‌కార్డు వలన రాష్ట్రంలో ఎక్కడి నుంచైనారేషన్ పోందవచ్చునన్నారు.పిడిఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందన్నారు.స్మార్ట్ కార్డు దారుడు బయోమెట్రిక్ తప్పకుండా వేయాలన్నారు. ఈ స్మార్ట్ దారుడికి వేలిముద్రలు పనిచేయని సందర్భంలో కూడా స్కాన్ లేదా ఒపిటి,ఐరిష్ ద్వారా సరుకులు పొందవచ్చునన్నారు. ఈ కార్డులు క్యూఆర్ కోడ్‌తో రావడం జరిగిందన్నారు.స్మార్ట్ కార్డులను సచివాలయ సిబ్బంది ఇంటింటికి వచ్చి లబ్ధిదారులకు అందిస్తారన్నారు.కార్డుదారులు అందరూ అందుబాటులో ఉండి కార్డులను పోందాలని ఆమె కొరారు.

## మిశ్రమ ఎరువుల వాడకంపై మొగ్గు చూపాలి



పొన్నూరు, సెప్టెంబరు 16,ప్రభాతవార్త: రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి మిశ్రమ ఎరువుల వాడకంపై మొగ్గు చూపాలని మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శని సూచించారు. చేబ్రోలు మండల పరిధిలోని మంచాల, పాతరెడ్డిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని మాట్లాడుతూ మిశ్రమ ఎరువులు వాడకం ద్వారా మొక్కకి అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాష్ ఒకే ఎరువులో మొక్కకి అందుతాయన్నారు. అదేవిధంగా నానో యూరియా, డిఎపి కూడా వాడాలని కోరారు. ఈ పంట నమోదు తప్పని సరిగా రైతులు చేయించుకోవాలన్నారు. దగ్గర్లోని రైతు సేవా కేంద్రానికి వెళ్ళి సంబంధిత పత్రాలు అందించి చేయించుకోవాలన్నారు. రైతులు తమకు అవసరమైన ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా పొందవచ్చన్నారు. సొసైటీలలో కూడా ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ మధ్య కురిసిన వర్షాలకు చీడ పీడలు ఎలా తగ్గించుకోవాలో, వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియజేశారు. వరిలో వచ్చే తెగుళ్ళు, కలుపు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## తెలంగాణాలో సినిమాల దూకుడు! -ఆంధ్రాలో సినిమాల పాకుడు!!



తెనాలి, సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త) : తెలంగాణాలో సినిమా చిత్రీకరణలకు ధియేటర్ల కోసం పొందాల్సిన అనుమతులన్నిటినీ తాజాగా సింగిల్ విండో ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం నిన్న ప్రకటించగా ఆంధ్రాలో మౌనమే రాజ్యమేలుతుందని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24విభాగాల యూనియన్ (మా ఏపి)వ్యవస్థాపకులు, సినీ దర్శకులు దిలీప్‌రాజా ఆరోపించారు. తెనాలిలోని మా ఏపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ అక్కడ ఫిలింస్ ఇన్ తెలంగాణ పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయడం వలన అంతర్జాతీయ సినిమా నిర్మాణాలకు సైతం కేవలం స్క్రిప్ట్‌తో వస్తే ఆయా సినిమాలకు కావాల్సిన లోకేషన్‌లు, వివిధశాఖల అనుమతులు వస్తాయన్నారు. కాలయాపనకు పైరవీలకు అవకాశం లేదన్నారు. దీని వలన తెలంగాణాలో సినిమా నిర్మాణాలు శరవేగంతో దూసుకుపోతాయన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఆంధ్రలో సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలను ప్రత్యేక బిల్లుగా ప్రవేశపెట్టాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. పదవీ విరమణ చేసిన జనరల్ మేనేజర్‌ను ఏం సాధించారని తిరిగి అదే పదవిలోకి తీసుకోవడానికి ఫైల్స్ సిద్ధం అవ్వడం చూస్తుంటే నిర్లక్షానికి నీళ్ళు పోయడమేనని ఆయన వివరించారు.

## డాక్టర్ కోడెల శివప్రసాద్ 6వ వర్ధంతి



తెనాలి, సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త) : మండలంలోని అంగలకుదురు గణేష్ యూత్ ఆధ్వర్యంలో మాజీ శాసన సభ్యులు డాక్టర్ కోడెల శివప్రసాద్ 6వ వర్ధంతిని స్వదార్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరవల్లి మురళి మాట్లాడుతూ పేదల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన నాయకుడు కోడెల అని కొనియాడారు. తొలుత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొద్దులూరి వేణు, కనగాల నాగభూషణం, గొల్లపూడి సాయిగిరి, ఎల్ఎంఎల్ ఖాదర్, నిజాముద్దీన్, సలాం, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డపనేని ఇందిర 38వ వర్ధంతి

తెనాలి, సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త) : మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే దొడ్డపనేని ఇందిర 38వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక వహబ్‌రోడ్డులోని ఆమె విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ మాట్లాడుతూ దొడ్డపనేని చేసిన పనులను ఆమె గుర్తు చేశారు. తొలుత యడ్లపల్లిలోని ఆమె సమాధి వద్ద పుష్పంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి, ఆలపాటి వెంకట్రామయ్య, మాజీ ఎంపిపి కొడాలి ఆదిలక్ష్మీ, శ్రీనివాసరావు, కన్నెగంటి మురళి, పావులూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## కొల్లూరులో స్మార్ట్‌రేషన్ కార్డులు పంపిణీ




కొల్లూరు, సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త) : మండల కేంద్రమైన కొల్లూరులోని రేషన్ షాప్ 43మెయిన్ సెంటర్ వద్ద అర్హులైన లబ్ధిదారులకు ఉచితముగా స్మార్ట్ రేషన్ కార్డులు మాజీ మంత్రి, వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కనగాల మధుసూధన్‌ప్రసాద్, కొల్లూరు తహశీల్దార్ బి.వెంకటేశ్వర్లు, వేమూరు, కొల్లూరు తెలుగుదేశం పార్టీ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిడిపి కార్యకర్తకు ఆర్థిక సహాయం



కొల్లూరు, సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త) : మండల కేంద్రమైన కొల్లూరు గ్రామానికి చెందిన ఎసీ సెల్ నాయకుడు బుర్రి జగజ్జీవన్‌రామ్ టాటా ఎస్ వాహనాన్ని దగ్ధం చేయటంతో నష్టపోయిన కార్యకర్తకు మంగళవారం కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కొల్లూరు మండల నాయకులు కార్యకర్తలు అందరూ కలిసి మాజీ మంత్రి వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు నక్కా ఆనందబాబు చేతుల మీదగా రూ.1,58,000లు బాధిత కార్యకర్త జగన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు మండల గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టేషనరీ అందజేత



తెనాలి రూరల్ సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త): రూరల్ మండలం తేల్లప్రోలు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ కు చివర డీజీపీ గా పని చేసిన,దివంగత డాక్టర్ బయ్యారపు ప్రసాదరావు69వ జయంతి సభ (యాక్ట్‌అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్) ఆధ్వర్యంలో నిర్వహించారు.సభకు అధ్యక్షత వహించిన యాక్ట్ చైర్మన్ ఆళ్ళమూడి ప్రభాకరరావు మాట్లాడుతూ,మాజీ డిజిపి ప్రసాదరావు తేల్లప్రోలు గ్రామంలో జన్మించి ఐపిఎస్ అధికారిగా పనిచేసి డీజీపీగా ఎదిగారని,ఆయన జన్మించిన గ్రామంలో ఆయన 69వ జయంతి జరుపుట చాలా సంతోషమన్నారు. తొలుత ఈకార్యక్రమంనకు ముఖ్య అతిథిగా పాల్గొన్న తెనాలి కోర్టు సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్ కుమార్, ప్రసాదరావు చిత్రపటానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు. స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు షేక్ రుక్సానా,ఉపాధ్యాయులు శైలజ,గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.పద్మావతి, సచివాలయం సిబ్బంది భార్గవి,కనపర్తి అనూష,మాజీ ఎంపీటీసీ వేజెండ్ల ఇశ్రాయేలు, అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు,ప్రముఖ న్యాయవాది గాదెలవర్తి ప్రభాకరరావు,వేజెండ్ల రత్నం, అత్తోట చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకోసం ప్రత్యేకవైద్య శిబిరాలు ఏర్పాటు: డిఎంహెచ్ఓ

తెనాలి టౌన్ సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త): వైద్యఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు, స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెనాలి ఉప వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ కోరారు.మంగళవారం, పట్టణంలోని,తన కార్యాలయం నందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబాన్ని సమర్థవంతంగా నిర్వహించును,అనే కార్యక్రమాన్ని,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబసంక్షేమ శాఖ ద్వారా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వ తేదీ వరకు రెండు వారాల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు . "స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్"( ఆరోగ్య వంత మైన మహిళ శక్తి వంత మైన కుటుంబం) అను సమగ్ర ఆరోగ్య ప్రచార్ మరియు సేవా కార్యక్రమము నిర్వహించ వలసినదిగా ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబం బలపరిచే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.అలాగే మహిళలఆరోగ్యం పై అవగాహన పెంచడం,మహిళలకు సమయానుకూల వైద్యసేవలు అందించడం,వారికి కావలసిన పోషకాహారాన్ని ప్రోత్సహించడం,కుటుంబాలను స్వశక్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేసిందని తెలిపారు.

# తెర

# కణ్మని.. ఇన్నోసెంట్ స్వీట్ గర్ల్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం ఓజీ. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఓజాస్ గంభీరగా పవన్ కళ్యాణ్ శక్తివంతమైన పాత్రలో కనిపించనున్న ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్నారు. సెప్టెంబరు 25న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానున్న ఓజీ చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. త్వరలో ట్రైలర్ విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో జోరు పెంచింది. ఈ నేపథ్యంలో తాజాగా కథానాయిక ప్రియాంక అరుళ్ మోహన్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే.. 'మూవీ అనౌన్స్ మెంట్ అయిన తర్వాత డైరెక్టర్ గారు కథ వినిపించారు. నాకు చాలా నచ్చింది. వెంటనే ఈ సినిమా చేయడానికి అంగీకరించాను. కణ్మని పాత్ర 1980-90లలో జరిగే కథ. పాత్రను మలిచిన తీరు కానీ, ఆహార్యం కానీ అప్పటికి తగ్గట్టుగానే ఉంటుంది. కణ్మని ఒక ఇన్నోసెంట్ స్వీట్ గర్ల్. గంభీర పాత్రతో గాఢమైన ప్రేమలో ఉంటుంది. గంభీర జీవితాన్ని మలుపు తిప్పే పాత్ర కణ్మని. ఇందులో తమన్ స్వరపరిచిన సువ్వి సువ్వినే సాంగ్ నచ్చడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఇందులో యాక్షన్ అనేది ఒక భాగం మాత్రమే. బలమైన కథ ఉంది. ఫ్యామిలీ డ్రామా కూడా ఉంది. సీన్ ఎలా తీయాలి, నటీనటుల నుంచి ఎలాంటి నటన రాబట్టుకోవాలి.. ఇలా ప్రతి విషయంపై దర్శకుడు సుజీత్‌కు స్పష్టత ఉంది. నా క్యారెక్టర్, లుక్ బాగున్నాయంటే దానికి కారణం సుజీత్ గారే. తదుపరి ప్రాజెక్ట్‌ల విషయానికొస్తే తెలుగులో కొన్ని కథలు వింటున్నాను. అలాగే, వేరే భాషల్లో పలు సినిమాలు చేస్తున్నాను. ఓజీతో దాదాపు రెండున్నరేళ్ల ప్రయాణాన్ని ఎప్పటికీ మరిచిపోలేను. పవన్ కళ్యాణ్ గారితో కలిసి నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమాలో కణ్మని పాత్ర చేయడం మరింత అదృష్టంగా భావిస్తున్నాను. ఈ పాత్రకి నా మనసులో ఎప్పటికీ ప్రత్యేక స్థానముంటుంది. పవన్ కళ్యాణ్ గారి నుంచి ఎన్నో నేర్చుకున్నాను. ఆయన జెంటిల్ మేన్. అందరినీ సమానంగా చూస్తారు. ఆన్ స్క్రీన్ లోనే కాదు ఆఫ్ స్క్రీన్‌లోనూ ఆయన రియల్ హీరో. పవన్ కళ్యాణ్ క్రేజ్ అనేది అవధులు లేనిది. నేను బెంగళూరులో ఉన్నప్పుడే ఆయన గురించి తెలుసు. అయితే ఆయనతో కలిసి నటిస్తున్నప్పుడు తెలిసిందే ఏంటంటే.. నేను ఊహించిన దానికంటే ఇంకా ఎక్కువ క్రేజ్ ఉంది. ఎంత క్రేజ్ ఉన్నా కూడా.. పవన్ గారు ఒదిగే ఉంటారు. డౌన్ టు ఎర్త్ పర్సన్. చాలా సింపుల్‌గా ఉంటారు. సెట్‌లో పవన్ కళ్యాణ్ ఎక్కువగా పుస్తకాల గురించి మాట్లాడతారు. ఆయన చదివిన కథలు, నవలల గురించి చెప్తారు. చరిత్ర గురించి మాట్లాడతారు. అప్పుడప్పుడు సినిమాలు, రాజకీయాల గురించి కూడా మాట్లాడుతుంటారు. ముఖ్యంగా ప్రజల గురించి ఎక్కువ మాట్లాడతారు. షూటింగ్ సమయంలో సన్నివేశం షూట్ చేయడానికి ముందు దర్శకుడు, నటీనటులతో పవన్ చర్చిస్తారు. సినిమాకి ఉపయోగపడే పలు గొప్ప సూచనలు ఇస్తుంటారు. నటుడిగా కూడా ఆయన తన పాత్రను చాలా సులభంగా చేస్తుంటారు. పవన్ గారి నుంచి చాలా విషయాలు నేర్చుకోవచ్చు'.

← ఓజీ కథానాయిక ప్రియాంక అరుళ్ మోహన్

## తెలుగు అమ్మాయి నందినికి మిస్ యూనివర్స్ కిరీటం



కేవలం 24 సంవత్సరాల వయసులో, తెలుగు అమ్మాయి చన్నగిరి నందిని విజయవాడలో దృఢ నిశ్చయంతో ఉన్న యువతి నుండి హైదరాబాద్‌లో ప్రసిద్ధ మోడల్, నటి మరియు పరోపకారిగా తనకంటూ ఒక బలీయమైన మార్గాన్ని ఏర్పరచుకుంది. కంప్యూటర్స్‌లో బి.కామ్‌తో, ఆమె అంచనాలను ధిక్కరించింది, సవాళ్లను అధిగమించింది మరియు ఆకర్షణీయమైనంత ప్రభావవంతమైన కెరీర్‌ను నిర్మించింది. నందిని ప్రయాణం ఫ్యాషన్ ప్రపంచం పట్ల స్పష్టమైన మక్కువతో ప్రారంభమైంది, ఆమె తల్లిదండ్రులు మొదట్లో నిరుత్సాహపరిచినా.. తనపై నమ్మకంతో ముందడుగు వేసి అచంచలమైన పట్టుదలతో పరిశ్రమలో తన స్థానాన్ని పదిలం చేసుకోవటమే కాకకుండా ఆకట్టుకునే బిరుదులను సొంతం చేసుకుంది. ఇటీవలే, నందిని మిస్ యూనివర్స్ ఇంటర్నేషనల్ 2025 కిరీటాన్ని గెలుచుకుంది. వైఐఎఫ్ డబ్ల్యూ అండ్ వైఎస్ ఇంటర్నేషనల్ ఫ్యాషన్ వీక్ నిర్వహించిన మిస్ యూనివర్స్ ఇంటర్నేషనల్ 2025 గోవాలో ఆగస్టు 29 నుండి 31 వరకు జరిగింది. 20 దేశాల నుండి పోటీదారులు పాల్గొన్నారు, 60 మంది సెమీఫైనల్స్‌కు చేరుకోగా, 40 మంది ఆగస్టు 31న జరిగిన గ్రాండ్ ఫినాలేకు ఎంపికయ్యారు. ప్రతిష్టాత్మకమైన 3 రోజుల ఈవెంట్‌లో మూడు పోటీ రౌండ్లు ఉన్నాయి: ఇంటర్నేషనల్ రౌండ్, స్విమ్‌వేర్ రౌండ్ మరియు బిజినెస్ రౌండ్. భారతదేశాన్ని గర్వంగా ప్రాతినిధ్యం వహిస్తూ, నందిని విజేతగా నిలిచింది.

## రష్మిక ఖాతాలో కాంచన 4?



నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఫాం గురించి ఎంత చెప్పినా తక్కువే. సౌత్‌లో ఆమెకు తిరుగులేదు.. బాలీవుడ్‌లో కూడా వరుస ప్రాజెక్ట్ లతో దూసుకెళ్తుంది. హిందీలో ఒకటి అర ఫ్లాపులు పడుతున్నా దాన్ని లెక్క చేయకుండా ఆఫర్లు ఇస్తున్నారు. లేటెస్ట్‌గా షాహిద్ కపూర్‌తో ఒక సినిమా ఫైనల్ అయినట్టు తెలుస్తోంది. కాక్ టైల్ 2లో రష్మిక ఛాన్స్ అందుకుందని సమాచారం. ఆల్రెడీ ఆయుష్మాన్ ఖురానా సినిమాలో అమ్మడు నటిస్తున్న విషయం తెలిసిందే. కాంచన 4లో రష్మిక మందన్న.. ఇక రష్మిక మందన్న ఖాతాలో మరో క్రేజీ ప్రాజెక్ట్ చేరినట్టు టాక్. కోలీవుడ్ సూపర్ హిట్ ఫ్రాంఛైజీ కాంచన నాలుగో మూవీగా కాంచన 4 వస్తోంది. ఈ సినిమాను లారెన్స్ డైరెక్ట్ చేస్తూ నటిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమాలో బుట్ట బొమ్మ పూజా హెగ్డే నటిస్తుందని టాక్. ఆమెతో పాటు రష్మిక మందన్న కూడా ఉంటుందని అంటున్నారు. సినిమాలో ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్‌లో రష్మిక మందన్న ఉంటుందట. సో సినిమాలో రష్మిక ఘోస్ట్‌గా కనిపిస్తుందని చెబుతున్నారు. టాకప్రభాస్ ప్రశాంత్ వర్మ మూవీ.. టాలీవుడ్‌లో ఇదే తొలిసారి.. ఇప్పటికే రష్మిక మందన్న డిఫరెంట్ రోల్స్‌తో ఆడియన్స్‌ని మెప్పిస్తోంది. ఇప్పుడు అమ్మడు కాంచన 4లో కొత్త రోల్‌లో సర్ ప్రైజ్ చేయబోతుందట. ఐతే మేకర్స్ నుంచి అఫీషియల్ కన్ ఫర్మేషన్ లేకుండానే కాంచన 4 లో రష్మిక ఉంటుందని సోషల్ మీడియాలో హంగామా మొదలైంది. విజయ్ దేవరకొండతో హిట్ సెంటిమెంట్.. రష్మిక మందన్న నిజంగానే కాంచన 4 లో ఉందా లేదా అన్నది త్వరలో తెలుస్తుంది. ఏది ఏమైనా మిగతా హీరోయిన్స్ ఏమో ఛాన్స్ లు లేక ఖాళీగా ఉంటే రష్మిక మాత్రం ఒక దానికి మించి మరొకటి అనిపించేలా అవకాశాలతో అదరగొట్టేస్తుంది. రష్మిక సినిమాలో ఉంది అంటే సినిమా సక్సెస్ అన్నట్టేలా క్రేజ్ తెచ్చుకుంది. అందుకే ఆమె వెంట దర్శక నిర్మాతలు పడుతున్నారు. ఇక తెలుగులో రష్మిక మందన్న ది గర్ల్ ఫ్రెండ్ సినిమా పూర్తి చేసింది. నెక్స్ట్ విజయ్ దేవరకొండ రాహుల్ సంకృత్యన్ కాంబో మూవీలో అమ్మడు నటిస్తుంది. ఈ సినిమా పీరియాడికల్ స్టోరీతో వస్తుంది. తప్పకుండా విజయ్, రష్మిక కాంబోకి ఉన్న హిట్ సెంటిమెంట్ ని ఇది రిపీట్ చేస్తుందని అంటున్నారు. విజయ్, రష్మిక కూడా ఈ సినిమా కోసం తమ ఫుల్ ఎఫర్ట్ పెట్టేస్తున్నారట. ఇద్దరి మధ్య ఆల్రెడీ మంచి కెమిస్ట్రీ ఉంటుంది కాబట్టి సినిమా నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుందని చెప్పుకుంటున్నారు. సో ఇటు సౌత్ లో స్టార్ ఛాన్స్ లతో పాటు బాలీవుడ్ లో మంచి ఫాం కొనసాగిస్తూ రష్మిక ఫుల్ స్వింగ్‌లో ఉంది.

## ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో బ్రహ్మ రాక్షస్



హనుమాన్ సినిమాతో దేశ వ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న దర్శకుడు ప్రశాంత్ వర్మ తో ప్రభాస్ కొత్త సినిమా త్వరలోనే ప్రారంభం కానుందని తెలుస్తోంది. కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న ప్రశాంత్ వర్మ ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ విజువలైజేషన్ పనులను పూర్తి చేశాడని ఇండస్ట్రీలో చర్చ సాగుతోంది. ప్రతి సీన్, ప్రతి క్యారెక్టర్, ప్రతి షాట్ ముందే డిజైన్ చేయబడి ఉన్నట్లు సమాచారం. దీంతో షూటింగ్ ప్రారంభమైన తర్వాత కూడా ఈ ప్రణాళిక ప్రకారం సమర్థంగా పని చేయగలరని అంటున్నారు. ఈ సినిమాకు ప్రస్తుతం బ్రహ్మ రాక్షస్ అనే వర్కింగ్ టైటిల్ వినిపిస్తోంది. అయితే, టైటిల్ మారే అవకాశాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న హనుమాన్ సీక్వెల్ జై హనుమాన్ పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది రెండవ పెద్ద చిత్రం కావడం విశేషం. కాంతార్ల ఫేం రిషబ్ శెట్టి హనుమంతుడిగా కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తోంది. ప్రభాస్ అభిమానులు ఆయన ఈ కొత్త సినిమాతో మరోసారి భారీ విజయాన్ని అందిస్తాడని ఆశగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ ప్రారంభం కాగానే మరిన్ని అధికారిక వివరాలు వెలువడే అవకాశముంది.

## గ్రామీణ రాజకీయాలలో స్త్రీ శక్తే ప్రభుత్వ సారాయి దుకాణం



ఎస్ వి ఎస్ ప్రొడక్షన్స్ శ్రీనిధి సినిమాస్ బ్యానర్స్‌పై జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది రచన దర్శకత్వంలో రానున్న చిత్రం ప్రభుత్వ సారాయి దుకాణం. దైవ నరేష్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మాతలుగా మురళీమోహన్ రెడ్డి సినిమాటోగ్రఫీలో నాగిరెడ్డి ఎడిటింగ్ చేస్తూ సిద్ధార్థ్ సంగీతాన్ని అందించారు. సదన్ హాసన్, విక్రమ్ జిత్, నరేష్ రాజు, వినయ్ బాబు హీరోలుగా శ్రీలు దాసరి, అదితి మైకేల్, మోహన సిద్ధి హీరోయిన్లుగా ప్రధాన పాత్రలు పోషించారు. 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్, బిజేపి బాలు నాయక్, రంగరాజు, తిలక్, బలగం సహదేవ్, స్వప్న, జ్యోతి తదితరులు కీలకపాత్రల పోషించారు. మల్లిక్, నరేష్ గౌడ్ ఈ చిత్రంలో ఎంతో ప్రాముఖ్యత ఉన్న పాటలు పోషించడం విశేషం. కాగా మంగళవారం మీడియా సమక్షంలో ఈ చిత్ర టీజర్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నరసింహ నంది మాట్లాడుతూ... 'నేను ఒక కథను రెండు భాగాలుగా అనుకుని మొదటిగా ఈ సినిమా మొదలుపెట్టాను. ఈ సినిమాలో ప్రతి పాత్ర మనకు పురాణాల నుండి ఏదో ఒక పాత్రను, వ్యక్తిత్వాన్ని గుర్తు చేస్తూ ఉంటాయి. మనుషుల యొక్క వ్యక్తిత్వాలు అలాగే మనిషి యొక్క ఇతర ఆలోచనలు అన్నిటిని ఈ సినిమాలోని పాత్రలు ప్రతిబింబిస్తుంటాయి. అందుకే జంతువు లక్షణాలు కలిగిన మనుషుల కథ అంటూ ట్యాగ్ పెట్టాం. నిర్మాత దైవ నరేష్ గౌడ మాట్లాడుతూ... 'మా బ్యానర్లో మరొక 3 సినిమాలు రాబోతున్నాయి. కొంతమంది రాజకీయ నాయకులకు వెన్నులో వణుకు పుట్టించే సినిమాగా నిలిచిపోతుంది' అన్నారు. నిర్మాత పరిగి స్రవంతి మల్లిక్ మాట్లాడుతూ... ఈ సినిమాలో ప్రతి పాత్ర హీరోనే. ఒక గ్రామంలో జరిగే కొన్ని వాస్తవ సంఘటనలను తీసుకొని స్త్రీ శక్తిని చూపిస్తూ చేసిన సినిమా. ఎంతో ధైర్యం ఉంటే కానీ ఇటువంటి సినిమా తీయలేరు. అంతటి ధైర్యం ఉన్న వ్యక్తి మా దర్శకుడు' అన్నారు. సంగీత దర్శకుడు సిద్ధార్థ్ మాట్లాడుతూ... ' సినిమాలో ట్విస్టులు, మలుపులు ఉంటాయి. ఎన్నో సీన్స్ చాలా హై ఉంటాయి. సినిమాలోని పాత్రలలో మానవత కోణాల నుండి రాజకీయ కోణాల వరకు వివిధ రకాలుగా పాత్రలను చూడబోతున్నాము' అన్నారు. నటుడు విక్రమ్ జిత్ మాట్లాడుతూ... 'సాధారణంగా మనిషి లోపల రెండు కోణాలు ఉంటాయి. ఒకటి కనిపించేది, మరొకటి కనిపించనిది. ఈ సినిమా ద్వారా స్త్రీ శక్తి ఎంత బలంగా ఉంటుంది అనేది మా డైరెక్టర్ గారు నాకు చెప్పినప్పుడు నేను ఎంతో ఎక్సైట్‌గా ఫీల్ అయ్యాను' అన్నారు. నటి శ్రీలు మాట్లాడుతూ... 'ఈ సినిమాలో నా పాత్ర కాస్త కొత్తగా ఉండబోతుంది' అన్నారు. నటి మోహన సిద్ధి మాట్లాడుతూ... ' నేను ఈ సినిమాలో నా పాత్ర గురించి విన్నప్పుడు ఎంతో భయపడ్డాను. రెండు రోజులపాటు ఆలోచించాను. నాకంటూ ఒక గుర్తింపు వచ్చే పాత్ర అనిపించింది. ఈ సినిమాకు పార్ట్ 2 కూడా ఉండబోతుంది' అంటూ ముగించారు.

## ప్రేమకు .. ఓ నమస్కారం



కొత్తదనంతో కూడిన చిత్రాలను మన తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. అందుకే మన దర్శక, నిర్మాతలు ఇప్పుడు న్యూ కాన్సెప్ట్ చిత్రాలను నిర్మించడానికి ఇష్టపడుతున్నారు. ఇక ఇప్పుడు సోషల్‌మీడియాలో, యూట్యూబ్‌లో సన్సేషన్ సృష్టించిన వారు వెండితెరకు పరిచయమవుతున్నారు. సక్సెస్ సాధిస్తున్నారు. ఇటీవల లిటిల్‌హార్ట్స్ చిత్రంతో యూట్యూబ్ సన్సేషన్, మీమ్ కంటెంట్ క్రియేటర్ మౌళి తనూజ్ బ్లాక్‌బస్టర్ అందుకున్నాడు. ఇప్పుడు ఈ కోవలోనే యూట్యూబ్‌లో వీడియోలతో తనకంటూ ఓ ప్రత్యేక మార్క్‌ను క్రియేట్ చేసుకున్న యూట్యూబ్ సన్సేషన్ షణ్ముఖ్ జస్వంత్ హీరోగా ఓ చిత్రం రూపొందుతోంది. ఉల్క గుప్తా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రముఖ నటుడు శివాజీ, ప్రముఖ నటి భూమిక కీలకపాత్రల్లో కనిపించబోతున్నారు. ఏబీ సినిమాస్ పతాకంపై అనిల్ కుమార్ రావాడ, భార్గవ్ మన్నె నిర్మిస్తున్న ఈ చిత్రానికి వి. భీమ శంకర్ దర్శకుడు. మంగళవారం హీరో షణ్ముఖ్ జస్వంత్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రానికి ప్రేమకు నమస్కారం అనే టైటిల్‌ని నిర్ణయించారని తెలియజేయడంతో పాటు ఇందుకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. ఈ గ్లింప్స్ వీడియోను గమనిస్తే.. ఇదొక యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌లా కనిపిస్తుంది. లవ్ ఫెయిల్యూర్స్.. లవ్ బ్రేకప్ అయిన వాళ్లంతా ఒక దగ్గర చేరి మాట్లాడుకుంటున్న సంభాషణలు, వాళ్ల గర్ల్‌ఫ్రెండ్స్ తమకు ఎలా హ్యాండ్ ఇచ్చారు అని చెప్పుకునే ఫన్నీ బాధలు అన్నీ ఎంతో ఎంటర్‌టైనింగ్‌గా ఉన్నాయి. ఇక ఫైనల్‌గా షణ్ముఖ్ ఇది పాన్ ఇండియా ప్రేమ ప్రాబ్లమ్ అని చెప్పడం, మీరు అమ్మాయి దక్కలేదని మందుకు, సిగరెట్లకు ఖర్చు పెట్టే డబ్బులతో కైలాసగిరి దగ్గర ల్యాండ్‌తో పాటు కారు కొనుక్కోవచ్చు అని చెప్పే సంభాషణలు నేటి యూత్‌కు, వాళ్ల ప్రేమకు ఎంతో కనెక్ట్ అవుతాయి. టోటల్‌గా ప్రేమకు నమస్కారం అనే టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియో ఎంతో ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ఇదొక యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్. ఈ చిత్రంలో యూత్‌తో పాటు అందరికి కనెక్ట్ అయ్యే అంశాలున్నాయి. ముఖ్యంగా నేటి యువత లవ్, బ్రేకప్‌అప్, ఇలా అన్ని అంశాలను పూర్తి వినోదభరితంగా ఈ చిత్రంలో చూపించబోతున్నాం. నేటి యువత బాగా కనెక్ట్ అయ్యే కథ ఇది అన్నారు. నిర్మాత మాట్లాడుతూ వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో రాబోతున్న చిత్రమిది. కొత్తదనం, హిలేరియస్ ఎంటర్‌టైనర్‌మెంట్ ఈ చిత్రంలోని ప్రత్యేకతలు. తప్పకుండా చిత్రం మీ ఆదరణ పొందుతుంది అన్నారు.

## 18న వృషభ గర్జన



వృషభ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్యాన్స్‌కు మోహన్‌లాల్ గుడ్‌న్యూస్ వినిపించారు. వృషభ టీజర్‌ను సెప్టెంబర్ 18న రిలీజ్ చేయబోతున్నట్లు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. "యుద్ధాలు, భావోద్వేగాలు, గర్జన' అంటూ మోహన్ లాల్ చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది. రోర్ ఆఫ్ వృషభ, ది వరల్డ్ ఆఫ్ వృషభ అంటూ ఈ ట్వీట్‌లో మోహన్‌లాల్ పేర్కొన్నారు. ఈ ట్వీట్ తోనే టీజర్‌ను ఎప్పెడెప్పుడూ చూడాలా అనే ఇంట్రెస్టను ఫ్యాన్స్‌లో క్రియేట్ చేశారు మోహన్‌లాల్. ట్వీట్‌తో పాటు మోహన్‌లాల్ పోస్టర్ ఆకట్టుకుంటుంది. త్రిశూలం ఆకారంలో ఉన్న కత్తి, డాలు పట్టుకొని ఇంటెన్స్ లుక్‌లో ఈ పోస్టర్‌లో మోహన్ లాల్ కనిపిస్తున్నారు. యోధుడిగా పవర్‌ఫుల్ రోల్‌లో మోహన్‌లాల్ వృషభ సినిమాలో కనిపించబోతున్నట్లు పోస్టర్ చూస్తుంటే తెలుస్తోంది. టీజర్‌తోనే వృషభ ఏ రేంజ్‌లో ఉండబోతుందన్నది ఆడియెన్స్‌కు చూపించబోతున్నారు మేకర్స్. అభిమానుల అంచనాలకు ఎన్నో రెట్లు మించి ఈ సినిమా ఉండబోతుంది. ఇండియన్ సినిమాల్లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా వృషభ తెరకెక్కుతోంది. కాన్సెప్ట్, గ్రాండియర్ విజువల్స్, మ్యూజిక్‌తో ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో ఉంటుంది.

తరాల పాటు నిలిచి పోయే శక్తివంతమైన కథాంశంతో దర్శకుడు నందకిషోర్ వృషభ సినిమాను రూపొంది స్తున్నారు. తండ్రీ కొడుకుల అనుబంధం హృదయాలకు హత్తుకుంటుంది. మైథాలజీ ఎలిమెంట్స్‌తో పాటు యాక్షన్, డ్రామా, సస్పెన్స్ ఇలా అన్నికమర్షియల్ హంగులతో విజువల్ వండర్‌గా వృషభ ఉండబోతుంది. కంప్లీట్ యాక్టర్ మోహన్‌లాల్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిపోయే సినిమా అవుతుంది. మోహన్‌లాల్ లుక్, ఆహార్యం, యాక్టింగ్ ... గత సినిమాలకు మంచి ఉంటాయి. వృషభలో మోహన్‌లాల్ నట విశ్వరూపాన్ని ఆడియెన్స్ చూస్తారు.కనెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిలిమ్స్‌తో కలిసి అభిషేక్ వ్యాస్ స్టూడియోస్ వృషభ సినిమాను నిర్మిస్తోంది.

## కూతురు ఉన్న తండ్రి పెయిన్ కథే బ్యూటీ



బ్యూటీ చిత్రం ఈనెల 19న విడుదల కాబోతోంది. ఈ సినిమాలో కీలక పత్రాలు పోషించిన సీనియర్ నటుడు వీకే నరేష్, నటి వాసుకి మంగళవారం మీడియాతో ముచ్చటించి సినిమా గురించి తెలిపారు. ఈ సినిమాలో ప్రస్తుత జనరేషన్ తమను తాము చూసుకుంటారు. ఈ రోజుల్లో మ్యారేజ్ గురించి ఎవరూ ఆలోచించట్లేదు. అది ఒక కమిట్మెంట్. ఇప్పుడు లివ్ ఇన్ రిలేషన్, కలిసి ఎంజాయ్ చేసి విడిపోవడం అంతే. ఇప్పటి పిల్లలకు మనం ఏమి చెప్పలేము. ఫ్రెండ్‌గా ఉండటమే చేయాలి.నాకు కూతురు లేదు అనే లోటు ఎప్పుడూ ఉండేది. ఆ లోటు కాదు కానీ కూతురు ఉంటే ఇంత పెయిన్ పడేవాడినా అని ఈ సినిమాలో అనుభవించాను. ఈ సినిమా చూసి అమ్మాయిలకు వాళ్ళ ఫాదర్ గుర్తొచ్చి కంట్లో నీళ్ల రాకపోతే నన్ను అడగండి అని తెలిపారు. ..నటి వాసుకి మాట్లాడుతూ....నాకు కూతురు ఉంది. ఇప్పుడు ఉన్న జనరేషన్‌లో ప్రతి అమ్మా యి చేసేది మా అమ్మాయి చేస్తుంది. ఈ కథ విన్నప్పుడు చెప్పిన పాయింట్ ఒక తల్లిగా నాకు కనెక్ట్ అయింది. ఒక తల్లికి, అమ్మాయికి ఉండాల్సిన అవగాహన, బాధ్యత ఉన్నాయి ఈ కథలో. ఇప్పటి జనరేషన్‌ని తిట్టి పెంచలేము. మంచిగా చెప్పాలి.ఈ సినిమా చూస్తే అమ్మాయిలు వాళ్ళ తండ్రుల మధ్య ఉన్న సమస్యలు తీరిపోతాయి అని తెలిపారు.



## తెలుసు కదా షూటింగ్ పూర్తి

మిరాయ్ లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ తెలుసు కదా. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. ప్రముఖ స్టైలిస్ట్‌ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శ కత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం తాజాగా షూటింగ్ పూర్తి చేసుకుంది. టీం లోకేషన్‌లో కేక్ కట్ చేసుకుని సెలబ్రేట్ చేసుకున్నారు. ఇటివలే రిలీజ్ చేసిన తెలుసు కదా టీజర్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సాంగ్ మల్లిక గంధ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. త్వరలో సెకండ్ సాంగ్ రిలీజ్ కానుంది. మేకర్స్ ఈ సినిమాని అగ్రెసివ్‌గా ప్రమోట్ చేయబోతున్నారు. డైరెక్టర్ నీరజకోన చాలా యూనిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కించారు. ప్రమోషన్ మెటీరియల్ హ్యూజ్ రెస్పాన్స్‌తో సినిమాపై అంచనాలు పెంచింది. తమన్ మ్యూజిక్ అందించారు. జాతీ య అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్, సినిమాటోగ్రాఫర్ జ్ఞాన శేఖర్ జుళీ లావిష్ విజువల్స్ అందించారు.

17-9Pg5 9_17-9Pg5.qxd 9/16/2025 11:05 PM Page 1





డెహ్రాడూన్‌లో ఉధృత స్థాయిలో వరద దృశ్యం



ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో భారీ వర్షాలకు రోడ్డుపక్క గోతిలో పడ్డ బస్సు

# ఉత్తరాఖండ్‌లో మేఘ విస్ఫోటం

**డెహ్రాడూన్, సెప్టెంబరు 16:** ఉత్తరాఖండ్ డెహ్రాడూన్‌లో మేఘవిస్ఫోటం సంభవించింది. సహస్రధారలో పోటెత్తిన మెరుపువరదల్లో పలువురు గల్లంతయ్యారు. వరదతో పాటు వచ్చిన బురద, ఇతర శిథిలాల తాకిడికి అనేక ఇళ్లు, దుకాణాలు, హోటళ్లు దెబ్బతినగా, వాహనాలు నీటిలో కొట్టుకుపోయాయి. సహాయకచర్యలు చేపట్టిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, ప్రభావిత ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. డెహ్రాడూన్‌లో విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. తపోవన్ ప్రాంతంలో నివాసాలు జలమయమయ్యాయి. వరదనీరు భారీగా చేరడంతో జిల్లాలోని తమ్సా, టన్స్, సాంగ్ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మాల్‌దేవతా ప్రాంతంలో ఓ వంతెన కొట్టుకుపోయింది. ముస్సోరీలో కూడా భారీగా నష్టం వాటిల్లినట్లు తెలిసింది. రిషికేశ్‌లో చంద్రభాగానది ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తోంది. నదీ ప్రవాహంలో చిక్కుకున్న ముగ్గురిని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రక్షించారు. ప్రేమ్‌నగర్ ప్రాంతంలో మైనింగ్ పనులు చేస్తుండగా, అకస్మాత్తుగా వరద ప్రవాహం రావడంతో అందులో అనేక మంది కార్మికులు చిక్కుకున్నారు. అందుకు సంబంధించిన వీడియో వైరల్ అయింది. ట్రక్కుపైన ఉన్న కార్మికులు ఒడ్డున ఉన్న ప్రజలను రక్షించమని వేడుకుంటున్నట్లు విడియోలో కనిపిస్తుంది. కొన్ని సెకన్ల తర్వాత ట్రాలీ కొట్టుకుపోయి బోల్తా పడింది. దీంతో ఎనిమిది కార్మికులు చనిపోయినట్లు భావిస్తున్నారు అధికారులు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అదే సమయంలో భారీ వర్షాలకు తమ్సా ఉప్పొంగి ప్రవహించడంతో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన తపకేశ్వర్ మహాదేవ్ ఆలయం నీట మునిగింది. ఆలయ ప్రాంగణంలోకి నీరు ప్రవేశించి హనుమాన్ విగ్రహం వరకు చేరింది. అయినప్పటికీ గర్భగుడి సురక్షితంగా ఉందని ఆలయ పూజారి ఆచార్య బిపిన్ జోషి వెల్లడించారు. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల కారణంగా తలెత్తిన పరిస్థితిపై ఆరా తీయడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామితో ఫోన్‌లో మాట్లాడారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఆరా తీశారు. ఇళ్లు, ప్రభుత్వ ఆస్తులకు చాలా నష్టం జరిగింది. జీవనోపాధి దెబ్బతింది. ఈ సంక్షోభ సమయంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలుగా సహాయం చేస్తామని మోడీ హామీ ఇచ్చినట్లు ధామి తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో పరిపాలనా యంత్రాంగం పూర్తిగా చురుగ్గా

### ఆలయాల్లోకి వరద నీరు, కొట్టుకునిపోయిన ట్రాక్టర్

ఉందని, యుద్ధ ప్రాతిపదికన రక్షణ మరియు సహాయ కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి బాధిత కుటుంబానికి అండగా నిలుస్తుంది. పోలీసులు, స్థానిక అధికారులు క్షేత్రస్థాయిలో అవిశ్రాంతంగా పనిచేస్తున్నారని ధామి తెలిపారు. భారీ వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న ఓ నదిలో పది మంది కూలీలు కొట్టుకుపోయారు. భారీ వర్షాలకు డెహ్రాడూన్‌లోని టాన్స్ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. అదే సమయంలో అటుగా వస్తున్న ఓ ట్రాక్టర్ నదిలో చిక్కుకుపోయింది. వరద ప్రవాహం పెరగడంతో కొట్టుకుపోయింది. అందులోని పది మంది కూలీలు కూడా గల్లంతయ్యారు. ఇందుకు సంబంధించిన షాకింగ్ వీడియో వైరల్ అవుతోంది. సమాచారం అందుకున్న రెస్క్యూ టీమ్ హుటాహుటిన అక్కడికి చేరుకొని గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపడుతోంది.

హిమాచల్ ప్రదేశ్‌లో మరోసారి భారీవర్షాలు కురుస్తున్నాయి. రాజధాని సిమ్లా, మండి సహా పలు ప్రాంతాల్లో కుండపోత వర్షంకురిసింది. ఈ వర్షానికి వరదలు సంభవించాయి. రాజధాని సిమ్లా, సమీప ప్రాంతాల్లో ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడ్డాయి. మండి జిల్లాలోని ఓ బస్ డిపోను వరద ముంచెత్తింది. ఈ వర్షాలకు ప్రధాన రహదారులు, కాలనీలు నీట మునిగాయి. అనేక ఇళ్లు నేలకూలాయి. జనజీవనం స్తంభించిపోయింది. మండిలో రాత్రి 11 గంటల ప్రాంతంలో వర్షం ప్రారంభమైంది. తెల్లవారుజామున 1 గంట సమయానికి వర్షం తీవ్రత పెరిగింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు వచ్చి సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకున్నారు. సౌలి ఖాద్ నది పొంగిపొర్లుతోంది. ధరంపూర్ సబ్ డివిజన్‌లోని బస్ డిపో పూర్తిగా నీట మునిగింది. దీంతో అనేక బస్సులు నీట మునిగాయి. బస్టాండ్ సమీపంలో ఉన్న కార్లు, ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. అనేక ఇళ్లు నీట మునిగాయి. అప్రమత్తమైన అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకూ ఎలాంటి మరణాలూ సంభవించలేదని అధికారులు తెలిపారు.

## వరదలో కొట్టుకుపోయిన ట్రాక్టర్

### డెహ్రాడూన్‌లో భారీ వర్షాలకు 10 మంది గల్లంతు, గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు

**డెహ్రాడూన్, సెప్టెంబరు 16:** ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న కుండపోత వర్షాలవల్ల రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వరదనీరు పోటెత్తుతోంది. దీంతో ఉత్తరాఖండ్‌లోని పలు నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మంగళవారం డెహ్రాడూన్‌లోని నదిని దాటుతుండడానికి ప్రయత్నించగా వరద ఉధృతి పెరగడంతో ప్రమాదవశాత్తు నదిలో ట్రాక్టర్ బోల్తాపడింది. ట్రాక్టర్‌లో ఉన్న 10 మంది వరదనీటిలో గల్లంతయ్యారు. స్థానికులు వారిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ లాభం లేకుండా పోయిందని అధికారులు తెలిపారు. నదిలో కొట్టుకుపోయిన వారంతా కూలీలని, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గాలింపు చర్యలు కొన సాగుతున్నాయన్నారు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మరోప్రాంతంలో స్వర్ణ నదికి సమీపంలో వరదల్లో చిక్కుకున్న ఓ చిన్నారిని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కాపాడాయి. రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు డెహ్రాడూన్, ముస్సోరీ మాల్‌లోని పలు ప్రాంతాలు నీటమునగడంతో ప్రజలు వరదలో చిక్కుకుపోయారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల్లో భాగంగా సహాయక బృందాలు దాదాపు 400 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భారీ వర్షాల వల్ల అన్ని నదులు పొంగిపొర్లుతున్నాయని ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి తెలిపారు. 25నుంచి 30 చోట్ల రోడ్లు తెగిపోయాయని ఇళ్లు ప్రభుత్వ ఆస్తులు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. పరిస్థితులను అదుపులోకి తీసుకురావడానికి రెస్క్యూ బృందాలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

## గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం

### ఐక్యరాజ్యసమితి సంచలన నివేదిక



**న్యూయార్క్, సెప్టెంబరు 16:** గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడిందంటూ ఐక్యరాజ్యసమితికి చెందిన స్వతంత్ర దర్యాప్తు కమిషన్ సంచలన నివేదిక విడుదల చేసింది. 2023లో హమాస్‌తో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇజ్రాయెల్ బలగాలు గాజా పాలస్తీనీయులపై జాతి నిర్మూలనకు పాల్పడ్డాయని చెప్పడానికి బలమైన ఆధారాలున్నాయని నివేదిక పేర్కొంది. ఈ యుద్ధంలో ఇజ్రాయెల్ మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడిందని కమిషన్ ఆరోపించింది. అంతర్జాతీయ చట్టం ప్రకారం నిర్వచించిన ఐదు మారణహోమ చర్యల్లో నాలుగింటికి ఇజ్రాయెల్ పాల్పడిందని కమిషన్ తన 72 పేజీల నివేదికలో పేర్కొంది. ఒక వర్గానికి చెందిన వారిని చంపడం, వారికి తీవ్రమైన శారీరక, మానసిక హాని కలిగించడం, ఉద్దేశపూర్వకంగా ఆ సమూహాన్ని నాశనం చేసే పరిస్థితులను సృష్టిం చడం, జననాలను నిరోధించడం వంటి చర్యలు ఇందులో ఉన్నాయని వివరించింది. ఇజ్రాయెల్ నేతల వ్యాఖ్యలు, సైన్యం ప్రవర్తించినతీరే వారి జాతి నిర్మూలన ఉద్దేశానికి నిదర్శనమని కమిషన్ అభిప్రాయ పడింది. అయితే, ఈ నివేదికను ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించింది. ఇదొక వక్రీకరించిన, తప్పుడు నివేదిక అని కొట్టిపారేసింది. ఈ కమిషన్‌లోని నిపుణులు హమాస్ ప్రతినిధులుగా పనిచేస్తున్నారని ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ ఆరోపించింది. "వాస్తవానికి ఇజ్రాయెల్‌లో మారణహోమానికి ప్రయత్నిం చింది హమాస్. 1,200 మందిని చంపి, మహిళలపై అత్యాచారాలు చేసి, కుటుంబాలను సజీవ దహనం చేసిందని ఇజ్రాయెల్ గుర్తుచేసింది. ఈ నివేదిక నిరాధారమైనదని ఇజ్రాయెల్ సైనిక అధికారి ఒకరు తెలిపారు. 2023 అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయెల్‌పై అకస్మాత్తుగా దాడి చేసి సుమారు 1,200 మందిని చంపడంతో ఈ యుద్ధం మొదలైంది. దీనికి ప్రతిగా ఇజ్రాయెల్ గాజాపై సైనిక చర్య ప్రారంభించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు గాజాలో 64,905 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని అక్కడి ఆరోగ్య శాఖ చెబుతోంది. గాజాలో 90 శాతానికి పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయని, ఆరోగ్య, పారిశుద్ధ్య వ్యవస్థలు కుప్పకూలాయని, తీవ్ర ఆహార కొరత ఏర్పడిందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి 2021లో ఈ స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తు కమిషన్‌ను ఏర్పాటు చేసింది.



## రూ.60 కోట్ల కుంభకోణంలో బిపాసాబసు, నేహాధుపియాకు ఫీజులు ఇచ్చా!: రాజ్ కుంద్రా

**ముంబయి, సెప్టెంబరు 16:** బాలీవుడ్ నటి శిల్పా శెట్టి భర్త, వ్యాపారవేత్త రాజ్ కుంద్రాపై నమోదైన రూ.60 కోట్ల మోసం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో విచారణ ఎదుర్కొంటున్న రాజ్‌కుంద్రా డబ్బులో కొంత భాగాన్ని ప్రముఖ హీరోయిన్లు బిపాసా బసు, నేహా ధూపియాలకు ఫీజుల రూపంలో చెల్లించినట్లు చెప్పినట్లు సమాచారం. ముంబై పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఇఒడబ్ల్యూ) జరిపిన విచారణలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలుస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా ఇఒడబ్ల్యూ అధికారులు రాజ్‌కుంద్రాను సుమారు ఐదు గంటల పాటు ప్రశ్నించారు. ఈ సమయంలో హీరోయిన్లకు ఫీజులు చెల్లించినట్లు ఆయన పేర్కొన్నప్పటికీ, పలు కీలక ప్రశ్నలకు మాత్రం సమాధానం ఇవ్వకుండా మౌనంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయనను మరోసారి విచారించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ కేసులో రాజ్ కుంద్రాతో పాటు ఆయన భార్య శిల్పాశెట్టిపైనా దర్యాప్తు కొనసాగుతోందని ముంబై పోలీసులు అధికారికంగా వెల్లడించారు. అధికారులు జరిపిన దర్యాప్తులో మరిన్ని ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కుంద్రా కంపెనీ ఖాతాల నుంచి శిల్పా శెట్టి, బిపాసా బసు, నేహా ధూపియా సహా మొత్తం నలుగురు నటీమణుల బ్యాంకు ఖాతాలకు నేరుగా డబ్బు బదిలీ అయినట్లు ఆధారాలు లభించాయి. బాలాజీ ఎంటర్‌టైన్‌మెంట్‌కు కూడా లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఇప్పటివరకు అధికారులు సుమారు రూ.25 కోట్ల మేర ప్రత్యక్ష బదిలీలను ట్రాక్ చేశారు. ముఖ్యంగా పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) సమయంలో నగదు కొరత ఏర్పడినప్పుడు కంపెనీ నుంచి పలు అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు దర్యాప్తులో తేలింది.

## ఆపరేషన్ సింధూర్‌లో మసూద్ కుటుంబం ఛిద్రం

### జైషే మహ్మద్ తొలిసారి అంగీకారం



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 16:** పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న జైష్ ఏ మొహమ్మద్ ఉగ్రవాద సంస్థకు భారత్ చేతిలో గట్టి ఎదురుదెబ్బ తగిలిన విషయాన్ని ఆ సంస్థ తొలిసారిగా బహిరంగంగా అంగీకరించింది. భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా పాకిస్థాన్‌లోని బహావల్‌పూర్‌లో జరిపిన వైమానిక దాడిలో తమ అధినేత మసూద్ అజహర్ కుటుంబ సభ్యులు మరణించినట్లు ధృవీకరించింది. ఈమేరకు జైష్ అగ్ర కమాండర్లలో ఒకరైన మసూద్ ఇలియాస్ కశ్మీరీ మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. మే 7వ తేదీన బహావల్‌పూర్‌లోని జైష్ ప్రధాన కార్యాలయం జామియా మసీదు సుభాన్ అల్లాపై భారత బలగాలు జరిపిన దాడిలో మసూద్ అజహర్ కుటుంబం తీవ్రంగా నష్టపోయిందని ఆ కమాండర్ పేర్కొన్నాడు. "మే 7న భారత బలగాలు మోలానా మసూద్ అజార్ కుటుంబాన్ని ఛిద్రం చేశాయి" అని కాశ్మీరీ ఆ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ దాడిలో అజహర్ సోదరి, ఆమె భర్త, మేనల్లుడు, మేనకోడలు, ఇతర సమీప బంధువులు మొత్తం 10 మంది మరణించినట్లు సమాచారం. వారితో పాటు అజహర్ ప్రధాన అనుచరులైన నలుగురు సహాయకులు కూడా హతమయ్యారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో 26మంది మృతికి కారణమైన ఉగ్రదాడికి ప్రతీకారంగానే భారత్ ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టింది. బహావల్‌పూర్‌తో పాటు మరో ఎనిమిది ఉగ్రవాద శిబిరాలను కూడా భారత సైన్యం ధ్వంసం చేసింది. ఈ దాడిలో మసీదులోని ఒక డోమ్ దెబ్బతిన్నట్లు, లోపల తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. అయితే, ఈ దాడి గురించి పాకిస్థాన్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. కానీ, అజహర్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపినట్లు ప్రత్యక్ష సాక్షులు, అంతర్జాతీయ మీడియా సంస్థలు నివేదించాయి. ఆకార్యక్రమానికి మసూద్ అజహర్ కూడా హాజరై కొద్ది నిమిషాల్లోనే అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. మసూద్ అజహర్, 2016 పఠాన్‌కోట్, 2019 పుల్వామా దాడుల వెనుక ప్రధాన సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. తాజా నిఘా సమాచారం ప్రకారం, అజహర్ ప్రస్తుతం తన స్థావరమైన బహావల్‌పూర్‌కు వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉన్న పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని గిల్గిత్ బల్టిస్థాన్ ప్రాంతంలో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. అక్కడి స్కర్దు ప్రాంతంలో అతని కదలికలను గుర్తించారు. అజహర్ ఆఫ్ఘనిస్థాన్‌లో ఉండవచ్చని గతంలో పాక్ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ చేసిన వ్యాఖ్యలకు ఈ సమాచారం విరుద్ధంగా ఉంది.

## 25న ట్రంప్‌తో పాక్ ప్రధాని భేటీ

### మూడోసారి అమెరికా వెళుతున్న పాక్ ఆర్మీచీఫ్



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 16:** ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి మావేశాలుప్రారంభం అవుతున్న క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ పాక్ ప్రధాని షెహబాజ్‌షరీఫ్, ఆర్మీచీఫ్ ఆసిమ్ మునీర్‌లతో భేటీ కానున్నారు. ఈనెల 25న ఇద్దరు పాక్‌నేతలు ట్రంప్‌తో చర్చలు జరుపుతారని పాక్ మీడియా స్పష్టంచేసింది. పాకిస్తాన్‌లో తీవ్రమైన వరదలు, ఖతార్‌పై ఇజ్రాయెల్ దాడి తదితర అంశాలు చర్చకు రావచ్చని అంచనా. భారత్‌తో దౌత్యపరమైన ఉద్రిక్తతలు కూడా ఈసమావేశంలో చర్చకువస్తాయనిపాక్ మీడియా చెపుతోంది. ఈనెల 23నుంచి 29 వరకూ ఐక్యరాజ్యసమితి సమావేశాలుప్రారంభం కానున్న నేపథ్యంలో వీరిద్దరితోభేటీ ఇపుడు చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ భేటీ ట్రంప్ వాణిజ్య ధోరణుల్లోనే చూస్తారని, దౌత్యపరంగా కాదన్న విమర్శలు కూడా లేకపోలేదు. పాకిస్తాన్‌కు ఎదురవుతున్న తెహ్రీక్ ఇ తాలిబన్ దాడులు, బెలూచిస్తాన్ లిబరేషన్‌ఫ్రంట్ ఆర్మీ దాడులతో సతమతం అవుతోంది. దీనికితోడు ఇటీవల పాకిస్థాన్‌ను ఆకస్మిక వరదలు కుదిపేసాయి. అనేక ప్రాంతాలు వరదల్లో మునిగిపోయి ప్రజలకు అపారనష్టం కలిగించాయి. ఇపుడున్న పరిస్థితుల్లో పాకిస్తాన్‌కు ఐఎంఎఫ్ ప్రపంచబ్యాంకువంటి ఇతర అంతర్జాతీయ సంస్థల నిధులు అవసరం అవుతాయి. అలాగే ప్యారిస్‌లోని ఫైనాన్షియల్ టాస్క్‌ఫోర్స్ ఆంక్షల నుంచి అధిగమించాలంటే పాక్‌కు అమెరికా సాయం అత్యవసరం. భారత్‌తో నెలకొన్న దౌత్య పరమయిన వివాదాలు పరిష్కరించుకోవాలన్నా అమెరికా సాయం అత్యవసరం ఏకైక మార్గంగా భావిస్తోంది. అందుకోసమే సమితిసమావేశాల సందర్భంగా పాక్ ప్రధాని షరీఫ్ ట్రంప్‌తో భేటీకి సిద్ధం అవుతున్నారు. ఇందుకు ట్రంప్‌కూడా సానుకూలంగా ఉన్నారు. భారత్‌ను దారిలోకి తెచ్చుకోడానికి అవసరమైన అన్ని జిమ్మిక్కులు ప్రయోగిస్తున్న ట్రంప్ ఇపుడు పాక్‌ను ఒక బూచిగాచూపించి భారత్‌ను తన దారిలోకి తెచ్చుకుని వాణిజ్య ఒప్పందంపై ఏకపక్షంగా ఆమోదం తెచ్చుకోవాలన్న కుతూహలంతో ఉన్నారు. ఇదేమీ దౌత్యబంధం కాదని, వాణిజ్య పరమైన బంధాలేనని నిపుణుల అంచనా. మూడోసారి మునీర్ అమెరికా పర్యటనలో రక్షణ రంగ బంధం మరింత బలోపేతం చేసుకోడానికేనని తెలుస్తోంది. అటు ఆఫ్ఘన్‌వైపునుంచి తాలిబన్ తెహ్రీక్ దాడులు, బెలూచిస్తాన్ దాడులను అరికట్టాలంటే అమెరికాసాయం తప్పనిసరి అని భావిస్తున్న పాక్‌ను అమెరికా ఇపుడు సులువుగా తన చెప్పుచేతల్లో ఉంచుకని భారత్‌పై ప్రయోగించేందుకు ట్రంప్ యంత్రాంగం వెనుకాడదని సర్వత్రా వినిపిస్తోంది.

## హ్యాంబర్గర్, ఐస్‌క్రీమ్, కరావోకే పదాలునిషేధం: కిమ్

**ప్యాంగ్యాంగ్, సెప్టెంబరు 16:** ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ మరోసారి తన విచిత్రమైన నిర్ణయాలతో ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. తమ దేశంలో పాశ్చాత్య సంస్కృతి ప్రభావం ఉండకూడదన్న ఉద్దేశంతో హ్యాంబర్గర్, ఐస్‌క్రీమ్, కరావోకే వంటి సాధారణ పదాల వాడకంపై నిషేధం విధించారు. విదేశీ, ముఖ్యంగా దక్షిణ కొరియా పదజాలం స్థానంలో దేశీయ పదాలను మాత్రమే ఉపయోగించాలని కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం ఇకపై హ్యాంబర్గర్‌ను రొట్టెల మధ్య రుబ్బిన గొడ్డు మాంసం అని పిలవాలి. అలాగే ఐస్‌క్రీమ్‌ను ఎసుకిమోగా, కరావోకేను తెరపై సంగీత పరికరంగా వ్యవహరించాలి. ముఖ్యంగా వోన్సన్ బీచ్ రిసార్టులో పనిచేసే టూరిస్ట్ గైడ్లకు ఈ విషయంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు డైలీ ఎన్‌కే అనే వార్తా సంస్థ నివేదించింది. పర్యాటకులతో మాట్లాడేటప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన పదాలనే తప్పనిసరిగా వాడాలని వారికి స్పష్టం చేశారు.

## అసోం మహిళా అధికారి ఇంట్లో నోట్లకట్టలు

### రూ.2 కోట్ల నగదు, బంగారం ఆభరణాలు స్వాధీనం



**గువాహటి, సెప్టెంబరు 16:** అసోంలో ఓ మహిళా ప్రభుత్వ అధికారి ఇంట్లో భారీగా అక్రమాస్తులు బయటపడ్డాయి. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై అసోం సివిల్ సర్వీస్ (ఎసిఎస్) అధికారిణి నుపూర్ బోరాను ముఖ్యమంత్రి ప్రత్యేక విజిలెన్స్ సెల్ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. గువాహటిలోని ఆమె నివాసంలో జరిపిన సోదాల్లో సుమారు రూ.2కోట్ల విలువైన నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకోవడం సంచలనం సృష్టిస్తోంది. విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గువాహటిలోని నుపూర్ బోరా ఇంట్లో జరిపిన తనిఖీల్లో రూ. 92 లక్షల నగదు, దాదాపు కోటి రూపాయల విలువైన బంగారు ఆభరణాలు లభించాయి. దీంతో పాటు, బార్‌పేటలో ఆమె అద్దెకు ఉంటున్న మరో ఇంట్లో సోదాలు చేయగా అదనంగా మరో రూ. 10 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోలాఘాట్‌కు చెందిన నుపూర్ బోరా 2019లో ఎసీఎస్ అధికారిణిగా విధుల్లో చేరారు. ప్రస్తుతం ఆమె కామ్రూప్ జిల్లాలోని గొరైమారిలో సర్కిల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ స్పందిస్తూ నుపూర్‌బోరాపై ఆరు నెలలుగా నిఘా ఉంచామని తెలిపారు. బార్‌పేట రెవెన్యూ సర్కిల్‌లో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు ఆమె డబ్బు తీసుకుని హిందువుల భూములను అనుమానాస్పద వ్యక్తులకు బదిలీ చేశారు. అందుకే ఆమెపై కఠినచర్యలు తీసుకున్నామని సిఎం వివరిం చారు. ఈ కేసులో భాగంగా నుపూర్ బోరాకు సహకరించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న బార్‌పేట రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే లత్ మండల్ సురజిత్ డేకా నివాసంలో కూడా విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహిం చారు. నుపూర్ బార్‌పేటలో సర్కిల్ ఆఫీసర్‌గా ఉన్నప్పుడు ఆమెతో కుమ్మక్కై సురజిత్ బార్‌పేటలో అనేక భూములను అక్రమంగా సంపాదించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

## సంక్షిప్తంగా..

### లిక్కర్ స్కాం: చత్తీస్‌గఢ్ మాజీ సిఎం కుమారుని అరెస్ట్



**చత్తీస్‌గఢ్, సెప్టెంబరు16:** మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో చత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్‌నేత భూపేశ్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్‌ను ఇడి అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తమ దర్యాప్తులో చైతన్య బఘేల్ రూ.1,000కోట్ల విలువైన మద్యం సిండికేట్‌ను నడిపినట్లు గుర్తించామన్నారు. ఈ సిండికేట్‌ను నిర్వహించడానికి దాని సభ్యులను అప్పటి ఐఎఎస్ అధికారి అనిల్, వ్యాపారవేత్త అన్వర్ ధేబర్‌సహకరించినట్లు ఇడి ఆరోపించింది. సిండికేట్ సేకరించిన అన్ని అక్రమ నిధుల ఖాతాలు, పంపిణీకి సంబంధించిన విషయాలను చైతన్య చూసుకునేవాడని ఇడి ఆరోపించింది. ఇక్కడ వచ్చిన ఆదాయాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు, పార్టీ కార్యకలాపాలకు వినియోగించేవాడని తెలిపింది. మరికొందరు రాజకీయ నేతలకు కూడా ఈ కుంభకోణంతో సంబంధం ఉందని త్వరలో వారిపైనా చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. ఈ కేసులో మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి నిందితుల మొబైల్ ఫోన్లను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది.

### ఆలయాలకు ఇచ్చే డబ్బు కల్యాణ మండపాల నిర్మాణానికి కాదు: సుప్రీం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** దేవాలయాలకు భక్తులు సమర్పించే డబ్బులు కల్యాణ మండపాల నిర్మాణానికి కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఆలయ నిధులను ప్రభుత్వ నిధులుగా పరిగణించలేమంటూ మద్రాస్ హైకోర్టుకు చెందిన మదురై బెంచ్ ఇటీవల ఇచ్చిన తీర్పుపై స్టే విధించేందుకు నిరాకరించింది. తమిళనాడులోని ఐదు దేవాలయాలకు చెందిన నిధులతో రాష్ట్రంలోని వివిధ ఆలయాల ప్రాంగణాల్లో కల్యాణ మండపాల నిర్మాణానికి అనుమతిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై పిటిషనర్లు మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ తమిళనాడు సర్కార్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'కల్యాణ మండపాల ఏర్పాటు కోసం భక్తులు తమ డబ్బును ఆలయాలకు ఇవ్వరు. ఆలయ అభివృద్ధి వంటి వాటికోసం ఇస్తుంటారు. ఒక ఆలయ ప్రాంగణంలో పెళ్లి జరుగుతుంటే అక్కడ అసభ్యకరమైన పాటలు ప్లే చేస్తుంటే.. అది సరైనదేనా? అని ప్రశ్నించింది. ఆ డబ్బును విద్య, వైద్యం వంటి దాతృత్వ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే బాగుంటుందని సూచించింది. తదుపరి విచారణను నవంబర్ 19కి వాయిదా వేసింది.

### అక్రమంగా వచ్చి నేరాలుచేస్తే ఉగాండా జైళ్లకు పంపిస్తా: ట్రంప్

**డల్లాస్, సెప్టెంబరు 16:** అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తే ఉగాండా, ఎస్వాటిని, సౌత్ సూడాన్‌లోని జైళ్లకు పంపిస్తామని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. స్వదేశాలలో నేరాలు చేసి పారిపోయి తమ దేశంలోకి వస్తున్నారని అక్రమ వలసదారులపై ఆయన మండిపడ్డారు. అమెరికాలోకి వచ్చి మళ్లీ నేరాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బైడెన్ సర్కారు అవలంభించిన విధానాల వల్ల నేరస్థులు అమెరికాగడ్డపై స్వేచ్ఛగా తిరుగుతున్నారని విమర్శించారు. డల్లాస్‌లో భారత సంతతికి చెందిన నాగమల్లయ్య దారుణహత్యపై స్పందిస్తూ ట్రంప్ ఈవ్యాఖ్యలు చేశారు. నాగమల్లయ్యను చంపిన హంతకుడు యోర్డానిస్ కోబోస్ మార్టినెజ్ క్యూబా పౌరుడని, అమెరికాలోకి అక్రమంగా వచ్చాడని తెలిపారు. గతంలో చిన్నపిల్లలపై అఘాయిత్యం, వాహనాల దొంగతనంకేసులో మార్టినెజ్‌ను పోలీసులు జైలుకు పంపించారని చెప్పారు. అయితే, బైడెన్ ప్రభుత్వ విధానాల వల్ల మార్టినెజ్ జైలు నుంచి విడుదలయ్యాడని, తాజాగా నాగమల్లయ్యను హత్య చేశాడని తెలిపారు.

### న్యూయార్క్‌టైమ్స్‌పై ట్రంప్ రూ.1.25 లక్షలకోట్ల పరువునష్టం దావా



**వాషింగ్టన్, సెప్టెంబరు 16:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, దేశంలోని ప్రముఖ మీడియా సంస్థల్లో ఒకటైన న్యూయార్క్ టైమ్స్‌పై న్యాయపోరాటానికి దిగారు. దశాబ్దాలుగా ఆ పత్రిక తనపై ఉద్దేశపూర్వకంగా అబద్ధపు ప్రచారం చేస్తోందని ఆరోపిస్తూ, ఏకంగా 15 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 1.25 లక్షల కోట్లు) పరువు నష్టం దావా వేశారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా స్వయంగా ప్రకటించారు. ఫ్లోరిడా రాష్ట్రంలోని కోర్టులో ఈ దావాను దాఖలు చేసినట్లు ట్రంప్ తెలిపారు. న్యూయార్క్ టైమ్స్ పత్రిక రాడికల్ లెఫ్ట్ డెమొక్రాటిక్ పార్టీకి అధికారిక గొంతుకగా మారిపోయిందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. తనపై, తన కుటుంబంపై, తన వ్యాపారాలపై, అలాగే అమెరికా ఫస్ట్, మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) ఉద్యమాలపై ఆ పత్రిక నిరంతరం అబద్ధాలు ప్రచురిస్తోందని ఆరోపించారు.

17-09pg6exHMNWJQEP 10_17-09pg6exHMNWJQEP.qxd 9/17/2025 12:09 AM Page 1



# పట్టణాభివృద్ధి, గ్రామీణ అనుసంధానం, నరేగాలో అద్భుతమైన విజయాలు

## -పురపాలక , పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్

## - డిసెంబర్ చివరికి అన్ని పశువుల షెల్టర్లు పూర్తి

**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** పట్టణాభివృద్ధి గ్రామీణ సంధానం, (మహాత్మాగాంధీ జాతీమనరేగాల్లో అద్భుత విజయాలు సాధించినట్లు పురపాలక , పట్టణాభివృద్ధి శాఖ గ్రామీణ మోలిక వసతుల సురేష్ కుమార్ తెలిపారు.జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ తొమ్మిది కీలక పట్టణ సేవలను కవర్ చేసే బలమైన సర్వీస్ లెవల్ ఇండికేటర్స్ ఫ్రేమ్‌వర్క్ అమలు చేశామని వివరించారు. విశాఖపట్నం జిల్లా 85 పాయింట్లతో టాప్ పర్ఫార్మర్‌గా నిలిచిందని, నీటి సరఫరా, చెత్త సేకరణ .వ్యర్థాల ప్రాసెసింగ్‌లో 100 కవరేజ్ సాధించిందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా (80 పాయింట్లు) మరియు తిరుపతి (72 పాయింట్లు) వరుసగా రెండవ మరియు మూడవ స్థానాలను దక్కించుకున్నాయని చెప్పారు. ప్రస్తుత రాష్ట్రవ్యాప్త పనితీరు గురించి మాట్లాడుతూ, నీటి సరఫరా 64.2 కవరేజ్‌తో 24.70 లక్షల ఫంక్షనల్ హౌస్ ట్యాప్ కనెక్షన్లు ఉన్నాయని, ఇంటింటికీ చెత్త సేకరణ 95.1 వద్ద ఉందని, సైంటిఫిక్ వేస్ట్ ప్రాసెసింగ్ 54.2 వద్ద ఉందని వివరించారు. అమృత్, ఏఐఐబీ, యూఐడీఎఫ్ వంటి వివిధ పథకాలలో 409 ప్రాజెక్టులతో ..15,471 కోట్ల విలువైన సమగ్ర నిధుల వ్యూహం ద్వారా 2029 నాటికి అన్ని సూచికలలో 100 సేవా అందుబాటును లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. పీపీపీ మోడ్‌లో ఆరు ప్రధాన వేస్ట్‌టుఎనర్జీ ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని, 84 మెగావాట్ సామర్థ్యంతో 80 యూఎల్‌బీలలో 4,693 టీపీడీ వ్యర్థాలను నిర్వహిస్తుందని వివరించారు. నాలుగు ప్రాజెక్టులకు లెటర్ ఆఫ్ అవార్డ్ లభించిందని, యూనిట్‌కు ..7.50 నుంచి ..8.10 వరకు పోటీ టేరిఫ్‌లు ఉన్నాయని తెలిపారు. మనరేగా కింద రాష్ట్రం 15.28 కోటి వ్యక్తి దినాలు సృష్టించిందని (ఆమోదించిన బడ్జెట్‌లో 102 ), ..6,057.84 కోట్ల వ్యయంతో 63.60 లక్షల మందికి ఉపాధిని అందించిందని సురేష్ కుమార్ గారు తెలిపారు. పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో బలమైన పురోగతి కనిపిస్తోందని, 1.02 లక్షల ఫార్మ్ పాండ్లు పూర్తయ్యాయని (102 సాధన), 15,188 పశువుల తొట్లు (101 సాధన), మరియు 20,204 పశువుల షెల్టర్లు (81 సాధన) జిల్లాలలో పూర్తయ్యాయని వివరించారు గ్రామీణ కనెక్టివిటీ చర్యలు 4,563.92 కిలోమీటర్లకు విస్తరించి, వివిధ పథకాలలో ..3,714.74 కోట్ల విలువ కలిగి ఉన్నాయని తెలిపారు."అడవి తల్లి బాట" కార్యక్రమం కింద 1,483 కనెక్ట్ కాని గిరిజన వసతులకు కనెక్టివిటీని మనరేగా, పీఎం జన్‌మన్ మరియు పీఎంజీఎస్‌వై ౹జు ద్వారా ..2,850.53 కోట్ల మొత్తం పెట్టుబడితో ప్లాన్ చేశామని వివరించారు. జల్ జీవన్ మిషన్‌లో గణనీయమైన పురోగతి కనిపిస్తోందని, 25,444 ఎస్వీఎస్ పనులు పూర్తయ్యాయని మరియు 16,396 పనులు పురోగతిలో ఉన్నాయని, మార్చి 2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మూడు కొనసాగుతున్న ఎమ్‌వీఎస్ పనులలో ఉద్దనం ప్రాజెక్ట్ పూర్తయిందని, ధోనే మరియు పులివెందుల ప్రాజెక్టులు నవంబర్ 2025 నాటికి పూర్తవుతాయని వివరించారు. రాష్ట్రం 18 యూడీఏలలో 1,343.83 ఎకరాలను కవర్ చేస్తూ 78 భూ పార్సెల్లను పీపీపీ అభివృద్ధి కోసం గుర్తించిందని, 33 సైట్లు మంచి అభివృద్ధి సామర్థ్యాన్ని చూపుతున్నాయని తెలిపారు.



విద్యార్థుల గదులను పరిశీలిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

# గురుకుల పాఠశాలల్లో విద్యార్థులంతా క్షేమం

## - సరస్వతీ నిలయాలకు కేంద్రాలుగా ఆత్మకూరు నియోజకవర్గం - విద్యార్థుల ఆరోగ్య భద్రతకు మెరుగైన చర్యలు తీసుకున్నాం - దేవాదాయ మంత్రి ఆనం

**ఆత్మకూరు (నెల్లూరు), సెప్టెంబరు 16, ప్రభాతవార్త :** ఆత్మకూరు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున విద్యాలయాలను నెలకొల్పి సరస్వతీ నిలయాలకు కేంద్రంగా తీర్చిదిద్దామని రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను మంత్రి సందర్శించారు. గురుకుల పాఠశాలలోని హాస్టల్ గదులు, భోజనశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్లో వసతి, భోజనం, పరిశుభ్రత తదితర అంశాలను వారినడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య సమాచారాన్ని మంత్రికి వైద్యులు వివరించారు. ఈసందర్భంగా మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ గత వారం రోజుల క్రితం గురుకుల పాఠశాలలో జ్వరాలు ప్రబలిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమై విద్యార్థులకు వైద్య సేవలు అందించి పరిస్థితిని చక్కదిద్దామన్నారు. ప్రస్తుతం విద్యార్థులందరూ ఆరోగ్యంగా ఉన్నారని, తిరిగి పాఠశాలకు వస్తున్నారన్నారు. ఆత్మకూరు జిల్లా ఆసుపత్రిలో నిరంతరం వైద్యులు విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వైద్య చికిత్స అందించారన్నారు. కొంతమంది విద్యార్థులకఉ భరోసా కల్పించేందుకు అన్ని రకాల మందులు ఇచ్చితమ తల్లిదండ్రుల వద్దకు పంపామన్నారు. గురుకుల పాఠశాలలో ఓ ఒక్క విద్యార్థికి కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. వైద్యుల సూచనల మేరకు తాజా కూరగాయలు, ఆకు కూరలతో వండిన ఆహార పదార్థాలను, పాలను కూడా ప్రతిరోజు అందిస్తున్నారన్నారు. ఎక్కడా రాజీ పడకుండా విద్యార్థుల ఆరోగ్యభద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మినరల్‌వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామన్నారు. ఇక్కడ ఉన్న డంపింగ్ యార్డ్‌ను ఊరికి దూరంగా ఏర్పాటు చేసి యార్డ్‌కు తరలించేలా అధికారులను ఆదేశించామన్నారు. ప్రహరీగోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని , సోలార్‌హీటర్లు కూడా ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నామన్నారు. బాలికల విద్యాభివృద్ధికి కృషి చేస్తూ పెద్ద ఎత్తున ప్రభుత్వ విద్యాలయాలను నెలకొల్పి ఆత్మకూరు నియోజకవర్గాన్ని సరస్వతీ నిలయంగా మార్చినట్లు చెప్పారు. బిసి , ఎస్సీ, ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలు, కళాశాలలను తమ హయాంలో ఏర్పాటు చేసినట్లు మంత్రి గుర్తుచేశారు. 1నుంచి10వ తరగతి వరకు ఆత్మకూరు నియోజకవర్గంలో 31వేల మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకుంటున్నారని, 408 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నా యన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రెండు మోడల్ స్కూల్స్, గురుకుల రెసిడెన్షియల్ విద్యాలయం, బాలికల రెసిడెన్షియల్ విద్యాలయాలు-2, బిసి రెసిడెన్షియల్ స్కూల్-1, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ -1, గవర్నమెంట్ ట్రైబల్ డిపార్ట్‌మెంట్ ప్రైమరీ స్కూల్-1, కెజిబివి-2, మండల పరిషత్, జిల్లాపరిషత్ పాఠశాలలు -391, నవోదయ విద్యాలయం , ప్రవేట్ (అన్‌ఎయిడెడ్'-44, స్టేట్ గవర్నమెంట్ పాఠశాలలు - 3 ఉన్నాయని, మోడల్ స్కూల్, సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్, పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలలున్నాయన్నారు.

# సైబర్ నేరగాళ్ల వలలో యోగా మాస్టర్

## - ఫేక్ ట్రేడింగ్ కంపెనీలో రూ.11,99,000 మోసం

**తిరుపతిరూరల్,సెప్టెంబర్16 ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల వలలో పడి ప్రవేట్ యోగా మాస్టర్ భారీగా మోసపోయిన ఘనటన తిరుపతిరూరల్ మండలం పేరూరులో చోటు చేసుకుంది. సైబర్ మోసగాళ్లు యోగ మాస్టర్‌చే ఫేక్ ట్రేడింగ్ కంపెనీలో ఇన్వెస్ట్‌మెంట్ రూ.11,99,000 రుపాయాలు చేయించి, రిటర్న్ తిరిగి అడగ్గానే ఇన్వెస్ట్‌మెంట్ డబ్బులను కాజేసినట్లు తిరుపతిరూరల్ పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు అందినట్లు సి.ఐ. చిన్న గోవిందు తెలిపారు. 2025 ఆగష్టు నెలలో హేమాంగి డేట్ అనే వ్యక్తి వాట్సప్ ద్వారా 'బికెఐఎన్ ఎస్వీపి1'కమ్ అనే లింక్ పంపి, ఐసిఐసిఐ సెక్యూరిటీస్ పేరుతో నకిలీ ట్రేడింగ్ యాప్‌లో ఇన్వెస్ట్ చేయమని ప్రలోభపెట్టాడు. ఫిర్యాదుదారుడు ఫోన్ ఫే, ఆర్టిజిఎస్ మార్గాలలో రూ.11,99,000 రుపాయాలు వివిధ అకౌంట్లకు బదిలీ చేసారు. మొదటి కొంత లాభం చూపించి, విశ్వాసం సంపాదించిన తర్వాత రూ.26,41,304 రుపాయాలు లాభం వచ్చినట్టు చూపి, విత్ డ్రా చేసుకోవాలంటే 20శాతం కమీషన్ చెల్లించాలంటూ మరింత డబ్బు అడిగారు. ఐసిఐసిఐ బ్యాంక్‌ను ఫిర్యాదుదారుడు సంప్రదిస్తే, ఆ యాప్ ఫేక్ అని తెలుసుకుని, వెంటనే సైబర్ క్రైమ్ నెంబర్ 1930, తిరుపతిరూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసాడు. ఈ మేరకు తిరుపతిరూరల్ పిఎస్ ఇన్‌స్పెక్టర్ టి.చిన్నగోవింద్ ఆధ్వర్యంలో సిఆర్ నెంబర్ 488/2025 కింద కేసు నమోదు చేసి, మోసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులపై ఐపిసి 419,420 సెక్షన్స్ కింద కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# టీచర్ ధాష్టీకానికి తలపగిలిన విద్యార్థిని

## పుంగనూరులో దారుణం

**పుంగనూరు, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** తరగతి గదిలో అల్లరి చేస్తోందని ఆరో తరగతి విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయుడు తల పగలగొట్టిన సంఘటన ఈనెల 10న జరిగింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణంలోని తాటి మాకుల పాలెంలో గల స్కూల్ లో స్వాతికా నాగశ్రీ ఆరవ తరగతి చదువుతున్నది. విద్యార్థిని తండ్రి హరి ప్రసాద్ ఇదివరకే మృతి చెందడంతో అదే పాఠశాలలో స్వాతిక నాగశ్రీ తల్లి విజేత ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నది. కాగా ఈనెల 10వ తేదీన నాగశ్రీ తన పుస్తకాల సంచిలో టిఫిన్ డబ్బా పెట్టుకుని బడికి వచ్చింది. హిందీ పీరియడ్ సమయంలో బాలికను మందలించేందుకు టీచర్ సలీం భాషా క్యారీ బ్యాగ్ తో విద్యార్థిని తలపై కొట్టాడు. క్యారీ బ్యాగ్ లో టిఫిన్ బాక్స్ ఉండడంతో నాగశ్రీ తలపై బలమైన దెబ్బ తగిలింది. ఈ ఘటనలో బాలిక తలకు తీవ్ర రక్తస్రావం ఆమె కింద పడిపోయింది.కాగాకొట్టడంతో విద్యార్థినికి ఫిట్స్ వచ్చి కింద పడిపోయింది. వెంటనే స్వాతిక నాగశ్రీని స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు .విద్యార్థిని పరిస్థితి తీవ్రం కావడంతో మదనపల్లి కు తరలించారు. స్కానింగ్ లో బాలిక తల కపాలం చిట్లి పోయి నొక్కుబడినట్లు తెలిసింది. ఘటనపై విద్యార్థిని తల్లి స్కూల్ ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం కు ఫిర్యాదు చేయగా ఆయన బాలికతల్లితో ఎటకారంగా మాట్లాడారని బాలిక తల్లి వాపోయింది. ఈ ఘటనపై బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన జరిగి ఏడు రోజులు కావస్తున్నప్పటికీ, పాఠశాల యాజమాన్యం బాలిక ఆరోగ్య పరిస్థితి పట్ల బాధ్యతాయుతంగా ప్రవర్తించక పోగా, తమ కుటుంబం పై దారుణ వ్యాఖ్యానాలు చేస్తున్నారని బాలిక తల్లి విజేత ఆరోపించారు. మంగళవారం ఉదయం ఆమె పాఠశాల వద్దకు చేరుకుని తమ కుమార్తెను తీవ్రంగా గాయపరిచిన పాఠశాల యధావిధిగా పాఠశాల నడపడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో ఈ ఘటన వివరాలు తెలుసుకునేందుకు అక్కడికి వచ్చిన ఇంచార్జ్ మండల విద్యాశాఖ అధికారి నటరాజ్ బాలిక తల్లి విజేతను అడిగి వివరాలు తెలుసుకున్నారు. తన కుమార్తెను ఉపాధ్యాయుడు సలీం భాష తీవ్రంగా గాయపరిచినప్పటికీ పాఠశాల యాజమాన్యం స్పందించలేదని ఫిర్యాదు చేశారు. బాలిక ఆరోగ్య పరిస్థితి ఆందోళన కరంగా ఉందని ఆమె అధికారులకు తెలిపారు.



బాలిక తల్లి విజేతను పాఠశాల వద్ద విచారిస్తున్న మండల విద్యాశాఖ అధికారి.

# ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యత పై రాజకీయ కుట్ర

## మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త):** ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యత పై దేశవ్యాప్తగా అతి పెద్ద రాజకీయ కుట్రను మోడీ బిజెపి చేస్తుందని నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ మాల మహానాడు అండ్ రాక్స్ అద్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ విమర్శించారు. రాజమండ్రిలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎస్సీ వర్గీకరణను శాంపుల్ గా పంజాబ్ హర్యానాలో మొట్టమొదటిగా ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే చేసిందని బీజం కాంగ్రెస్ పార్టీ వేస్తే దీన్ని దేశం మొత్తం చేశారు మన మోడీ సాబ్, నిజానికి ఎస్సీ వర్గీకరణ వల్ల వందలో నలుగురికే మంచి జరుగుతుంటే ఈ వందలో నలుగురికి ఇచ్చే ఈ ఫలాలను దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారు మోడీ అని రత్నాకర్ ప్రశ్నించారు. అలాగే ఈ నాలుగు సీట్లను తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలకు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఎలా పంచుతారు. ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు మాల సామాజిక వర్గం పై ప్రగతించుకుంటే మాలల హోల్సేల్ మేనమామ మాలలకు అన్యాయం జరుగుతున్న ముద్దులతో సరిపెట్టేసాడు తప్ప ఈనాటికీ స్పందించలేదని వాపోయారు. ఎస్సీ వర్గీకరణ చట్టాలు అయిపోయినవి కదా ఇక చేసేదేముందని అనుకోకండి మిత్రులారా ప్రజలు తలుచుకుంటే ఏ చట్టాలైన ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందే తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తూ ఉంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం ఘోరం అన్యాయం చెంచా గిరికి అలవాటు పడ్డ మాల నాయకులు రాజకీయ పార్టీలకు విశ్వాసంగా ఉన్నారే తప్ప జాతి పట్ల విశ్వాసంగా లేరన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని రత్నాకర్ సూచించారు. రిజర్వేషన్లు బెనిఫిట్ పొందిన మాల ఉద్యోగులారా మాల జాతిని తొక్కేస్తూ ఉన్నారు ఇకనైనా కళ్ళు తెరిచి బయటకు రండి మా ఈ పోరాటానికి మద్దతు ఇవ్వండి తెలుగు రాష్ట్రాల్లో ఏనాడు ఎదుర్కొనటువంటి గడ్డు పరిస్థితిని మాల సామాజిక వర్గం ఈరోజు ఎదుర్కొంటూ ఉంది. పూర్తిగా తెలుగు రాష్ట్రంలో మన కులం యొక్క ఉనికిని కోల్పోయాం శాంతియుత పోరాటానికి సిద్ధం కండి మిత్రులారా అంటూ రత్నాకర్ పిలుపు ఇచ్చారు.

## ఇంద్రకీలాద్రిలోదసరా ఏర్పాట్లు పరిశీలించిన కమిషనర్, ఇఒ

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ వారి ఆలయంలో ఈ నెల 22 నుండి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి కావాల్సిన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగు తున్నాయి. ఈ ఏర్పాట్లను మంగళవారం కమీషనర్ కె రామచంద్ర మోహన్, ఇఒ వికె శీనా నాయక్ అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే కనకదుర్గానగర్, కొత్తలడ్డూపోటు, అన్నదాన భవనం లను కూడా పరిశీలించారు. ఘాట్‌రోడ్డు, ఘాట్‌రోడ్డుపై వున్న క్యూలైన్లు, చెప్పులస్టాండ్, వృద్ధులకు ఏర్పాటు చేసిన బ్యాటరీ కార్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ద్వారకా తిరుమల దేవస్థానం డివి భాస్కర్, పెనుగంచిప్రోలు దేవస్థానం ఇఇ ఎల్ రమ, దుర్గమ్మవారి ఆలయ ఇంజనీర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# మరణించినా 6 గురికి పునర్జన్మ

## - ఆయువు పోతున్నా ఆదర్శం - అవయవదానంతో ఆరుగురికి పునర్జన్మ ఇచ్చిన పవన్ అభిమాని



నవీన్ (ఫైల్‌ఫోటో)

**చిలమత్తూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త :** శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం తుమ్మలకుంట గ్రామానికి చెందిన పవన్‌కళ్యాణ్ వీరాభిమాని నవీన్ (21) ఇటివలే చిలమత్తూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం బెంగుళూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ రెండు రోజులు మృత్యువుతో పోరాడిన నవీన్ సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచాడు. వైద్యులు బ్రెయిన్ తప్ప అన్ని అవయవాలు బాగున్నాయని తెలిపారు. మరణించిన ఆ యువకుడు మరో 6 గురికి పునర్జన్మ కల్పించాడు. ఆ తల్లికి ఉన్నది ఒక్కడే కుమారుడు. ఆమె భర్త కుమారుడు 3 నెలల బిడ్డగా ఉన్నప్పుడే మరణించాడు. అప్పటి నుండి తల్లి గీతా అన్నీ తానై కొడుకుని కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఇటివలే నవీన్ కూడా బొలెరో వాహనం కొనుగోలు చేసి కుటుంబ పోషనకు అండగా నిలిచాడు. ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదం కారణంగా మరణించాడు. తన కుమారుడు మరణాన్ని తట్టుకొని ఆదర్శంగా ఆలోచించిన తల్లి తన బిడ్డ అవయదానానికి అంగీకరిస్తూ దానం చేసి ఆరుగురికి ఆయువు పోసింది. తన బిడ్డ చనిపోతూ 6 గురికి ఆయువుపోశాడు అంటూ కన్నీరు మున్నీరైంది. నిత్యం మెగా కుటుంబం ముఖ్యంగా పవన్‌కళ్యాణ్ అభిమానిగా వుంటూ అనేకమార్లు జనసేన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే నవీన్ తన తల్లి దాతృత్వానికి జనసేన నాయకులుగా గర్వపడుతూ తన ఆత్మకు శాంతి కలగాలని కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించాలని జనసేన మండల కమిటితో పాటు మానవతావాదులు, మండల ప్రజలు తల్లి రుణం ఈ జన్మకు తీర్చుకోలేమని, వారి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# రాష్ట్రంలో పారదర్శకమైన భూసేవలు,డిజిటల్ రికార్డులు

## - రెవెన్యూ నోడల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మీ

**సచివాలయం,సెప్టెంబర్ 16,ప్రభాతవార్త :** చట్టబద్ధమైన పట్టాల పంపిణీ,వేగవంతమైన మ్యూటేషన్,భూ వివాదాల పరిష్కారం వంటి అంశాలపై రెవెన్యూ శాఖ దృష్టి సారించినట్లు రెవెన్యూ మెడల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మీ తెలిపారు.మంగళవారం రెండోరోజు కలెక్టర్ సదస్సులో భాగంగా మాట్లాడుతూ వీటి ద్వారా ప్రజల విశ్వాసం పెరగడంతోపాటు వ్యవసాయానికి,పెట్టుబడులకు అనుకూలమైన భూముల పరిపాలన వ్యవస్థ ఏర్పడుతోందన్నారు.ప్రజల నుండి పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రస్సల్ సిస్టం ద్వారా వచ్చే ఫిర్యాదుల్లో 70శాతం వరకు ఫిర్యాదుల రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉండేవని వాటి సంఖ్యను తగ్గించేందుకు జిల్లాల వారీగా వర్క్‌షాపులను నిర్వహించామని చెప్పారు.2.5లక్షల ఫిర్యాదులకు గాను 2.15లక్షల ఫిర్యాదులను అనగా 84.5శాతం పరిష్కరించగా 39,712ఫిర్యాదులు అనగా 15.58శాతం ప్రొగ్రెస్‌లో ఉన్నట్లు తెలిపారు.అన్ని ఫిర్యాదులను జిల్లాల్లో నూరుశాతం ఆడిట్ చేయించడం జరుగుతోందన్నారు.మానిఫెస్టో అంశాలైన అందరికీ ఇళ్ళు కార్యక్రమానికి సంబంధించి 1.75లక్షల దరఖాస్తు చేయగా ఇప్పటివరకు 20,674ఆమోదించగా మరో లక్షా 2వేల దరఖాస్తులు పరిశీలనలో ఉండగా 52,501దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించడం జరిగిందన్నారు.మ్యూటేషన్ రిఫార్మ్స్ ద్వారా భూమి లావాదేవీల్లో పారదర్శకత పెరుగుతోంది.రిజిస్ట్రేషన్ తర్వాత భూ యజమాని పేరులో ఆటోమెటిక్‌గా మార్పులు జరిగే విధానాన్ని ప్రవేశపెట్టారు.దీని వలన అవినీతి అవకాశాలు తగ్గి,ప్రజలకు న్యాయం జరుగుతోంది.ఆదాయం పెంపు చర్యల్లో బాగంగా డిమాండ్ రిజి స్ట్రేషన్లు పెంచడం,అండర్ వాల్యూయేషన్ నియంత్రణ,పెండింగ్ రికవరీలు వసూలు చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు.

# మణిద్వీప మహాసంస్థానంలో 22 నుండి నవరాత్రి ఉత్సవాలు

**రాపూరు (నెల్లూరు), సెప్టెంబరు 16, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమంలోని మణిద్వీప మహా సంస్థానంలో కొలువైవున్న శ్రీ లలితాంబికా దేవికి 22వ తేది నుండి నవరాత్రి ఉత్సవాలనిర్వహించనున్నట్లు ఆశ్రమనిర్వాహకులు తెలిపారు. ఈ పెనుశిల క్షేత్రం గొప్ప తపోభూమి, ఋషులకు, దేవతలకు నిత్యనివాసిన ఈ క్షేత్రం ఇటువంటి క్షేత్రంలో వెలసివున్న శ్రీ లలితాంబికా మణిద్వీప నివాసిని, నిత్య సత్య, పరాకృతి ఆ మహాశక్తి శ్రీ లలితాంబికా దేవిని నవరాత్రులలో పూజించడం ద్వారా సకల కోరికలు సిద్దిస్తాయని భక్తుల నమ్మకం. దేవి నవరాత్రలలో శ్రీ లలితాంబికా దేవిని పూజించి, వివిధ దానధర్మాలు,చేయడం ద్వారా కలికే పుణ్యం అపారమని పెద్దలు చెపుతారు.



# మహిళా సాధికారతతోనే దేశ పురోభివృద్ధి

## - శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**తిరుపతిరూరల్,సెప్టెంబర్15 ప్రభాతవార్త:** మహిళా సాధికారతతోనే దేశ పురోభివృద్ధి సుసాధ్యమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. తొలి మహిళా సాధికారతపై పార్లమెంట్, శాసనసభ కమిటీల జాతీయ సదస్సు విజయవంతంగా పూర్తి చేయడంపై సంతృప్తి వ్యక్తం చేసారు. మహిళా సాధికారత సదస్సులో చేసిన తీర్మానాలు కొత్త ఆత్మ విశ్వసానికి శ్రీకారం చుట్టాయన్నారు. మహిళల సమాన హక్కులు, రాజకీయాలలో మరింత ప్రాతినిధ్యం విద్య, ఉపాధి, ఆర్థిక రంగాలలో అవకాశాలు, సురక్షిత సమాజ నిర్మాణం, ఇవన్నీ కేవలం నినాదాలు కావని, మనం సాధించాల్సిన లక్ష్యాలని పేర్కొన్నారు.

# పన్ను వసూళ్ల లో పారదర్శకత, టెక్నాలజీ వినియోగం అవసరం

## - రాష్ట్ర పన్నుల శాఖ చీఫ్ కమీషనర్ అహ్మద్ బాబు

**సచివాలయం,సెప్టెంబర్ 16,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కమర్షియల్ ట్యాక్స్ విభాగం ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటని,రాష్ట్ర ఖజానాకు పన్నులద్వారా వచ్చే ఆదాయం అభివృద్ధి కార్యక్రమాలకు ఆధారంగా నిలుస్తుందని రాష్ట్ర పన్నుల శాఖ కమీషనర్ అహ్మద్ బాబు తెలిపారు.మంగళవారం రెండో రోజు కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా జిఎస్టీ,విఏటి,ప్రొఫెషనల్ ట్యాక్స్,ఇతర వాణిజ్య పన్నుల ద్వారా ఆదాయం లభిస్తుందని తెలిపారు.జిఎస్టీ రిటర్నులు ఆన్‌లైన్ ఫైలింగ్,ఈవే బిల్లుల ట్రాకింగ్,ఈ-ఇన్వాయిసింగ్ వంటి విధానాలు విస్తృతంగా వినియోగంలో ఉన్నాయని తెలిపారు.టిడిఎస్ ఆన్ జిఎస్టీ కఠినంగా అమలు చేస్తున్నారు,ప్రభుత్వ విభాగాలు,పెద్ద కాంట్రాక్టులు,సప్లయి చెయిన్‌లలో టిడిఎస్ సేకరణ ద్వారా భారీ ఆదాయం లభిస్తుందని తెలిపారు.ఏపి వ్యాట్ రిఫార్మ్స్ ద్వారా పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిలు వసూలు చేయడానికి ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నారు.రికవరీల్లో ఆలస్యం జరగకుండా జిల్లావారీగా కలెక్టర్లు మానిటరింగ్ చేస్తున్నారని ఆయన తెలిపారు.ప్రొఫెషన్ ట్యాక్స్‌ను సమర్థవంతంగా వసూలు చేసేందుకు ఐటి ఆధారిత సాఫ్ట్‌వేర్ ఉపయోగిస్తున్నారని తెలిపారు.అనధికార వ్యాపారాలు,పన్ను ఎగవేతను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నారు.ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఇంటెలిజన్స్ ఆధారిత తనిఖీలు,ఇన్‌స్పెక్షన్‌లు నిర్వహిస్తున్నారు.

# ప్రజల ఆరోగ్యం, భద్రత, సామాజిక శ్రేయస్సు కోసం ఎక్సైజ్ విభాగం కీలక పాత్ర

## - ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా

**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మద్యపాన నిషేధం, ప్రజల ఆరోగ్యం, భద్రత, సామాజిక శ్రేయస్సు కోసం ఎక్సైజ్ విభాగం కీలకమైన పాత్ర పోషిస్తోందని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా అన్నారు.ఆయన జిల్లా కలెక్టర్ల సదస్సు రెండవ రోజైన మంగళవారం మాట్లాడుతూ. ఈ విభాగం ముఖ్యంగా మద్యపాన నియంత్రణ, అక్రమ మద్యం తయారీ నివారణ, మద్యం నాణ్యత పర్యవేక్షణ, డిజిటల్ పద్ధతుల వినియోగం వంటి అంశాలపై దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వం మద్యపానాన్ని తగ్గించేందుకు క్రమంగా చర్యలు తీసుకుంటోందని , రాష్ట్రంలో మద్యం షాపుల సంఖ్యను తగ్గించడం, బెల్ట్ షాపులను మూసివేయడం, వైన్ షాపుల పనివేళలు నియంత్రించడం వంటి చర్యలు చేపట్టబడ్డాయని తెలిపారు. దీని ద్వారా మద్యం లభ్యతను క్రమంగా తగ్గిస్తూ, సమాజంలో మద్యపాన అలవాటు తగ్గించాలనే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డిజిటల్ పేమెంట్స్ ప్రోత్సాహం ఈ విభాగంలో ఒక ముఖ్యమైన సంస్కరణ, వైన్‌షాపుల్లో నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించి పారదర్శకతను పెంచుతున్నారని తెలిపారు. ట్రాక్ అండ్ ట్రేస్ టెక్నాలజీ ద్వారా తయారీ యూనిట్ నుంచి వినియోగదారుల వరకు మద్యం సరఫరా గొలుసును పర్యవేక్షిస్తున్నారు. దీని వలన నకిలీ మద్యం, అక్రమ రవాణా తగ్గించవచ్చున్నారు అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నారు. ఇందులో కలెక్టర్లు, పోలీస్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు కలిసి చర్యలు తీసుకుంటున్నారన్నారు.

# కోటి.8 లక్షలతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

## ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



ఎమ్మెల్యేకు సత్కారం

**వెంకటాచలం (నెల్లూరు), సెప్టెంబరు 16, ప్రభాతవార్త :** వెంకటాచలం మండలంలోని చెమ్ముడుగుంట పంచాయతీలోని గురాన్‌పూరు,నక్కల కాలనీ,పవన్ కాలనీ చెమ్ముడు గుంట గ్రామాల్లో మంగళవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కోటి 8 లక్షల అభివృద్ధి పనులు, సిమెంట్ రోడ్డు, సైడ్ కాలువలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో వేసిన సిసి రోడ్లు,సైడ్ కాలువలు నాసిరకంగా నిర్మించడంతో పూర్తిగా డెబ్బ తిన్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన సిమెంట్ రోడ్లు నేటికి చెక్కు చెదర్లేదన్నారు.టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట వేయడం జరిగిందన్నారు.ముఖ్య మంత్రి చంద్రబాబు నాయు డు రైతుల విషయంలో వ్యవసాయ పనులకు ఒక బస్తా యూరియాకు 800 రూ రైతుల ఖాతా లో జమ చేయటం జరుగుతందన్నారు.

# ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా బినామీలకు అమ్మడమే సిఎం చంద్రబాబు విజన్

## - వైసిపి ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా బినామీలకు అమ్మడమే సిఎం చంద్రబాబు విజన్ అని వైసిపి ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 15 నెలల కూటమి పాలనలో అన్ని వ్యవస్థలూ ధ్వంసమయ్యాయని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీటి రంగాల ఉనికే ప్రశ్నార్థకమైందని విమర్శించారు. మెడికల్ కళాశాలల ప్రెజెంటేషన్‌లో జగన్ చేసిన పనిని తాను చేసినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. చంద్రబాబు పాలనలో సంక్షేమ పథకాల అమల్లో వైఫల్యం ఉంటోందని, శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని విమర్శించారు.

## బిఆర్ఎస్ తెలంగాణలో ఉండదు

### కాంగ్రెస్ సీనియర్ నేత సామ రాంమోహన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ ఇంకా తెలంగాణలో నిలబడదని కాంగ్రెస్ సీనియర్ నేత సామరాంమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. బిఆర్ఎస్‌ను కబ్జా చేసేందుకు హరీష్ రావు కుట్ర చేస్తున్నారన్నారు. కెటిఆర్‌ను నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో జోనల్ ఆఫీసుకి పంపించే ప్రయత్నం జరుగుతుందన్నారు. జోనల్ ఆఫీసు కర్ణాటకలో ఉందని, ఈడి కేసులో హీరోయిన్ కెటిఆర్ మీద ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా కెటిఆర్‌ను జైలుకు పంపే ప్రయత్నం హరీష్‌రావు చేస్తున్నారని అన్నారు. కెసిఆర్ కుటుంబంలో ఇప్పటికే ఒకరు బయటకి వెళ్లిపోయారని అన్నారు. బిఆర్ఎస్ నాకౌట్ మ్యాచ్‌లో జరుగుతున్న ఇంట్రెస్టింగ్ పోరులో టర్నింగ్ పాయింట్ కెటిఆర్ ఇష్యు అన్నారు. బిజెపి తాడు పట్టుకొని కెటిఆర్‌ను ఇరికించే ప్రయత్నం హరీష్ రావు చేస్తున్నారని అన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన ఆదిలాబాద్‌జిల్లా నాయకులు

### పార్టీలోకి ఆహ్వానించిన మహేష్‌కుమార్ గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఘర్ వాపసి షురూ అంటూ టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు ఆదిలాబాద్ నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదిలాబాద్ మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్, మాజీ టిపిసిసి ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంజీవరెడ్డిలుపార్టీలో చేరారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇటీవల టిపిసిసి కార్యవర్గ సమావేశంలో పార్టీని వీడిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరిగి కాంగ్రెస్‌లో చేరాలని ఉప ముఖ్యమంత్రి భట్టి ప్రతిపాదనను కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసిన విషయం తెలిసిందే.

## నేడు తెలంగాణ ప్రజలు విముక్తిపొందిన రోజు

### మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజలు విముక్తి పొందిన రోజు అని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. సెప్టెంబర్ 17న దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు అనేకరకాల కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. మోడీ నాయకత్వంలో గుజరాత్ గొప్పగా అభివృద్ధి చెందిందని, వారి నాయకత్వంలో ప్రపంచ చిత్రపటం మీద భారత జాతి గౌరవం, ఔన్నత్యం గొప్పగా పెరిగిందన్నారు. పేద దేశంగా ముద్ర ఉన్న భారత్ మోడీ నాయకత్వంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. రాబోయే కాలంలో మోడీ మరింత ఆరోగ్యంగా ఉండి, దేశాన్ని మరింత వేగంగా అభివృద్ధి చేయాలని మనస్ఫూర్తిగా కొరుకుంటున్నానని ఎంపి ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

## భర్తపై వేడి నూనె పోసిన భార్య

### చికిత్స పొందుతూ మరణించిన వెంకటేష్


**మల్దకల్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** కుటుంబ తగాదాలే కారణంగా భర్తపై వేడి నూనె పోసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. మల్దకల్ ఎస్సై నందికర్ తెలిపిన వివరాల ప్రకారం జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం, మల్లెందొడ్డి గ్రామంలో నిద్రిస్తున్న భర్త వెంకటేష్‌పై భార్య పద్మ వేడినూనె పోసింది. గత 8 సంవత్సరాల క్రితం వెంకటేష్ పద్మలకి వివాహం జరిగింది. వారికి ముగ్గురుపిల్లలు ఉన్నారు. వివాహం అనంతరం భార్య, భర్తలు తరుచుగా గొడవ పడేవారని అందులో భాగంగా ఈ నెల 11వ తేది ఉదయం 5గంటల సమయంలో నిద్రిస్తున్న భర్త వెంకటేష్ పై భార్య పద్మ వేడి నూనె పోసింది. వెంకటేష్‌కు తీవ్ర గాయాలు కాగా గద్వాల ఆసుపత్రి తరలించగా పరిస్థితి విషమించడంతో డాక్టర్లు కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. అక్కడ చికిత్స పొందుతు సోమవారం సాయంత్రం వెంకటేష్ మరణించాడన్నారు. ఈనెల 11వ తేదిన సంఘటన జరిగిన రోజు భార్య పద్మను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం పద్మను రిమాండ్‌కు తరలించడం జరిగిందని మల్దకల్ ఎస్ఐ నందికర్ తెలిపారు.

## జిఎస్‌టి తగ్గింపుతో ఆర్థిక వ్యవస్థకు భారీ సంస్కరణలు

### మాజీ ఎంపి సయ్యద్ జాఫర్ ఇస్లాం



**హైదరాబాద్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జిఎస్‌టి రేట్లను తగ్గించడం ద్వారా ప్రజలకు, వ్యాపారులకు, దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ సంస్కరణను తీసుకొచ్చారని మాజీ ఎంపి సయ్యద్ జాఫర్ ఇస్లాం అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో మాట్లాడారు. యుపిఏ పాలనలో రాష్ట్రాలు, కేంద్రానికి వేర్వేరు రేట్లు ఉండేవి -వ్యాట్, ఆక్ట్రాయ్, ఎంట్రీ టాక్స్, ఇతర అనేక పరోక్ష పన్నులు ఉం డేవని అన్నారు. ఇవి చాలా గందరగోళాన్ని, సంక్లిష్టతను కలిగించేవని, మోడీ ప్రభుత్వంలోని జిఎస్‌టి సంస్కరణల ద్వారా అత్యవసర వస్తువులకు జీరో శాతం పన్ను వర్తించనుందని, 28 శాతం జిఎస్‌టి పరిధిలో ఉన్న వస్తువులు 18శాతం, 12శాతం వస్తువులు 5శాతం, లేదా జిరో శాతంలోకి తగ్గించబడ్డా యన్నారు. దీని ద్వారా మధ్యతరగతి కుటుంబాలు, సామాన్య ప్రజలకు ఉపశమనం కలుగుతుందన్నారు.




ధర్నాలో నిరసన తెలుపుతున్న నీట్ 2025 విద్యార్థులు

## జిఓ 33ని సవరించాలి

### నీట్-2025 విద్యార్థుల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** నీట్ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 33ను సవరించి, తెలంగాణ నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని నీట్ విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ధర్నాచౌక్ వద్ద నీట్ 2025లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు తమకు మెడికల్ కౌన్సిలింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పించాలని కోరుతూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలు, జీవో నెంబర్ 33 ప్రకారం కేవలం ఇంటర్ వేరే ప్రాంతంలో చదివారనే కారణంతో, తెలంగాణలో పుట్టి, పదవ తరగతి వరకు ఇక్కడే చదివిన విద్యార్థులను స్థానికులుగా పరిగణించబడరు అంటూ కౌన్సిలింగ్‌కు అనుమతించకపోవటం అన్యాయమన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసే సమయంలో మార్పులు, చేర్పులు చేసుకునే పూర్తి స్వేచ్ఛ తెలంగాణ ప్రభుత్వానికి ఇచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి, రాష్ట్రమంత్రులు నీట్ 2025 విద్యార్థుల సమస్యపై స్పందించి, తక్షణమే న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీట్ 2025 విద్యార్థులు, తల్లి తండ్రులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఫీజులు, స్కాలర్‌షిప్‌లు చెల్లించే వరకు ఉద్యమాలు

### ముఖ్యమంత్రికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** ఫీజులు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని రాష్ట్రంలోని మొత్తం కాలేజీలు ఇచ్చిన బంద్ పిలుపును విరమించు కోవడం పట్ల బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. దీనివలన విద్యార్థుల చదువు వాతావరణం దెబ్బతినకుండా కాపాడినందుకు అభినందిస్తున్నామని, అయితే బకాయిలు కేవలం 600 కోట్లు చెల్లిస్తామని ప్రకటించడం సరికాదన్నారు. మొత్తం బకాయిలు 8వేల కోట్లు ఉంటే 600 కోట్లు ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలంటే మొత్తం బకాయిలు చెల్లిస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

# తిరుమలగిరిలో 3వేల మంది అనర్హులు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మంగళవారం సచివాలయంలో నాగార్జునసాగర్ నియోజకవర్గ భూసమస్యలపై సమీక్షిస్తున్న మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** పేద ప్రజలు దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పించే విషయంలో మానవీయ కోణంలో ఆలోచన చేయాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. సచివాలయంలో మంగళవారం నాగార్జున సాగర్ నియోజకవర్గంలో భూ సమస్యలపై అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను సాకుగా చూపించి జటిలం చేయొద్దని అటవీశాఖ అధికారులకు సూచించారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలో 40 నుంచి 50 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై గిరిజనులకు హక్కులు, కల్పించడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఐతే నిబంధనలు చూపుతూ ఆ భూములు అటవీ శాఖకు చెందినవని అధికారులు కొర్రీ వేస్తున్నారన్నారు. ఈ అంశంపై రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు సమన్వయంతో పని చేసి వీలైనంత త్వరగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూ భారతి పైలట్ ప్రాజెక్టులో భాగంగా నాగార్జున సాగర్ అసెంబ్లీ నియోజకవర్గం లోని తిరుమలగిరి మండలాన్ని ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా సర్వే నిర్వహించినట్లు మంత్రి పొంగులేటి చెప్పారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ కోసం 235 సర్వే నెంబర్లను ఎంపిక చేశామన్నారు.. మొత్తం 23 వేల ఎకరాలో సర్వే నిర్వ హించగా, అందులో 12 వేల ఎకరాలు ప్రభుత్వ భూమిగా గుర్తించామన్నారు. ఇందులో 8 వేల ఎకరాలు సాగుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. వాటిలో 4. వేల ఎకరాలు పాసు పుస్తకాలతో సాగులో ఉన్నాయని వివరించారు. మిగిలిన 4037 ఎకరాలకు సంబంధించి కొత్త పాసు పుస్తకాలు ఇవ్వవలసి ఉందన్నారు. ఈ సర్వేలో 2936 ఎకరాలకు సంబంధించి 3069 మంది వద్ద బోగస్ పాసు పుస్తకాలు ఉన్నట్లు గుర్తించి వారి పాసు పుస్తకాలను రద్దు చేశామని తెలిపారు. వీటికి రైతు భరోసా, రైతు బీమా తదితరాలను రద్దు చేశామన్నారు. సర్వేలో భాగంగా 7 వేల ఎకరాలు అటవీ భూమిని గుర్తించామని, ఈ భూములకు సంబంధించిన వివాదాలను పీలైనంత త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మాజీ మంత్రి కె. జానా రెడ్డి, నాగార్జున సాగర్ శాసన సభ్యులు కె. జయవీర్ రెడ్డి, దేవరకొండ శాసనసభ్యులు బాలూ నాయిక్, రెవెన్యూ శాఖ సెక్రటరీ డీఎస్ లోకేష్ కుమార్, పీసీసీఎస్ సి. సువర్ణ, నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు.

## వృత్తి, ఉద్యోగాల్లో ఒత్తిడికి లోనవుతున్న మహిళలు: మంత్రి సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** మహిళలకు ఎన్నో సవాళ్లుఉన్నాప్రభుత్వ ఉద్యోగంలో రాణిస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులుగా ఎన్నికైన మహిళలచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళకు ఉద్యోగం అంటేనే అదనపు బాధ్యత ఒకవైపు కుటుంబ బాధ్యతలు మరొకవైపు వృత్తి బాధ్యతలు. రెండిటిని ఏకకాలంలో నెరవేర్చుతున్న మహిళా ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. కుటుంబ బాధ్యతలు, వృత్తి బాధ్యతల్లో మహిళలు నిత్యం ఒత్తిడిలకు లోన్ అవుతుంటారు కానీ ఆ ఒత్తిడిలను అధిగమించి రాణిస్తున్న మహిళలు తమ ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా ఫ్యామిలీ బారాన్ని మోస్తూ ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. భర్త సహకారం ఉన్న మహిళా ఉద్యోగులు అదృష్టవంతులు అత్తమామలు, భర్త, పిల్లల బాధ్యతలుసునాయాసంగా మోయగలరన్నారు.

భూదేవికి ఉన్నంత ఓపిక మహిళలకు ఉన్నందున కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉందన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సవాలను చర్చించేం దుకు ఈనెల 22న రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి మహిళ ఉద్యోగులను ఆహ్వానిస్తున్నా మన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వచ్చే అభిప్రాయాలను బట్టి నూతన పాలసీ తీసుకొస్తామని, ఉచిత బస్సు ప్రయాణం మీద తప్పుడు ప్రచారం చేస్తున్నా రన్నారు. మహిళల ప్రతిభను బయటికి రాకుండా చేసేందుకు గొడవలను భూతద్దంలో పెట్టి చూయిస్తున్నారన్న మంత్రి సీతక్క మహిళలు ఐక్యత సాధిస్తే అన్ని సాధించినట్లుతెలంగాణలో మహిళా స్వయం సహాయక బృందాలు అద్భు తాలు సృష్టిస్తున్నట్లు తెలిపారు. పెట్రోల్ బంకుల ఏర్పాటు ద్వారా లక్షల రూపాయలు సంపాదిస్తు న్నారని మహిళా ఉద్యోగులకు మా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా మాతో చెప్పుకోవచ్చు తెలంగాణ ప్రభుత్వ గౌరవాన్ని కాపాడే విధంగా మహిళా ఉద్యోగులు పనిచేసే ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు.

## డ్రగ్స్ కెమికల్స్‌ను గుర్తించడానికి ఎక్సైజ్ టీమ్‌లకు శిక్షణ

### డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తిక్ చెతన్య

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** గంజాయి, డ్రగ్స్ తనిఖీలకు వెళ్లినపుడు ప్రత్యక్షంగా పట్టుకోవడంతోపాటు సింథటిక్ డ్రగ్స్, ఆల్ప్రోజోలం, కెమికల్స్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ టీమ్‌లు తనిఖీలు నిర్వహించినపుడు చాల విషయాలను గుర్తుకు పెట్టుకోవాలని ఎక్స్ ఫర్ట్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సి. హెచ్. కార్తిక్ చెతన్య అన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఎక్సైజ్ శాఖ స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్ టి ఎఫ్, డిటిఎఫ్ టీమ్‌లకు కెమికల్స్‌ను ఎలా గుర్తించడం అనే విషయంపై అవగహన సమావేశాన్ని నిర్వహించారు. ఆదివారం నాచారం, చర్లపల్లి ప్రాంతాల్లో డ్రగ్స్ తయారీకి వినియోగించే మెపెడ్రెన్‌ను పట్టుకున్నారు. అదే విధంగా ఒక పాఠశాలలో ఆల్ప్రోజోలం తయారీ విషయం వెలుగులోకి వచ్చింది. ఇటువంటి సమయాల్లో తనిఖీలకు టాస్క్ ఫోర్స్ ఎక్సైజ్‌శాఖ వెళ్లినప్పుడు యంత్రాంగం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాన్ని పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరవించారు.

తనిఖీల్లో ప్రధానంగా ఎక్సైజ్ శాఖ టీమ్‌లు వెళ్లినపుడు పెంటనీల్, ఆల్ప్రోజలం, డ్రగ్స్ మెపెడ్రోన్, సిం థటిక్ డ్రగ్స్ తయారీపై యూనిట్ల వద్దకు వెళ్లినపుడు ముందు కమికల్స్ మిళితం కోసం తయారుచేసిన లేదా రాసిన నోట్స్‌ను, మ్యాపులను, అక్కడ ఉన్న కెమికల్స్‌ను, తయారీ యంత్రాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. అనంతరం సంబంధిత నిందితులు ఏ రకమైన డ్రగ్స్ తయారీ చేస్తున్నాడనే విషయం కోసం స్థానికంగా ఉన్న కెమికల్స్ వివరాలను గుగూల్‌లో పబ్ చామ్, ఎంఎస్‌డిఎస్ లాంటి సైట్లలో సమాచారం పక్కా విషయాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ మాత్రం జాగ్రత్తలు తీసుకుంటే కేసులను బాగా చేయడంతో పాటు నిందితులను పట్టుకోవచ్చున్నారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్లు ప్రణవీ, అనిల్ కుమార్‌రెడ్డి, ఆర్. కిషన్, జి. శ్రీనివాసరెడ్డి, అడిషనర్ ఎస్పీ వెంకటేశ్వర బాబు, ఎస్ టి ఎఫ్ డీఎస్పీలు తుల శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్, ఈఎస్‌లు ప్రదీప్‌రావు, నవీన్, ఉజ్వలరెడ్డిలు పాల్గన్నారు.

## అటవీ అధికారులపై దాడులు చేస్తే పిడి యాక్టు

### అటవీ శాఖ అసోసియేషన్ సమావేశంలో మంత్రి సురేఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** అటవీ అధికారులపై దాడులు చేస్తే పీడీ యాక్టులు పెడతామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. మంగళవారం తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర అటవీశాఖ అధికారుల అసోసియేషన్ సంఘాలతో మంత్రి సురేఖ, ప్రిన్స్ పల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ, సునీత భగవత్, తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ అధికారుల సంఘాల నాయకుల తమ సమస్యలు చెప్పుకున్నారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ తాను ఫారెస్టు సిబ్బందికి ఒక అక్కగా అండగా ఉంటానని చెప్పారు. ఫారెస్టు ఉద్యోగుల సమస్యలు వినేందుకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. చిన్న చిన్న విషయాలు శాఖపరంగా మనమే పరిష్కరించుకుందామన్నారు. కీలక అంశాలు సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిదామన్నారు. మనమంతా ఒక ఫ్యామిలీ అని మంత్రి కొండా సురేఖ గుర్తు చేశారు. ఎందుకంటే, అటవీ శాఖకు, ఫారెస్టు ఉద్యోగులే ఫ్రంట్ రన్నర్స్‌ని అలాంటి ఉద్యోగుల కోసం పని చేయడం తన బాధ్యత అన్నారు. పోలీసులకు ఎటువంటి జీత భత్యాలు ఇస్తున్నారో. అటవీ అధికారులకు అంతే స్థాయిలో ఇచ్చేందుకు తాను ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అటవీ అధికారులకు అవార్డులు ఇచ్చేవారని రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈఅవార్డులు ఇవ్వడం ఆపేశారని మంత్రి సురేఖ గుర్తుచేశారు. అయితే, ఇటీవల జరిగిన అటవీశాఖ రివ్యూలో సీఎం దృష్టికి తీసుకెళితే ఆయన సుముఖత వ్యక్తం చేసిన విషయాన్ని మంత్రి సమావేశంలో ప్రస్తావించగా ఫారెస్ట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫారెస్టు ఉద్యోగులు మహారాష్ట్ర మాదిరి అటవీ భూములను అన్యాక్రాంతం చేసేవాళ్ళను కఠిన చట్టాలతో శిక్షించాలని, అటవీశాఖ బీట్ అధికారుల నియామకం వెంటనే చేపట్టాలని, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లను జోన్ పోస్టును డిస్ట్రిక్ లెవల్ పోస్టుగా చేయాల న్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించేందుకు బీట్, సెక్షన్, డీఆర్‌ఓలకు ద్విచక్రవాహనాలు ఇవ్వాలని, ఫారెస్టు ఏరియాలో పని చేసే అధికారులను మూడు సంవత్సరాలకు ఒకసారైన కౌన్సిలింగ్ ద్వారా 100 శాతం బదిలీలు జరపాలని, ప్రతి జిల్లాకు రెండు, మూడు ఫారెస్టు స్టేషన్‌లు ఏర్పాటు చేయాలన్నారు.

## కర్ణాటకలో బంగారం, రాగి అన్వేషణకు సింగరేణికి లైసెన్స్

### కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి నుండి లైసెన్స్ పత్రాలు స్వీకరించిన సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్

**గోదావరిఖని, ప్రభాత వార్త:** సింగరేణి సంస్థ కర్ణాటక రాష్ట్రంలోని దేవదుర్గ ప్రాంతంలో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణ చేయడానికి అనుమతిస్తూ జారీచేసిన లైసెన్సులను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ కు అందజేశారు. మంగళవారం హైదరాబాద్ లోని టీ హబ్ లో కేంద్ర గనుల శాఖ ఆధ్వర్యంలో జరిగిన కీలక ఖనిజాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సెమినార్ లో వీటిని అందజేశారు. గత మార్చి నెలలో కేంద్ర గనుల శాఖ నిర్వహించిన కీలక ఖనిజాల వేలంపాటలో సింగరేణి సంస్థ పాల్గొని 37.75 శాతం రాయల్టీతో కర్ణాటక రాష్ట్రంలోని దేవదుర్గ ప్రాంతంలో 199 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో గల బంగారం, రాగి ఖనిజాల అన్వేషణ పనిని



దక్కించుకుంది. దీనికి సంబంధించిన లైసెన్సు, సర్టిఫికెట్లను మంగళవారం కేంద్ర మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ కీలక ఖనిజ రంగంలో భారతదేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడం కోసం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు కృషి చేయాలన్నారు. దేశంలో కీలక ఖనిజ రంగం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 32 వేల కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. కీలక ఖనిజాల అన్వేషణకు వేలంపాటలో విజేతలైన వారికి ఆయన అభినందనలు తెలియజేశారు. వెంటనే అన్వేషణ పనులు ప్రారంభించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సింగరేణి సీఎండీ తో పాటు తెలంగాణ రాష్ట్ర డిపార్ట్మెంట్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ శాఖ డైరెక్టర్ వల్లూరు క్రాంతి, సింగరేణి డైరెక్టర్ (పి.పి) కె.వెం కటేశ్వర్లు, జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ మార్కెటింగ్ తాడబోయిన శ్రీనివాస్, జనరల్ మేనేజర్ ఎక్స్ప్లొరేషన్ శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్ ఆర్ అండ్ డి కనకయ్య పాల్గొన్నారు.

## ఆచార్య జివిఎస్ తరతరాలకు స్ఫూర్తి: రమణాచారి

**హైదరాబాద్ (నాంపల్లి), సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** ఆచార్య జీవిఎస్‌గా ప్రసిద్ధి చెందిన గూడ వెంకట సుబ్రహ్మణ్యం సంగీత సాహిత్య నృత్యరంగాల్లో విశేషకృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి నాటి నేటి రానున్న తరాలకు స్ఫూర్తి, మార్గనిర్దేశి అని విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. జీవిఎస్ పండితుడు, సాహిత్య విమర్శకుడు, కవి, రచయిత, తెలుగు సాహిత్యం, విమర్శలకు గణనీయమైన కృషిచేశారని, ముఖ్యంగా సాహితీరంగంలో విమర్శకునిగా చెరగని ముద్రవేశారని తెలిపారు. నన్నయ్య నుంచి ప్రఖ్యాత కవులైన సినారె, శివారెడ్డిల వరకు తెలుగు కవుల సాహితీ ప్రక్రియల స్వరూప స్వభావాలను విశ్లేషిస్తూ రచించిన సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలన్న వ్యాస పరంపర జీవిఎస్‌కు విశేష



సాహితీ పురస్కారంతోఎల్.వి.సుబ్రహ్మణ్యంను,సారస్వత పురస్కారంతో సత్కరిస్తున్న రమణాచారి, రఘునాథశర్మ, గౌరీశంకర్, శ్రీసౌమ్య తదితర అతిథులు


ఖ్యాతిని ఆర్జించిపెట్టిందని గుర్తుచేశారు. ఆయన పేరున ప్రతీ సంవత్సరం ప్రముఖులకు పురస్కారాలు అందించడం హర్షదా యకమన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలో మంగళవారంరాత్రి శ్రీసౌమ్య వారణాసి నిర్వహణ లో ఇన్సూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆఫ్ ఇండియా సీఈఓ వెంకట్ చంగవల్లి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డా. కె.వి.రమణాచారి ముఖ్య అతిథిగా విచ్చేశారు. విశిష్ట అతిథులు ప్రాచార్య శలాక రఘునాథశర్మ, ఎల్. కాళిదాస్ వెంకటరంగారావు, డా. ముక్తేవి భారతి, ఆచార్య టి.గౌరీ శంకర్, ఆచార్య వై.రెడ్డి శ్యామల తదితరులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి. సుబ్రహ్మణ్యంను ఘనంగా సత్కరించారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్య క్షురాలు డా. ఆవుల మంజు లతను ఘనంగా సత్కరించి సుశీల సుబ్రహ్మణ్యం సారస్వత పురస్కారం ప్రదానం.



మంగళవారం ఎంజిబిఎస్ వద్ద పాస్‌పోర్టు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్. చిత్రంలో మేయర్ విజయలక్ష్మి,ఎంపి అసదుద్దీన్ ఓవైసి తదితరులు

## పాస్‌పోర్టు కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్ (గోషామహల్), సెప్టెంబరు 16ప్రభాతవార్త:** మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఆధునీకరించిన నూతన పాస్‌పోర్టు కార్యాలయాన్ని హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ్యులు మందడి అనిల్‌కుమార్‌యాదవ్, పాస్‌పోర్టు జాయింట్ సెక్రటరీ కెజె శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరి చందన, రీజినల్ పాస్‌పోర్టు అధికారి స్నేహాజతో కలిసి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన పాస్‌పోర్టు కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలోనే మొట్ట మొదటిసారిగా మెట్రోరైల్ స్టేషన్‌లో ప్రారంభించినట్లు తెలిపారు. పాస్‌పోర్టు కార్యాలయానికి వచ్చే ఉద్యోగులు పాస్ పోర్టు ధరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ పాస్ పోర్టు కార్యాలయం దేశంలోనే ఐదవ స్థానంలో ఉందన్నారు. తెలంగాణలో 5 పాస్ పోర్ట్ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. ఎంజిబిఎస్, టొలిచౌకి, బేగంపేట్, నిజామాబాద్, కరీంనగర్‌లో ఉన్నట్లు చెప్పారు. తెలంగాణలో రోజుకు 4500 పాస్‌పోర్టులు ఇచ్చే సామర్థ్యం ఉందన్నారు. 7500 స్లాట్స్ ఉన్నట్లుచెప్పారు. దీనికి 1200 స్లాట్స్ చేసుకోవాలన్నారు. తాను ఎంపిగా ఉన్నప్పుడు కరీంనగర్‌లో ప్రారంభించుకున్న పాస్‌పోర్టు కేంద్రంలో 250 నుంచి 500 స్లాట్స్ పెంచుకోవాలని కోరారు.



## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపిన ప్రమాద బాధితుడు రాహుల్ కుటుంబం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబరు16:** ప్రమాద బాధితుడు గుండేటి రాహుల్ కుటుంబంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ జిల్లా దామెర మండలం, పులకుర్తి గ్రామానికి చెందిన గుండేటి రాహుల్ ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయారు. రాహుల్‌కు సీఎం సహాయనిధి ద్వారా చికిత్స అందించి, కృత్రిమ కాళ్లను అమర్చేందుకు ప్రభుత్వం సాయం చేసింది. నవంబర్ 2, 2024న రైలులోరాజస్థాన్ వెళుతున్న రాహుల్‌ను కొందరు దుండగులు రైల్లో నుంచి తోసేశారు. ఈ ఘటనలో రెండు కాళ్లు కోల్పోయిన రాహుల్ కు కృత్రిమ కాళ్లు అమర్చేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందించింది. తను మళ్లీ నడవగలిగేందుకు సహకారం అందించిన ముఖ్యమంత్రికి కుటుంబంతో కలిసి రాహుల్ ధన్యవాదాలు తెలిపారు.



ప్రసంగిస్తున్న హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

## సెప్టెంబరు 17 చరిత్రాత్మకం

### తెలంగాణ ప్రజలు బానిసత్వం నుంచి బయటకి వచ్చినరోజు

### హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**హైదరాబాద్, సెప్టెంబరు 16ప్రభాతవార్త:** సెప్టెంబరు 17 హైదరాబాద్ విమోచన దినోత్సవం చారిత్రత్మకమైందని, ఇంటింట ప్రతి ఒక్కరూ ఈ దినోత్సవాన్ని ఉత్సవంగా జరుపుకోవాలని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో హైదరాబాద్ విమోచన దినోత్సవంపై పాదూరి కరుణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున హైదరాబాద్లో జాతీయ జెండాను కూడా ఎగురవేయలేదన్నారు. సర్దార్ వల్లాభాయ్ పటేల్ నిజాం సంస్థానాన్ని విలీనం చేశారని అన్నారు. తెలంగాణ ప్రజలు బానిసత్వం నుంచి బయటకి వచ్చింది సెప్టెంబర్ 17నఅని కాబట్టి ఈ రోజును విమోచన దినోత్సవంగా బావించాలని అన్నారు. ప్రభుత్వం కూడా విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలని ఈ చరిత్రను పాఠ్యా పుస్తకాలలో చేర్చి భావితరాలకు అందించాలని కోరారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్ విద్యా సాగర్ రావు మాట్లాడుతూ నిజాం అరాచకాలు చెప్పాలంటే గంటలు కూడా చాలవని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ వకులభరణం కృష్ణమోహన్ రావు, మాజీ విసీ ప్రొఫెసర్ తిరుపతిరావు, ప్రొఫెసర్ మురళి మనోహర్, ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకట్రెడ్డి, బీజేపీనాయకులు డాక్టర్ మనోహర్రెడ్డి, స్వాతంత్ర సమర యోధుడు విట్టల్ రావు ఆర్య, పాశం యాదగిరి, జాతీయ సాఫాయి కర్మచారి కమిషన్ మాజీ సభ్యులు చింత సాంబ మూర్తి, జర్నలిస్ట్ కప్పర ప్రసాద్, ఉప్పల శారద తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సిఎ అక్రమాలపై విచారణ కమిటీ వేయండి

### బీసీసీఐకి టీడీసిఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** 2005 నుంచి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలను నిగ్గు తేల్చేందుకు ఉన్నతస్థాయి విచారణ కమిటీ వేయాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)ని తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. గత 90 ఏండ్లుగా తెలంగాణ జిల్లాల క్రికెటర్లకు తీరన అన్యాయం జరుగుతోందని, గ్రామీణ క్రికెటర్లకు అవకాశాలు కల్పించేందుకు అన్ని జిల్లాలకు, క్రికెట్ క్లబ్‌లకు సభ్యత్వం ఇచ్చేలా హెచ్‌సీఏను ఆదేశించాలని అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియాకు రాసిన లేఖను మంగళవారం ఈమెయిల్ చేశారు. ఈసందర్భంగా తెలంగాణలో 31 గ్రామీణ జిల్లాలకు కలిపి 300 క్లబ్‌లకు సభ్యత్వంఇచ్చేలా హెచ్‌సీఏను ఆదేశించాలని, బీసీసీఐ అందించే నిధుల్లో 50 శాతం గ్రామీణ క్రికెట్ అభివృద్ధికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బీసీసీఐ దేశవాళీ టోర్నమెంట్లలో గ్రామీణ క్రికెటర్లు పోటీపడేలా టీడీసీఏకుసహకారం అందించాలి. అవినీతి, అక్రమాలకు పాల్పడిన హెచ్‌సీఏ ఆఫీస్‌బేరర్లపై జీవితకాల నిషేధం విధించాలే కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

MN 1 VJA_17-09pg10exTW.qxd 9/16/2025 11:40 PM Page 1



## మహిళల క్రాస్ కంట్రీ స్కీయింగ్‌లో..
# భవానికి కాంస్యం



**న్యూఢిల్లీ:** మహిళల క్రాస్ కంట్రీ స్కీయింగ్‌లో భారత్‌కు తొలిసారి టీఎన్ భవాని కాంస్య పతకం సాధించింది. ఎఫ్ఐఎస్ గుర్తింపు పొందిన ఈవెంట్‌లో భవాని భారతదేశపు మొట్ట మొదటి మహిళల క్రాస్ కంట్రీ స్కీయింగ్ పతకాన్ని గెలుచుకుంది. చిలీలోని కొరాల్కోలో జరిగిన మహిళల 5 కి.మీ ఇంటర్వెల్ స్టార్ట్ ఫ్రీ రేసులో పోటీ పడిన భవాని 21:04.9 సెకన్లలో గమ్యాన్ని చేరుకుని కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఐదుగురు అథ్లెట్లు పాల్గొన్న ఈ పోటీలో, భవానీ బంగారు పతక విజేత మెక్సికోకు చెందిన రెజీనా మార్టినెజ్ లోరెంజో కంటే 3 నిమిషాల 51 సెకన్లు వెనుకబడి ఉంది. ఆమె 17:13.6 సెకన్ల సమయంతో పరుగును పూర్తి చేసింది. చిలీకి చెందిన మార్టినా ఫ్లోర్స్ 17:16.4 సెకన్లతో రజత పతకాన్ని గెలుచుకుంది.

## చైనా మాస్టర్స్‌లో 16వ రౌండ్‌లోకి సింధు
### ఆయుష్ శెట్టి నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** చైనా మాస్టర్స్ 2025లో ప్రపంచ ర్యాంకర్ పివి సింధు 16వ రౌండ్ లోకి అడుగుపెట్టగా, రైజింగ్ స్టార్ ఆయుష్ శెట్టి నిష్క్రమించాడు. మంగళవారం జరిగిన చైనా ఓపెన్ సూపర్ 750లో భారత షట్లర్లు మిశ్రమ ఆరంభాన్ని పొందారు. సింధు తదుపరి రౌండ్‌లోకి ముందుకు సాగగా, ఆయుష్ తీవ్రంగా పోరాడిన ప్రారంభ రౌండ్ పోరులో ఓడిపోయాడు. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత, 2019 ప్రపంచ ఛాంపియన్, ప్రస్తుతం ప్రపంచ ర్యాంక్‌లో 16వ స్థానంలో ఉన్న సింధు డెన్మార్క్‌కు చెందిన జూలీ దావల్ జాకోబ్‌సెన్‌ను కేవలం 27 నిమిషాల్లోనే ఓడించి, 21-5, 21-10 తేడాతో గెలిచింది. హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500లో సింధు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించిన 10 రోజుల లోపే ఈ ఫలితం వచ్చింది. సింధు దూకుడుగా ఆడటం, నెట్ వద్ద నియంత్రణ సాధించడం వల్ల జాకోబ్సెన్ ఇబ్బంది పడ్డాడు, మొదటి ర్యాలీ నుండే సింధు తన అధిక్యాన్ని చాటింది. అలాగే భారత్‌కే చెందిన ఆయుష్ శెట్టి, చైనీస్ తైపీకి చెందిన ప్రపంచ 5వ ర్యాంకింగ్ చౌ టియెన్‌చెన్‌తో జరిగిన పోటీలో కఠిన పరీక్షను ఎదుర్కొన్నాడు. మాజీ ప్రపంచ నంబర్ 2 ను మూడు ఆటలకు నెట్టి, కోర్ట్ 3 లో 19-21, 21-12, 16-21 తేడాతో ఓడిపోయాడు. రెండవ గేమ్‌లో ఆయుష్ తన దూకుడు ఆటతో ఆకట్టుకున్నాడు, కానీ చౌ అనుభవం మరియు ఒత్తిడిలో నిర్ణయాత్మక ఆటలో పరాజయం చెందాడు.



ఆట

## మహిళల ర్యాంకింగ్స్‌లో..
# స్మృతి నం.1



**న్యూఢిల్లీ:** టీం ఇండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన తాజా ఐసీసీ మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ 1తో అగ్రస్థానాన్ని తిరిగి కైవసం చేసుకుంది. ఈ మేరకు మంగళవారం ఐసీసీ ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా న్యూ చండీగఢ్‌లో జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియాతో భారత్ తలపడగా, స్మృతి 63 బంతుల్లో 58 పరుగులు చేసి ఏడు రేటింగ్ పాయింట్లను అందుకుని ఇప్పుడు ఇంగ్లాండ్ కెప్టెన్ కంటే నాలుగు పాయింట్లు ముందంజలో ఉంది. అలాగే ఓపెనింగ్ పార్ట్నర్ ప్రతీకా రావల్ తన అర్ధ సెంచరీ తర్వాత కీలకమైన పాయింట్లు పొంది నాలుగు స్థానాలు ఎగబాకి 42వ ర్యాంక్‌కు చేరుకోగా, హర్లీన్ డియోల్ ఆస్ట్రేలియాపై 54 పరుగులతో రాణించి 43వ స్థానానికి ఎగబాకింది. ఆతిథ్య భారత్‌పై 8 వికెట్ల తేడాతో విజయం సాధించిన తర్వాత, అనేక మంది ఆస్ట్రేలియన్ బ్యాట్స్‌మెన్ కూడా కొన్ని రేటింగ్ పాయింట్లను సంపాదించారు. సిరీస్ ఓపెనర్‌లో 74 బంతుల్లో 77 పరుగులు చేసిన బెత్ మూనీ ఎనిమిదో స్థానం నుండి ఐదో స్థానానికి ఎగబాకింది. అన్నాబెల్ సదర్లాండ్ (నాలుగు స్థానాలు ఎగబాకి) మరియు ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (13 స్థానాలు ఎగబాకి) సంయుక్తంగా 25వ ర్యాంకును పంచుకున్నారు.

## డబ్ల్యూటిటి ఫీడర్ ఇస్తాంబుల్‌లో
# ఓడిన జ్ఞానశేఖరన్, మనికా





**న్యూఢిల్లీ:** డబ్ల్యూటీటీ ఫీడర్ ఇస్తాంబుల్-2025లో భారత్ ప్లేయర్లు సత్యన్ జ్ఞానశేఖరన్ ఓటమి చెంది రన్నరప్‌తో సరిపెట్టాడు. ఇక మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో మానికా బాత్రా సైతం పరాజయం పాలైంది. ఇస్తాంబుల్‌లో మంగళవారం జరిగిన ఈ ఫీడర్‌లో జ్ఞానశేఖరన్ రన్నరప్‌గా నిలిచాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో వ్లాదిమిర్ సిడోరెంకోతో జరిగిన మ్యాచ్‌లో జ్ఞానశేఖరన్ 9-11, 8-11, 9-11 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయి పోడియంలో రెండవ స్థానంలో నిలిచాడు. చరిత్రలో అత్యధిక ర్యాంక్ పొందిన భారత పురుషుల సింగిల్స్ ప్యాడ్లర్‌గా రికార్డు సృష్టించిన అతడు దిగువ ర్యాంక్‌లో ఉన్న సిడోరెంకో చేతిలో కేవలం 23 నిమిషాల్లోనే ఓడిపోయాడు. మొదటి రౌండ్ బై పొందిన తర్వాత అతను తన తోటి భారతీయుడు దివ్యాంష్ శ్రీవాస్తవపై 3-0 తేడాతో విజయం సాధించి రెండవ రౌండ్‌లో తన ప్రచారాన్ని ప్రారంభించాడు. జ్ఞానశేఖరన్ ఆ తర్వాత క్వార్టర్ ఫైనల్స్‌లో రారెస్ సిపోస్‌ను, సెమీ ఫైనల్స్‌లో క్వాలిఫైయర్ ఎవ్జెనీ టిఖోనోవ్‌ను ఓడించి టైటిల్ పోరులో అడుగుపెట్టాడు. కాగా మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ మానికా బాత్రా సెమీఫైనల్లో ఓడిపోయింది. ఆమె టర్కీకి చెందిన సిబెల్ అల్టింకాయ చేతిలో 6-11, 12-10, 7-11, 11-13 తేడాతో ఓడిపోయింది. అలాగే మిక్స్‌డ్ డబుల్స్‌లో, భారత జాతీయ ఛాంపియన్ జోడీ ఆకాష్ పాల్-పోయ్మంటీ బైస్య సెమీఫైనల్లో సింగపూర్‌కు చెందిన పాంగ్ కోయెన్-సెర్ లిన్ కియాన్ చేతిలో 12-14, 8-11, 4-11 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయారు.









# సన్‌రైజర్స్ స్టార్స్ ఔట్
### నలుగురు ప్లేయర్లకు గుడ్ బై

**న్యూఢిల్లీ:** వచ్చే ఐపీఎల్ సీజన్‌కు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇప్పటి నుంచే రెడీ అవుతోంది. ఇందుకు గాను ఐపీఎల్-2026 మినీ వేలానికి ముందు పేలవ ప్రదర్శన చేసిన స్టార్ ప్లేయర్లతో సహ నలుగురిని బయటకు పంపి జట్టును బలోపేతం చేసేందుకు హైదరాబాద్ ఫ్రాంచైజీ సిద్ధమవుతోంది. 2024 సీజన్‌లో రన్నరప్‌గా నిలిచిన సన్‌రైజర్స్ ఈ సీజన్‌లో మాత్రం ఆశించినస్థాయిలో రాణించలేదు. హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్, మహమ్మద్ షమీతో పాటు, ఇతర స్టార్ ఆటగాళ్లు అంచనాలను అందుకోలేకపోయారు. ఫలితంగా పాయింట్ల పట్టికలో హైదరాబాద్ ఆరోస్థానానికి పరిమితమైంది. దీంతో మినీ వేలానికి ముందు అటువంటి వారిని రిలీజ్ చేసి పర్స్ పెంచుకోవాలని చూస్తోంది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో వికెట్ కీపర్, బ్యాటర్ ఇషాన్ కిషన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.11.40 కోట్లకు కొనుగోలు చేసింది. తొలి మ్యాచ్‌లోనే సెంచరీతో దుమ్ములేపిన ఇషాన్ ఆ తర్వాత భారీ ఇన్నింగ్స్‌లు ఆడడంలో విఫలమయ్యాడు. 119 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 29.10 సగటు, 137.64 స్ట్రైక్ రేట్‌తో 2,998 పరుగులు చేశాడు. హైదరాబాద్ తరుపున 14 మ్యాచ్‌ల్లో 354 పరుగులు చేశాడు. వచ్చే వేలానికి ముందు ఇషాన్‌ను విడుదల చేయనుంది. అలాగే రూ.23 కోట్లకు హెన్రిచ్ క్లాసెన్‌ను సన్‌రైజర్స్ రిటైన్ చేసుకుంది. ఈ సీజన్‌లో క్లాసెన్ పెద్దగా ఆకట్టులేకపోయాడు. 14 మ్యాచ్‌ల్లో 487 పరుగులు చేశాడు. ఇప్పటివరకు 49 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 1480 పరుగులు చేశాడు. సగటు 40.00, స్ట్రైక్ రేట్ 169.72. భారీ ధర, పర్ఫామెన్స్‌ను దృష్టిలో ఉంచుకుని క్లాసెన్‌ను విడుదల చేసి మళ్లీ వేలంలో తక్కువ ధరకు తీసుకునే ఆలోచన చేస్తోంది. ఇక టీమిండియా స్టార్ బౌలర్ హమ్మద్ షమీని మెగా వేలంలో రూ.10 కోట్లకు హైదరాబాద్ దక్కించుకుంది. అయితే షమీ అంచనాలను అందులేకపోయాడు. 11.23 ఎకానమీతో పరుగులు ఇచ్చి కేవలం 6 వికెట్లు మాత్రమే తీశాడు. షమీ 119 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 133 వికెట్లు పడగొట్టాడు. ఇప్పటివరకు ఎకానమీ రేటు 8.63 గా ఉంది. భారీ ధర కారణంగా మినీ వేలానికి ముందు టీమ్ నుంచి రిలీజ్ చేసే అవకాశం ఉంది. ఇక స్పిన్నర్ రాహుల్ చాహర్‌ను మెగా వేలంలో రూ.3.20 కోట్లు ఖర్చు చేసింది. ఈ సీజన్‌లో కేవలం ఒకే మ్యాచ్ ఆడే అవకాశం రాగా, అందులోనూ ఒకే ఓవర్ బౌలింగ్ చేశాడు. చాహర్ ఇప్పటివరకు 79 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 7.72 ఎకానమీతో 75 వికెట్లు పడగొట్టాడు. మినీ వేలానికి ముందుకు రాహుల్‌ను టీమ్ నుంచి రిలీజ్ చేసే అవకాశాలు ఉన్నాయి.

## పసిడి తనఖా రుణాలు
# రూ.2.94 లక్షలకోట్లు
### ఎంఎఫ్ఐ రుణాలకంటే ఇదే బెటర్‌అంటున్న కస్టమర్లు



**ముంబయి, సెప్టెంబరు 16:** దేశంలో అల్పాదాయ వర్గాలు ఇప్పటివరకూ తమకు అత్యవసరాలకు అనువుగా ఉండేసూక్ష్మరుణ సంస్థలను కాదనిఇటీవలికాలంలో బంగారం తాకట్టురుణాలకే మొగ్గుచూపిస్తున్నారు. మైక్రోఫైనాన్స్ సంస్థలు ఇటీవలికాలంలో ఆంక్షలు పెంచడం వడ్డీలు కూడా ఎక్కువ కావడంతో రూపాయి వడ్డీకే బంగారం రుణాలు లభిస్తుండటం,దీనికితోడు బంగారంతాకట్టుపై ఇచ్చే రుణమొత్తం కూడా విలువల ఆధారంగాపెరుగుతుండటంతో చిననకుటుంబాలు బంగారంరుణాలపైనే ఎక్కువ ఆసక్తిచూపిస్తున్నాయి. రిజర్వుబ్యాంకు గణాంకాలను చూస్తే పసిడి తాకట్టు రుణాలు 122శాతం పెరిగాయి. అదే మైక్రోఫైనాన్స్ రుణాలు 16.5శాతం పడిపోయాయి. కొద్దికాలం క్రితం వరకూ అరక్షిత రుణాలపైనే ఆధారపడిన కస్టమర్లు ఇపుడు బంగారం రుణాలవైపు వస్తున్నారని సౌత్‌ఇండియన్‌బ్యాంకు సిజిఎం సంచయ్ సిన్హా వెల్లడించారు. ఈ ఆర్థికసంవత్సరం ఆరంభంలోనే ఎఫ్‌ఎంపై రంగం బకాయిలను అరికట్టేందుకు మూడంచెల వ్యూహం అనురించింది. ఒకటికంటే ఎక్కువ మంది వద్ద రుణాలు తీసుకునేందుకు వీలులేకుండా కట్టడిచేసింది. బంగారం తనఖా రుణాలు జులై నాటికి 2.94 లక్షలకోట్లకు పెరిగాయి. వార్షిక పద్ధతిలోచూస్తే 122శాతంపెరిగాయి. అలాగే క్రెడిట్‌కార్డు రుణాలుకూడా ఆరుశాతంపెరిగి 2.91 లక్షలకోట్లకు చేరాయి. ఇక వ్యక్తిగత రుణాలుకూడా 8శాతంపెరిగి 15.36 లక్షల కోట్లరూపాయలకు పెరిగినట్లు ఆర్‌బిఐ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. ఇక సూక్ష్మరుణసంస్థల స్థిరాస్థిప్రమాణాలు 16.5శాతం తగ్గి 1.34 లక్షలకోట్లకు పడిపోయాయి. బంగారంధరలు కూడా 44.14శాతం పెరిగాయి. పదిగ్రాము లధరలు 1,13,800రూపాయలుగా చెఆమణి అయింది. 2024 డిసెంబరులో 78,950 రూపాయలున్న ధరలు గణనీయంగా లక్షా 1.14 లక్షలకు పెరిగాయి. బంగారం తాకట్టురుణాలు ఎక్కువగా పశ్చి, ఉత్తర, తూరుప్రాంతాల్లో పెరిగాయి.

## నాలుగువేల డాలర్లకు చేరువలో
# ఔన్స్ బంగారం!



**చెన్నై, సెప్టెంబరు 16:** బంగారంధరలు మంగళవారం రికార్డుస్థాయికి పెరిగాయి. అమెరికా ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లలో కోత విదించగలదన్న అంచనాలు అమెరికా డాలర్ క్షీణించడం వంటివాటితో బంగారం ఒక్కటే సురక్షిత మార్గంగా ఇన్వెస్టర్లు ఎంచుకోవడంతో ధరలు ఒక్కసారిగాపెరిగాయి అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్‌లో ఔన్స్ బంగారం ధరలు 3697.70 డాలర్లకు పెరిగాయి. చివరకు ట్రేడింగ్ చివరిలో 3683.28డాలర్లుగా మారాయి. అమెరికా పసడిడి ఫ్యూచర్స్ డిసెంబరు నెల పంపిణీకి గాను 3720.10గా ముగిసాయి. అమెరికా డాలర్‌సూచీ మరింతగా క్షీణించి రెండునెలల కనిష్టానికి చేరింది. దీనితో బంగారం ఒక్కటే ఇన్వెస్టర్లకు సురక్షిత పెట్టుబడి మార్గంగా నిలిచింది. భారత్‌లో బంగారందరలు సరికొత్త గరిష్టాలను తాకాయి. ఎంసిఎక్స్‌లో అక్టోబరు ఫ్యూచర్స్ కాంట్రాక్టుల్లో 10 గ్రాములు రూ.1,10,548గా నడిచింది. స్పాట్ గోల్డ్ ధరలు మేజర్ నగరాల్లో పదిగ్రాములు 1,10,260 రూపాయలనుంచి 1,12,150రూపాయలవరకూ కొనసాగాయి. అయితే స్థానికమార్కెట్ల పరిస్థితులు, బంగారం స్వచ్ఛత ఆధారంగా ఈధరలు కొనసాగాయి. ఫెడ్‌రిజర్వు కనీసం 25 బేసిస్ పాయింట్లు కోత పెడుతుందన్న అంచనాలు మార్కెట్‌లో బలంగా వీస్తున్నాయి. 2026లో మరికొంత రేట్‌కట్‌లు ఉండవచ్చని ఆర్థికరంగ నిపుణులు అంచనావేసారు.

# ఫెడ్‌రిజర్వు ఫండ్‌రేట్లపై ట్రేడర్ల ఆసక్తి
### లాభాల్లో దూసుకువెళ్లిన సెన్సెక్స్ నిఫ్టీ




**ముంబయి, సెప్టెంబరు 16:** దేశీయ ఈక్విటీ మార్కెట్ల సూచీలు గరిష్టంగాపెరిగాయి. ట్రేడింగ్ చివరి సమయానికి సెన్సెక్స్ 594.95 పాయింట్లు పెరిగి 82,380.69 పాయింట్లవద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ కూడా 169.90 పాయింట్లు లాభపడి 25,239.10 పాయింట్లవద్ద ముగిసింది. కోటక్ మహీంద్ర బ్యాంకు సెన్సెక్స్‌లో టాప్ గెయినర్‌గా నిలిచింది. 264శాతం లాభపడి 2023గా షేర్లు నడిచాయి. ఎంఅండ్ఎం 2.44శాతం ఎల్‌అండ్‌టి 2.26శాతం, మారుతిసుజుకిలు 1.99శాతం భారతి ఎయిర్‌టెల్ 1.88శాతంచొప్పున పెరిగాయి. అలాగే టాటాస్టీల్‌కూడా 1.68శాతంపెరిగింది.

ఎల్‌అండ్‌టి, భారతి ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రబ్యాంకు, ఎంఅండ్ఎం, యాక్సిస‌బ్యాంకు వంటి ఐదుస్టాక్స్ సెన్సెక్స్ భారీ పెరుగుదలకు దోహదంచేసాయి. బిఎస్‌ఇ ఆటో సూచి 1.43శాతం లాభపడింది. బిఎస్‌ఇ టెలికామ్‌సూచీ 1.50శాతం పెరిగింది. మొత్తంగా 4309స్టాక్స్‌ట్రేడ్ అయితే 2540 స్టాక్స్ లాభాల్లో ముగిసాయి. 1577 స్టాక్స్ దిగువస్థాయిలోముగిస్తే 192 స్టాక్స్ స్థిరంగా కొనసాగాయి. 155 స్టాక్స్ 52 వారాల గరిష్టస్థాయిలో నడిస్తే మరో 55 ఇతర స్టాక్స్ 52 వారాల కనిష్టస్థాయిని నమోదుచేసాయి. 290 స్టాక్స్ ఈరోజు ఎగువ సర్క్యూట్‌లో ముగిసాయి. 131 ఇతర స్టాక్స్ దిగు వసర్క్యూట్స్‌లోనే చతికిలపడ్డాయి.

బిఎస్‌ఇ సెన్సెక్స్‌లో మారుతిసుజుకి 52 వారాల గరిష్టంగా అంటే 15,588.95కి చేరింది. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ హెడ్ వినోద్‌నాయర్ విశ్లేషిస్తూ రానున్న ఫెడ్‌రిజర్వు పాలసీ విదానాలపై ఇన్వెస్టర్లు ఎక్కువ దృష్టిసారించారు. మరోపక్క భారత్ అమెరికా వాణిజ్య చర్చలు ప్రారంభం అయ్యాయి. ఈ ప్రభావంకూడా మంగళవారం స్టాక్స్‌పై చూపించింది. ఆటోమొబైల్, వినియోగరంగ స్టాక్స్ భారీగా పెరిగాయి. కొత్త జీఎస్టీరేట్లు,

పండుగసీజన్ డిమాండ్ అంచనాలతో ఈరంగాలు మరింత దూసుకువెళ్లాయి. దేశీయంగా స్థూల ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉండటం, రాబడులుకూడా పెరుగుతుండటంతో ప్రస్తుత కంపెనీల విలువలు రిస్కలను అధిగమించేస్థాయిలో ఉండటంతో మార్కెట్లకు ఈ పరిణామాలు కలిసొచ్చినట్లు జియోజిత్ ప్రతినిధి తెలిపారు.

## ఆసియా మార్కెట్లలోనూ
# ఇండో-యుస్ వాణిజ్య చర్చలే!



### లాభాల్లో దూసుకువెళుతున్న ఆసియా మార్కెట్లు

**చెన్నై, సెప్టెంబరు 16:** భారత్, ఇతర ఆసియా మార్కెట్లు సానుకూల దోరణుల్లో ముందుకు సాగుతున్నాయి. అమెరికా భారత్ వాణిజ్య ఒప్పందాల చర్చలు ఓ కొలిక్కిరాగలవన్న అంచనాలతోపాటు ప్రపంచ ద్రవ్యపరపతి విధానం సరళీకృతం అవుతుందన్న అంచనాలు మార్కెట్లకు బలాన్నిఇచ్చాయి. బిఎస్ఇ సెన్సెక్స్ ఉదయానికే 300 పాయింట్లు పెరిగి 82 వేలస్థాయిని నమోదుచేసింది. అలాగే ఎన్ఎస్ఇ నిఫ్టీ సూచీ కూడా 25,150 పాయిట్లకు చేరింది. ఆటోసెక్టార్ అన్నింటికంటే లాభాల్లో దూసుకువెళ్లింది. టాటామోటార్స్, హీరోమోటోకార్ప్ మంచి పనితీరునుచూపించాయి. భారత్‌రూపాయి 12 పైసలు లాభపడింది. డాలర్ 88.04 రూపాయలకు చెలామణి అయింది.

మార్కెట్లన్నింటిలోనూ ట్రేడర్లు ఇండోయుఎస్ వాణిజ్యచర్చలపై ఎంతోనమ్మకం చూపించారు. ఈ చర్చలవల్లనే వాణిజ్యసంబంధాలు పెరుగుతాయన్న భావన పెరిగింది.హాంకాంగ్‌లో హ్యాంగ్‌సెంగ్ ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌కు అనుగుణంగా గరిష్టానికి వెళుతోంది. జపాన్‌నిక్కీ 225 కూడా ఎగువస్థాయికే వెళుతోంది. పటిష్టమైన కార్పొరేట్ రాబడులు మంచి ఫలితాలిచ్చాయి. చైనాలోని షాంఘై కాంపోజిట్ స్వల్పంగా లాభాల్లో ముగిసింది. ఇన్వెస్టర్లు స్థానిక ప్రభుత్వ విధివిధానాలపై ఎక్కువ ఫోకస్ పెంచారు. ఇక దక్షిణకొరియా కోస్పి కూడా పెరిగింది. టెక్నాలజీ స్టాక్స్‌కకు ఎక్కువ విదేశీ పెట్టుబడులు వచ్చాయి. తైవాన్ తాయ్‌ఎక్స్ కూడా గరిష్టస్థాయిలో నడిచింది. సెమికండక్టర్ రంగంలో భారీ ర్యాలీని నమోదుచేసింది. సింగపూర్ స్ట్రెయిట్‌టైమ్స్ సూచీ కూడా ఆర్థికరంగం,పారిశ్రామిక స్టాక్స్‌పరంగా ముందుకు దూసుకుపోయింది. ఆస్ట్రేలియా ఎఎస్‌ఎక్స్200 కూడా పెరిగింది. మెటీరియల్స్, ఇంధనరంగ స్టాక్స్ ఇక్కడ సూచీలకు మద్దతుగా నిలిచాయి. ఇక దేశీయ స్టాక్‌సూచీలపరంగా భారత్‌అమెరికా వాణిజ్య చర్చలు సానుకూల ఫలితాల్లోనే ఉంటాయని ఇన్వెస్టర్లలో విశ్వాసం పెరిగింది. అమెరికా ఫెడ్‌రిజర్వు వచ్చే సమీక్షలో ఫండ్‌రేట్‌కట్ ఉంటుందని, దీనివల్ల ప్రపంచస్థాయిలో ద్రవ్యలభ్యతపెరుగుతుందని ఈక్విటీలకు మంచి అండ లభిస్తుందన్న అంచనాలున్నాయి.

అయితే మార్కెట్ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయని దీనివల్ల ఇన్వెస్టర్లు, ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలనిసూచించారు.



## జీఎస్టీ నేపథ్యంలో మందులపై
# రీ లేబులింగ్ అవసరంలేదు!
### జాతీయ ఔషధ ధరల ప్రాధికార సంస్థ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 16:** ఫార్మాస్యూటికల్ రంగానికి కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. కొన్ని వైద్య పరికరాలపై జీఎస్టీ రేట్లను ఇటీవల తగ్గించిన నేపథ్యంలో, మార్కెట్లో ఇప్పటికే ఉన్న మందుల ప్యాకెట్లపై కొత్త ధరల స్టిక్కర్లను తప్పనిసరిగా అంటించాలన్న నిబంధనను రద్దు చేసింది. ఈనెల 22లోపు మార్కెట్లోకి విడుదలైన స్టాక్‌ను వెనక్కి పిలవడం లేదా రీ లేబులింగ్ చేయడం తప్పనిసరి కాదని ఫార్మాస్యూటికల్స్ విభాగం స్పష్టం చేసింది. ఈ నెల ప్రారంభంలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో వైద్య పరికరాలపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించిన విషయం తెలిసిందే. ఈ మార్పు నేపథ్యంలో, మార్కెట్లో ఉన్న పాత స్టాక్‌ను రీ లేబుల్ చేయడం ఆచరణ సాధ్యం కాదని, ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని ఫార్మా పరిశ్రమ ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) ఒక కీలక ప్రకటన జారీ చేసింది. పాత స్టాక్‌ను వెనక్కి పిలవాల్సిన అవసరం లేకుండా, సవరించిన ధరలతో కూడిన జాబితాను కంపెనీలు జారీ చేస్తే సరిపోతుందని తెలిపింది. ఈ కొత్త ధరల జాబితాను డీలర్లు, రిటైలర్లతో పాటు రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్లకు, ప్రభుత్వానికి అందించాలని సూచించింది. రిటైలర్లు తమ వద్ద ఆ జాబితాను వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించింది. దీనివల్ల మందుల సరఫరాలో ఎలాంటి అంతరాయాలు ఉండవని, రోగులకు మందుల కొరత ఏర్పడదని ప్రభుత్వం భావిస్తోంది. జీఎస్టీలో మరిన్ని సంస్కరణలు చేపట్టాలని అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మెడికల్ డివైస్ ఇండస్ట్రీ (ఏఐఎంఈడీ) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేసింది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) రిఫండ్లలో ఉన్న పరిమితులు, ఇన్వర్టెడ్ డ్యూటీ సమస్యలను పరిష్కరించాలని కోరింది. సర్వీసులు, క్యాపిటల్ గూడ్స్‌పై చెల్లించిన ఐటీసీకి కూడా రిఫండ్ అనుమతించాలని, ఇన్‌పుట్స్‌పై ఒకే విధంగా 5 శాతం జీఎస్టీ విధించాలని సూచించింది.

## క్రిబ్‌కో ఛైర్మన్‌గా వల్లభనేని సుధాకర్‌చౌదరి ఏకగ్రీవం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** క్రిషక్‌భారతి కోఆపరేటివ్ లిమిటెడ్ సొసైటీకి కొత్త ఛైర్మన్‌గా ప్రముఖ వ్యాపారవేత్త వల్లభనేని సుధాకర్‌చౌదరి ఎన్నికయ్యారు. మొన్నటివరకూ వైస్ ఛైర్మన్‌గా ఉన్న సుధాకర్‌చౌదరి క్రిబ్కో ఆఫీసు బేరర్ల సమావేశంలో ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డాక్టర్ చంద్రపాల్‌సింగ్ యాదవ్ వైస్‌ఛైర్మన్‌పదవిని సాధించారు. ఈ రెండు ఉన్నత పదవులకు ఒకే నామినేషన్లు దాఖలు కావడంతో ఎన్నికలకు ఏకగ్రీవం అయ్యాయి. కొత్త ఛైర్మన్ సుధాకర్‌చౌదరికి ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఎరువులు, వ్యవసాయ రంగాలను బలోపేతంచేయడంలోసుధాకర్‌చౌదరి, చంద్రపాల్‌సింగ్‌యాదవ్‌లకు అపార అనుభవం ఉంది. ఎన్నికలు సజావుగా జరిగేందుకు కేంద్రం యుపినుంచి ఇద్దరు మంత్రులు, ఎన్‌సియుఐ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. బోర్డుసభ్యులు ఇద్దరుమంత్రులమధ్య చర్చల తర్వాతనే నామినేషన్లు దాఖలయ్యాయి. కేంద్ర సహకారశాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్, యుపి సహకారమంత్రిజెపిఎస్ రాథోడ్ రెండునామినేషన్లకు ఆమోదం తెలిపారు. వైస్‌ఛైర్మన్‌పదవికి గుజరాత్‌కు చెందిన మగన్‌భాయ్‌పటేల్, బిపిన్‌పటేల్‌లపేర్లుపరిశీలనకు వచ్చాయి. అయితే బిపిన్ చివరికి చంద్రపాల్‌యాదవ్‌ను సిఫారసుచేసారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14